PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 331 | విజయవాడ, గురువారం 3 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 3 July 2025 | Rs

కేసుల దర్యాప్తు కోసం ఫోన్ ట్యాపింగ్‌ను చట్టం అనుమతించదు

- కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు మద్రాస్ హైకోర్టు షాక్
- 2011లో జారీ చేసిన ఉత్తర్వులు రద్దు

5

తొమ్మిదో తేదీన జరగనున్న అఖిలభారత సార్వత్రిక సమ్మెపై ప్రచురించిన ప్రత్యేక సంచికను నేటి పత్రికతో అందుకోగలరు

-ఎడిటర్

స్వర్ణ కుప్పం నా లక్ష్యం

ప్రజావేదిక సభలో చంద్రబాబు ప్రకటన

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

ఈ ఏడాదిలోనే కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నీళ్లు పారిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రూ.3,890 కోట్లతో హంద్రీనీవా పనులు పూర్తి చేస్తున్నామని, కుప్పంలో చివరి ఆయకట్టు వరకూ నీళ్లు తీసుకొస్తామని తెలిపారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానని, స్వర్ణ కుప్పం నా లక్ష్యమని అన్నారు. బెంగళూరు విమానాశ్రయం నుంచి కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం తుంశి గ్రామంలోని ఎపి మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభకు బుధవారం ఆయన రోడ్డు మార్గాన చేరుకున్నారు. ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ బ్రాండ్ కుప్పం ఎస్టాబ్లిష్ చేస్తామని, ఇందులో భాగంగా కుప్పంలో తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తామని అన్నారు. కుప్పంలో రూ.850 కోట్లతో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. విమానాశ్రయానికి భూములిచ్చే రైతులకు మెరుగైన ప్యాకేజీ ఇస్తామన్నారు. కుప్పంలో ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానల్ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనకు తెలిసింది ప్రజాహిత రాజకీయాలు మాత్రమేనన్నారు. రాక్షసులపై యుద్ధం చేస్తున్నానని, అభివృద్ధి, సంక్షేమ కోసం యజ్ఞం చేస్తున్నానని, యజ్ఞ ఫలితాలను ప్రజలకు అందిస్తానని పేర్కొన్నారు. తప్పు చేసే వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కుప్పంలో రూ.1292 కోట్ల రూపాయల విలువైన పనులను చేస్తున్నామని, ఇప్పటికే రూ.125 కోట్ల విలువైన పనులు కూడా పూర్తయ్యాయని, వాటిని ప్రజావేదిక నుంచి ప్రారంభించానని తెలిపారు. స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా రహదారులను సిసి, బిటి రోడ్లుగా మారుస్తున్నామన్నారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు అందుతున్నాయని, ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లకుండానే పౌరసేవలు అందేలా వాట్సప్ గవర్నెన్సును రూపొందించామని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సమస్యకు పరిష్కారం లభించేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు.

తిమ్మరాజుపల్లెలో ఇంటింటికి ప్రచారం కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

సుపరిపాలనతో.. ఇంటింటికీ

శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లెలో ఇంటింటికీ ప్రచారం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి చంద్రబాబు నిర్వహించారు. సుపరిపాలన తొలి అడుగులో భాగంగా మీ ముందుకు వచ్చానన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే నెల రోజుల పాటు ఇంటింటికీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని, తాము రాష్ట్రాన్ని వికాసం వైపు నడుపుతున్నామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను గ్రామస్తులకు ఇళ్ల వద్దకు వెళ్లి వివరించారు. మొత్తం 26 ఇళ్లకు వెళ్లాల్సి ఉండగా తొలుత ఎం.నాగరాజు ఇంటికి వెళ్లారు. ఆ ఇంట్లోని వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఏం చదువుకుంటున్నారని ఆరా తీశారు. త్వరలో తమ ప్రభుత్వం అమలు చేసే మిగిలిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. చదువుకుంటున్న పిల్లల గురించి మిగతా 2లో

రష్యా ఉత్పత్తులు కొనుగోలు చేస్తే...
500 శాతం సుంకం

- హెచ్చరించిన అమెరికా

వాషింగ్టన్ : రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే దేశాలపై ఏకంగా 500 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా హెచ్చరించింది. ఈ విషయాన్ని ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన టారిఫ్ బిల్లు సూచిస్తోంది. ఈ బిల్లును వచ్చే నెలలో సెనెట్ ముందు ఉంచే అవకాశం ఉంది. సెనెటర్ లిండ్సే గ్రహం ఏబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారీ సుంకాల ప్రతిపాదనను బయటపెట్టారు. 'మీరు రష్యా నుండి ఉత్పత్తులు కొనుగోలు చేసినా, ఉక్రెయిన్‌కు సాయం అందించకపోయినా అమెరికాలో ప్రవేశించే మీ వస్తువులపై ఐదు వందల శాతం సుంకం విధిస్తారు. భారత్, చైనాలు రష్యా చమురులో 70 శాతం కొనుగోలు చేస్తున్నాయి. తద్వారా ఆ దేశాలు పుతిన్ యుద్ధానికి బాసటగా నిలుస్తున్నాయి' అని ఆయన తెలిపారు. రష్యా నుండి చమురు, ఇతర వస్తువులు కొనుగోలు చేయకుండా భారత్, చైనా వంటి దేశాలపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ బిల్లును ఉద్దేశించామని, దీని ద్వారా రష్యా యుద్ధాన్ని బలహీనపరచి ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేలా మాస్కోను ఒప్పించాలని భావిస్తున్నామని గ్రహం చెప్పారు.

అతి తక్కువ సుంకాలతోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం : ట్రంప్

భారత్‌తో కుదుర్చుకోబోయే వాణిజ్య ఒప్పందం కారణంగా అమెరికా కంపెనీలపై సుంకాల భారం అతి తక్కువగానే పడుతుందని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ట్రంప్ బుధవారం ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడారు. 'భారత్ మన దేశంతో ఒప్పందానికి వస్తుందని అనుకుంటున్నాను. ఈ ఒప్పందం భిన్నంగా ఉంటుంది. మనం భారత్‌లో ప్రవేశించి పోటీ పడవచ్చు. ప్రస్తుతం భారత్ ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు. కానీ మనకు ఆ అవకాశం ఇస్తుందని భావిస్తున్నా. వారు అలా చేస్తే మనం అతి తక్కువ సుంకాలకే ఒప్పందం కుదుర్చుకుంటాం' అని ట్రంప్ తెలిపారు. అమెరికా నుండి భారత్‌కు దిగుమతి అయ్యే ఉత్పత్తులపై సుంకాలు తక్కువగా ఉండేలా రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకోబోతున్నాయని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పిన కొద్ది గంటల వ్యవధిలోనే ట్రంప్ ఈ వ్యాఖ్య చేశారు. కాగా సుంకాల అమలుకు ట్రంప్ ఇచ్చిన 90 రోజుల గడువు ఈ నెల 9న ముగుస్తున్న తరుణంలో ఆలోగానే ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్ కోరుకుంటోంది. చర్చలు తుది దశకు చేరుకున్నాయని విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా చెప్పారు.

కరేడు గ్రామస్తులతో వామపక్ష పార్టీల నాయకులు

మా భూములు తీసుకుంటే మేమెలా బతకాలి?

అయ్యా మీరే న్యాయం చేయండి...

వామపక్ష నేతల ఎదుట కరేడు బాధితుల వేడుకోలు

ప్రభుత్వం భూసేకరణ ప్రకటన వెనక్కి తీసుకోవాలి

ఎర్రజెండా అండగా ఉంటోందని నేతల భరోసా

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

'అయ్యా ఇక్కడే పుట్టాం. ఇక్కడే చస్తాం. మా ఇళ్లు. మా భూములు వదలి ఎక్కడికీ వెళ్లాలి. భూములు కోల్పోతే మేము ఏం చేసి బతకాలి. మీరే న్యాయం చేయండి' అంటూ కరేడు బాధితులు వామపక్ష నేతల ఎదుట తమ ఆవేదన వెలుబుచ్చారు. ఇండో సోలార్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం 8,639 ఎకరాల తీసుకుంటోంది. అందులో భాగంగా 4,300 ఎకరాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. పది వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు బుధవారం కరేడులో పర్యటించారు. ప్రజలను కలిసి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. కరేడు గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. పేద దళితులు, గిరిజనుల మాటలకు చలించిపోయారు. రైతుల బాధలను శ్రద్ధగా విన్నారు. ఎర్రజెండా మీకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రభుత్వం భూసేకరణ నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రామాయపట్నం పోర్టు ప్రాంతంలో ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు నిర్మాణం కోసం పేద, మధ్య తరగతి రైతులకు చెందిన 8,639 ఎకరాల భూములను సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా కరేడు గ్రామ పరిధిలో 4,300 ఎకరాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల నాలుగున ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీల నేతలు బుధవారం ఈ గ్రామానికి వచ్చారు. తొలుత రామకృష్ణాపురం గిరిజనవాడకు వెళ్లారు. అక్కడ ప్రజలతో మాట్లాడారు. రామలక్ష్మమ్మ మాట్లాడుతూ... తాము ఇక్కడే పుట్టామని, ఇక్కడే చస్తామని, మమ్మల్ని ఇక్కడ నుంచి ఎవరూ పంపింపిచలేరన్నారు. అవసరమైతే ఆ పరిశ్రమే ఇక్కడ నుంచి వెళ్లాలని, సిపిఎం పోరాట ఫలితంగా ఈ కాలనీ ఏర్పాటు చేసుకున్నామని, మౌలిక వసతులు కల్పించుకున్నామని, ఇప్పుడు ఇక్కడ నుంచి తరిమేస్తే ఎక్కడకు వెళ్లి, ఏం పనిచేసుకోవాలని ప్రశ్నించారు. మా ఊరును మిగతా 2లో

'ఇఎల్‌ఐ'ను రద్దు చేయండి

- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల (ఇఎల్ఐ) పేరిట కార్పొరేట్లకు భారీగా రాయితీలు ఇచ్చే పథకాని కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. బడా కార్పొరేట్ సంస్థలకు ప్రజాధనాన్ని బదిలీ చేసేందుకే ఈ పథకం ఉద్దేశించారని తెలిపింది. కార్మికులను పణంగా పెట్టి కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేసిన మరో ప్రయత్నంగా ఈ పథకాన్ని పేర్కొంది.ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి మరో ఉదాహరణగా ఈ పథకాన్ని ప్రారంభించింది. యువతను మోసం చేసేందుకు ఉద్యోగ అవకాశాల కల్పన, ఉపాధి పొందే సామర్థ్యాలను పెంపొందించడం, సామాజిక భద్రత కల్పించడం వంటి హామీల ముసుగులో కార్పొరేట్లకు ప్రభుత్వ నిధులను బదిలీ చేసేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారని వివరించింది. పెట్టుబడుల వ్యయానికి, ఉత్పత్తి వ్యయాలకు, కార్మిక ఖర్చులకు దేశీయ, విదేశీ యజమానుల చట్టబద్ధమైన రుణాలకు ప్రభుత్వ ఖజానా నుండి సబ్సిడీ మొత్తాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యమని సిపిఎం తెలిపింది. 'గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు లబ్ధి చేకూర్చే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) కు కేటాయింపులను బిజెపి ప్రభుత్వం తగ్గిస్తోంది. పట్టణ ప్రాంతాలకు కూడా ఇటువంటి ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలనే డిమాండ్‌ను పట్టించుకోవడం లేదు. అదే సమయంలో, కార్పొరేట్లకు మాత్రం ప్రోత్సాహకాల పేరుతో పెద్ద మొత్తంలో రాయితీలు అందచేస్తోంది' అని పేర్కొంది. పెద్ద సంఖ్యలో ఖాళీలను భర్తీ చేయడం ద్వారా కనీస వేతనాలు, ఉపాధి భద్రత, సామాజిక భద్రతలతో ఉపాధికి హామీ కల్పిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే కార్పొరేట్ వర్గానికి సబ్సిడీలు ఇవ్వడానికి బదులుగా తగిన మొత్తంలో నిధులు కేటాయించి ఆరోగ్యం, విద్య, ప్రజా రవాణా, తదితర ప్రజా సేవలను విస్తరించాలని కోరింది.

నిర్లక్ష్యంతోనే ఫార్మా కంపెనీల్లో భారీ ప్రమాదాలు

- యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి, తనిఖీలు పెంచాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

3

బ్రిక్స్ పట్ల భారత్ నిబద్ధత

- పేద దేశాల ప్రాధాన్యతలపై చర్చ
- ఐదు దేశాల పర్యటనకు బయలుదేరిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : పేద దేశాల (గ్లోబల్ సౌత్) ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్ళేందుకు గల మార్గాలపై రాబోయే రోజుల్లో భారత్, బ్రెజిల్ చర్చిస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం చెప్పారు. 9 వరకు జరగనున్న ఐదు దేశాల్లో దౌత్యపర్యటనకు బయల్దేరుతున్న సందర్భంగా ఒక ప్రకటన జారీ చేశారు. రియో డీ జెనీరోలో జరగబోయే బ్రిక్స్ సదస్సు 'సమతుల్యమైన బహుళ ధృవ ప్రపంచ వ్యవస్థ'ను ఏర్పాటు చేయడానికి దోహదపడుతుందని అన్నారు. వారం రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ప్రధాని ఘనా, ట్రినిడాడ్,టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లో పర్యటిస్తారు. గ్లోబల్ సౌత్ పరిధిలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందన్నారు. వ్యవస్థాపక దేశంగా బ్రిక్స్ పట్ల భారత్ నిబద్ధతతో వుందన్నారు. ఆవిర్భవిస్తున్న ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారానికి ఇదొక కీలకమైన వేదిక అని వ్యాఖ్యానించారు. మనందరం కలిసి మరింత శాంతియుతమైన, సమానమైన, న్యాయమైన, ప్రజాస్వామ్యయుతమైన, బహుళ ధృవ ప్రపంచవ్యవస్థ కోసం కృషి చేయాలని ప్రధాని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా ఆయన ఘనాకు బుధవారం చేరుకున్నారు. ఇక్కడ రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రామాని మహమాతో మోడీ చర్చలు జరుపుతారు.

ఘనా పార్లమెంట్‌లో మోడీ ప్రసంగించనున్నారు. ఆఫ్రికన్ యూనియన్‌లో కీలక పాత్ర పోషించే ఘనా గ్లోబల్‌సౌత్‌లో చాలా విలువైన భాగస్వామి అని మోడీ వ్యాఖ్యానించారు. ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, డిజిటల్ మౌలిక వసతులు, రక్షణ రంగాల్లో పలు ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. అక్కడ నుండి ట్రినిడాడ్, టొబాగో వెళతారు. టొబాగో అధ్యక్షులు క్రిస్టిన్ కార్లా కంగ్లూ ఈ ఏడాది ప్రవాసి భారతీయ దివస్‌కు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఆ తర్వాత బ్యూనస్ ఎయిర్స్‌కు వెళతారు. 57ఏళ్ళలో అర్జెంటీనాలో పర్యటించనున్న తొలి భారత ప్రధాని మోడీ. లాటిన్ అమెరికాలో కీలకమైన ఆర్థిక భాగస్వామి అయిన అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలెతో చర్చలకు ఎదురుచూస్తున్నానని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. చివరగా నమీబియాలో పర్యటించనున్నారు.

ఘనాలోని అక్రాలో మోడీకి స్వాగతం పలుకుతున్న అధికారులు

డిగ్రీ అడ్మిషన్లు ఇంకా ఆలస్యం

- ఇఎపిసెట్ తొలి కౌన్సిలింగ్ తరువాతే నిర్వహణ

5

వరదలకు బాధ్యులెవరో తేల్చండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

గతేడాది విజయవాడలో సంభవించిన వరదలకు జరిగిన నష్టానికి, వరదలకు 60 మంది ప్రాణాలు కోల్పోయారని, ఈ ప్రాణ నష్టానికి ఎవరు బాధ్యులో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రకృతి ప్రకోపించిందని చెప్పి ఎవరూ బాధ్యులు కాదంటే వీలుకాదని తేల్చి చెప్పింది. విచారణ జరిపి బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలంది. సమగ్ర వివరాలను నివేదించాలని, కౌంటర్ వేయాలని ఆదేశించింది.

కనీసం అంతర్గత విచారణ ఏమైనా చేశారో లేదో చెప్పాలంది. విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. వరద వస్తుందని తెలిసి కూడా జనాన్ని అప్రమత్తం చయలేదంటూ జర్నలిస్ట్ నాతాని భూపతిరావు వేసిన పిల్‌పై హైకోర్టు పై విధంగా వ్యాఖ్యానించింది.

భూములు అమ్ముతున్నారా ?

- 'అమరావతి'పై ప్రపంచబ్యాంకు ఆరా..!
- సిఆర్‌డిఎపై మొదలైన ఒత్తిడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి పరిధిలో ఆదాయం కోసం భూములు అమ్ముతామన్న నిర్ణయాన్ని ఇప్పటివరకు ఎంతమేర అమలు చేశారని ప్రపంచబ్యాంకు ప్రశ్నించింది. అమరావతి పనులపై నిరంతరం పర్యవేక్షణ, సమీక్షలు చేపట్టిన ప్రపంచబ్యాంకు, ఎడిబి ప్రతినిధులు ఈ మేరకు అధికారులను వివరాలను అడిగినట్లు తెలిసింది. అమ్మిఉంటే ఎంత భూమి అమ్మారు? వాటి ద్వారా వచ్చిన నగదు ఎంత? ఇంకా అమ్మకాలు ప్రారంభించకపోతే ఎందుకు ఆ ప్రక్రియ చేపట్టలేదన్న వివరాలను తెలియచేయాల్సిందిగా వారు కోరినట్లు తెలిసింది. అమ్మకాలు ప్రారంభించకపోతే ఎప్పటి నుండి ప్రారంభిస్తారో తెలపాలని, నిర్దేశించిన లక్ష్యం మేరకు అమ్మకాలు ఎంత కాలంలో పూర్తవుతాయో కూడా చెప్పాలని కోరినట్లు సమాచారం. రాజధాని నిర్మాణానికి ప్రపంచబ్యాంకును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి సమీకరించిన భూములను అమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటామని ప్రపంచబ్యాంకుకు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సిఆర్‌డిఎ పరిధిలో రూ.43 వేల కోట్ల విలువైన పనులకు అధికారులు టెండర్లు పిలిచారు. వీటిల్లో ఐకానిక్, జిఎడి టవర్ల నిర్మాణానికి లెటర్ ఆఫ్ అవార్డు(ఎల్ఒఎ) కూడా ఇచ్చారు. మరో రూ.11 వేల కోట్ల విలువైన పనులు చేపట్టాల్సి ఉంది. దీనిలో ప్రపంచబ్యాంకు రూ.15 వేల కోట్లు ఇస్తోంది. బ్యాంకు రుణం తిరిగి చెల్లింపు గడువుకు మారిటోరియం ఎక్కువ ఉన్నా నిబంధనలు మాత్రం చెప్పినవి చెప్పినట్లు అమలు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనిలో భాగంగా రుణాలు తిరిగి చెల్లించేందుకు వీలుగా అమరావతి నగరంలో సిఆర్‌డిఎకు సంక్రమించిన భూములను వేలంలో అమ్ముతామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రపంచబ్యాంకు గుర్తుచేస్తోందని సమాచారం. ఎకరం రూ.25 కోట్ల నుండి రూ.30 కోట్ల వరకూ పలుకుతుందని ఇప్పటికిప్పుడుగా 100 నుండి 800 ఎకరాల వరకూ అమ్మకానికి అవకాశం ఉంటుందని, దీని ద్వారా రూ.20 వేల కోట్ల ఆదాయం వస్తుందని అప్పట్లో సిఆర్‌డిఎ అధికారులు ప్రపంచబ్యాంకుకు చెప్పారు. అలాగే నిర్మాణం పూర్తయిన తరువాత వచ్చే యూజర్ ఛార్జీల నుండీ కొంత అప్పులు తీరుస్తామని అగ్రిమెంటు చేసుకున్నారు. దీనిపైనే ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం ప్రారంభించారని సమాచారం. ఒప్పందంలో పేర్కొన్న అంశాలు యధావిధిగా అమలుకాకపోతే చెల్లింపుల్లో జాప్యం అవుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా భూముల అమ్మకాలు ప్రారంభిం చాలని, ఒప్పందంలో పేర్కొన్న విధంగా దీనిపై వీలైనంత త్వరగా కార్యాచరణ ప్రారంభించాలని కోరినట్లు తెలిసింది.

ఎస్‌సి గురుకులాల్లో బోధనా సిబ్బంది కాంట్రాక్టు పునరుద్ధరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న బోధనా సిబ్బంది కాంట్రాక్టును పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్) ఆధ్వర్యాన పనిచేస్తున్న 760 మంది బోధనా సిబ్బంది కాంట్రాక్టును ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకూ 11 నెలలు పునరుద్ధరించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒక నెల బ్రేక్ సమయంలో 'నో వర్క్-నో పే' సిద్ధాంతం ప్రకారం ఎటువంటి చెల్లింపులు ఉండవని తెలిపారు.

పాపికొండల విహారయాత్రకు బ్రేక్

- దుడుమలో ప్రమాద స్థాయికి నీటిమట్టం

ప్రజాశక్తి - దేవీపట్నం (అల్లూరి జిల్లా)

పాపికొండల విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టూరిజం శాఖ అధికారులు తెలిపారు. భారీగా వర్షాలు కురవడం, గోదావరి నదిలో నీటిమట్టం గణనీయంగా పెరగడం వల్ల విహారయాత్రను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

దేవీపట్నం మండలంలో గండి పోచమ్మతల్లి ఆలయం వద్ద గోదావరి వరద భారీగా చేరుకుంది. బుధవారం సాయంత్రానికి అమ్మవారి ఆలయ సమీపంలో రోడ్డు పైకి నీరు చేరుకుంది. గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉండడంతో అమ్మవారి ఆలయంలో సందర్శకులు కానుకలు వేసే హుండీలను దేవస్థాన అధికారులు తెరిచి లెక్కించారు. ప్రస్తుతం దేవీపట్నం మండల ప్రాంతంలో గోదావరి వరద పరిస్థితి తీవ్రంగా ఉంది.

దుడుమలో ప్రమాద స్థాయికి నీటిమట్టం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని డుడుమ జలాశయం నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకుంది. జలాశయం నీటిమట్టం 2,590 అడుగులు కాగా, ప్రస్తుతం 2,588.3 అడుగులకు చేరుకుంది. ఏడో నెంబర్ గేటు ఎత్తి దిగువన ఉన్న బలిమెల జలాశయానికి నీరు విడుదల చేస్తున్నారు.

సమ్మె విరమించాలని అధికారుల బెదిరింపులు

- పెట్రోల్ బాటిళ్లతో కర్నూలులో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి- యంత్రాంగం

సమ్మె విరమించాలని, లేకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని, టెంట్ ఎత్తేస్తామని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బెదిరింపులకు దిగారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని మున్సిపల్ కాంట్రాక్టు ఇంజనీరింగ్ కార్మికులు పెట్రోల్ బాటిళు చేతబట్టుకుని బుధవారం నిరసన తెలిపారు. సమ్మెను నీరుగార్చేందుకు అధికారులు ప్రయత్నించడం దారుణమని, బలవంతపు ప్రయత్నాలకు పాల్పడితే ఆత్మహత్యలు చేసుకుంటామని కార్మికులు హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగుతుందని జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మధు, ఆంజనేయులు మద్ది భాయ్, కార్మికులు హెచ్చరించారు. విజయవాడ ధర్నా సెంటర్‌లో వాటర్ సెక్షన్‌లోని కార్మికులు తమ పనిముట్లతో నిరసన తెలిపారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... మున్సిపల్ ఇంజనీరిం గ్ కార్మికుల న్యాయమైన డిమాండ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే శుక్రవారం తర్వాత పారిశుధ్య కార్మికులను కలుపుకొని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. "మీరు సమ్మెను విరమించండి...గ్రూప్ ఆఫ్ మినిస్ట్రీస్‌తో చర్చలు జరుపుతామని" మంగళవారం సిడిఎంఎను కలిసిన సందర్భంలో చెప్పారన్నారు. కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామని సిడిఎంఎ వద్ద స్పష్టం చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులను సమీకరించి శుక్రవారం విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా గుత్తిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా కూర్చొని కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

కర్నూలు సమ్మె శిబిరంలో పెట్రోల్‌బాటిళ్లతో నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికశాఖ జోక్యం చేసుకోవాలి
ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన పోరాటం విషయంలో కార్మికశాఖ వెంటనే జోక్యం చేసుకుని కార్మికుల సమ్మె డిమాండ్లను పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు విజయవాడలో కార్మికశాఖ కమిషనర్ ఎంవి శేషగిరిబాబును ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల బృందం బుధవారం కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నైపుణ్యానికి తగిన జీతాలు చెల్లించకపోవడంతో గత ఏడేళ్లుగా ఒక్కో కార్మికుడు రూ.లక్షల్లో నష్టపోయారన్నారు. కేటగిరిల నిర్ణయంలో 2018లో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని, కార్మికశాఖ 2012లో జారీ చేసిన ఉత్తర్వులు ఆధారంగా కేటగిరిలను నిర్ణయించి జిఓ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, గతేడాది కాలంగా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సమస్య పరిష్కరించడం లేదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడం వదిలేసి, న్యాయం కోసం చేస్తున్న పోరాటంపై ఉక్కుపాదం మోపాలని ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని జులై 4వ తేదీ తరువాత నిర్వహించ తలపెట్టిన సమ్మెకు సంబంధించి జూన్ 7, జులై 1వ తేదీన రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చినప్పటికీ, కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశం నిర్వహించకుం డా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కార్మికశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్మికశాఖ కమిషనర్ శేషగిరిబాబు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమ్మె డిమాండ్లను పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, కోశాధికారి జ్యోతిబసు, రాష్ట్ర నాయకులు చిన్న, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

చావు తప్ప వేరే మార్గం లేదు

- సెల్ఫీ వీడియో తీసి రియల్టర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అప్పులు బాధ తాళలేక చనిపోతున్నానంటూ ఓ సెల్ఫీ వీడియో తీసి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రియల్టర్ ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని అమ్మినేని వీధికి చెందిన బొజ్జ రాజేంద్రప్రసాద్ (50) రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించేవారు. స్థానిక కృష్ణానగర్‌లోని తన కార్యాలయంలో వ్యాపార లావాదేవీలు జరిపేవారు. వ్యాపార నిమిత్తం పలువురి వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేశారు. వ్యాపారాలు ముందుకు సాగక పోవడంతో నష్టాల్లో కూరుకుపోయారు. అధిక వడ్డీలు కట్టలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. 'వడ్డీలు ఎక్కువయ్యాయని, వాటిని కట్టలేని పరిస్థితుల్లో ఉన్నానని, చావు తప్ప వేరే మార్గం లేదని, భార్య, బిడ్డలు క్షమించాలి' అని కోరుతూ సెల్ఫీ వీడియో తీసుకుని తన కార్యాలయంలోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన వారు తలుపులు తట్టినా తీయకపోవడంతో కిటికిలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ రాజేంద్రప్రసాద్ కనిపించడంతో కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాజేంద్రప్రసాద్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దారుణ హత్య

- కాలును నరికి పోలీస్ స్టేషన్ వద్ద పడేసిన దుండగులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వివాహేతర సంబంధం ఓ వ్యక్తి దారుణ హత్యకు దారి తీసింది. కర్నూలు రూరల్ మండలం, సూదిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి సుమారు పది గంటలకు శేషన్న (54) తన ఇంట్లో నిద్రిస్తుండగా నలుగురు నిందితులు ఇంటిలోకి వచ్చి రాడ్లు, కర్రలతో, కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారని మృతుని భార్య, కూతురు తెలిపారు. హత్య చేసిన అనంతరం మృతుని కాలును నరికి సూదిరెడ్డిపల్లె గ్రామం నుంచి తాలూకా పోలీస్ స్టేషన్ వరకు మోటార్ సైకిల్‌పై ప్రదర్శనగా తీసుకువెళ్లి పోలీస్ స్టేషన్ సమీపంలో పడేశారు. హత్య చేసిన దుండగులు నలుగురు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వివాహేతర సంబంధం, గతంలో తగాదాలు ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

కర్నూలు టు విజయవాడ విమాన సర్వీసు ప్రారంభం

- ఓర్వకల్ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి చర్యలు : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. బుధవారం కర్నూలు టు విజయవాడ విమాన సర్వీసును వర్చువల్‌గా ఢిల్లీ నుంచి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. కర్నూలు ఎయిర్ పోర్టు నుంచి మంత్రులు టిజి. భరత్, బిసి జనార్ధన్‌రెడ్డి, ఎంపిలు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పాల్గొన్నారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ...ఉమ్మడి కర్నూలు జిల్లాకు, అనంతపురం జిల్లాకు ఈ విమాన కనెక్టివిటీ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రస్తుతం ఈ సర్వీస్ వారంలో మూడు రోజులు నడిచేలా ప్రారంభించామని, అతి త్వరలో ఏడు రోజులు నడిచేలా చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రయాణికుడికి టికెట్‌ను అందిస్తున్న రాష్ట్ర మంత్రులు బిసి జనార్ధన్‌రెడ్డి, టిజి.భరత్, కర్నూలు, నంద్యాల ఎంపీలు

కర్నూలు ఎయిర్‌పోర్టులో నైట్ ల్యాండింగ్ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కర్నూలు జిల్లా ప్రజలు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకొని 100 శాతం ఆక్యుపెన్సీ ఉండే విధంగా సహకరించాలని, ఎయిర్ పోర్ట్ సేవలను ప్రోత్సహించాలని కోరారు. మంత్రులు బిసి జనార్ధన్ రెడ్డి, టిజి భరత్ మాట్లాడుతూ... కర్నూలు - విజయవాడ విమాన సర్వీసును ప్రారంభించిన ఇండిగో సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. కర్నూలు ఎయిర్ పోర్టులో నైట్ ల్యాండింగ్ ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతం ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతున్నందున రాబోయే కాలంలో ఇది చాలా అవసరమని తెలిపారు. కర్నూలు ఎయిర్ పోర్ట్ నుండి ప్రతిరోజు విమాన సర్వీసులు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు.

సింగయ్య మృతిపై విచారణకు భయపడుతున్న జగన్

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సింగయ్య మృతిపై విచారణకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భయపడుతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ఈ కేసులో దర్యాప్తును నిలిపివేయాలని హైకోర్టు స్టే ఇవ్వడం ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎపి ఎంవి యాక్ట్ నమోదైన ఈ కేసులో పూర్వాపరాలు పరిశీలించకుండా తదుపరి చర్యలు నిలిపివేయాలని కోర్టు అనడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే హైకోర్టు ఇచ్చిన స్టేపై అప్పీల్‌కు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. జగన్‌పై ఉన్న అన్ని కేసులపై వేగంగా విచారణ జరిపించాలన్నారు.

తప్పును కప్పిపుచ్చుకునేందుకు యత్నం

తన బాబాయి వివేకానందరెడ్డి హత్యపై తప్పుడు ప్రచారం చేయించిన జగన్... సింగయ్య మృతిని పక్కదారి పట్టించలేరా? అని టిడిపి అధికార ప్రతినిధి, లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ప్రశ్నించారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సింగయ్య భార్యతో వైసిపి నాయకులు స్క్రిప్ట్ చదివిస్తున్నారని ఆరోపించారు.

పొగాకు కొనుగోలు వేగవంతం చేయండి

- సమాచారాన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి - పర్చూరు

నల్లబర్లీ పొగాకు కొనుగోలును వేగవంతం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి కోరారు. మార్కెఫెడ్ కొనుగోలు కేంద్రాల నుంచి సరైన సమాచారం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పర్చూరు ఎఎంసిలో మార్కెఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం నాయకులతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ... చిన్న, సన్నకారు రైతులకు సంబంధించిన పొగాకును ముందుగా కొనుగోలు చేయాలన్నారు. తమ ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లు చూసుకోవడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఏ రోజు ఏ రైతు సరుకును కొనుగోలు చేస్తారో ఆ వివరాలను ముందుగానే ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సమాచారం అందుబాటులో ఉంచాలని కోరారు. ఆ సమాచారాన్ని వ్యవసాయ సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలన్నారు. క్వింటాలు రూ.6,000, రూ 9000, రూ.12000 చొప్పున గ్రేడుల ప్రకారం కొనుగోలు చేస్తున్నారని, నిర్ణయించిన ధర ప్రకారం క్వింటాలు రూ.12 వేలకు కొనుగోలు చేయడం లేదని అన్నారు. వివిధ కారణాలు చూపి ఎక్కువ బేళ్లను రూ.6000కు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రయివేట్ కంపెనీలు ఏ రోజున ఎంత మొత్తంలో రైతులు నుంచి పొగాకు కొనుగోలు చేస్తాయో రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలని కోరారు. సరైన సమాచారం లేక దుద్దుకూరుకు చెందిన ఓ రైతు తన సరుకును కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారని, అయితే పొగాకు కొనుగోలు చేయకపోవడంతో ఆ రైతు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ విషయం గురించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు, సిపిఎం నాయకులు ఎం. డేవిడ్, కె. శ్రీనివాసరావు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

లోకో రన్నింగ్ స్టాఫ్ ఖాళీలను భర్తీ చేయాలి

- ఎఐఎల్ఆర్ఎస్ఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైల్వేలో లోకో రన్నింగ్ స్టాఫ్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, రన్నింగ్ స్టాఫ్ భద్రతా నిబంధనలు పాటించేలా అనుమతించాలని ఎఐఎల్ఆర్ఎస్ఎ డిమాండ్ చేసింది. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఎఐఎల్ఆర్ఎస్ఎ విజయవాడ డివిజన్ సమావేశం డివిజనల్ సెక్రటరీ ఆర్‌వి రాము అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు వివిఎల్ నరసింహులు, డివిజన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె రామకృష్ణ, బ్రాంచ్ సెక్రటరీ గౌరీ శంకర్ మాట్లాడుతూ.. లోకో రన్నింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హెచ్ఒఇఆర్ ప్రకారం రోజుకు పని గంటలు 8 గంటలకే పరిమితం చేయాలని, వరుసగా రెండు రాత్రులకు మించి నైట్ డ్యూటీ చేయించరాదన్నారు. వారానికోసారి 46 గంటల విశ్రాంతి, 16 గంటల ట్రిప్‌రెస్ట్, 30 గంటల పీరియాడికల్ రెస్ట్ ఇవ్వాలన్నారు. 2024 జూన్ ఒకటి నుంచి దక్షిణ మధ్య రైల్వేలో 28 రోజుల ఉగ్ర నిరసన తర్వాత ఏర్పాటు చేసిన మల్టీ డిసిప్లీనరీ కమిటీ, ముగ్గురు సభ్యుల రైల్వే కమిటీల నివేదికలు రన్నింగ్ స్టాఫ్ ప్రయోజనాలకు విరుద్ధంగా అత్యంత నిరాశజనకంగా ఉన్నాయన్నారు. ఇవి రన్నింగ్ స్టాఫ్ హక్కులను గణనీయంగా నిరాకరించే ప్రయత్నంగా భావించబడతాయన్నారు.

మా భూములు తీసుకుంటే మేమెలా బతకాలి?

(మొదటి పేజి తరువాయి)

మేం కాపాడుకుంటామని, మాకు అండగా ఉండాలని వేడుకున్నారు. సుజాతమ్మ మాట్లాడుతూ ఎన్ని లక్షల రూపాయలు ఇచ్చినా మా ఊరు ఖాళీ చేయబోమని, అవసరమైతే దేనికైనా సిద్ధమని తేల్చి చెప్పారు. 'ఇండోసోల్ వద్దు. మా భూములే మాకు ముద్దు. మా ఊరు మాకు కావాలి. కోట్లు ఇచ్చినా ఇక్కడి నుంచి కదలం' అంటూ స్థానికులు నినదించారు. గ్రామంలోని యువకులు మాట్లాడుతూ విజయవాడ నుంచి కమ్యూనిస్టు పార్టీల నాయకులు మా కోసం రావడం ఆనందంగా ఉందన్నారు. నాయకులు అక్కడి నుంచి ఉప్పరపాలెం ఎస్‌సి కాలనీకి వెళ్లారు. అక్కడ ప్రజలు, రైతులు తమగోడు వెళ్లబుచ్చారు. పొట్టేలగుంట, అలగాయపాలెం, దళిత ప్రాంతాల్లో నాయకులు పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. మా ఇళ్లు, మా భూములు ఇవ్వబోమని ప్రతి చోటా తెగేసి చెప్పారు. ఈ ప్రాంతంలో 4,300 ఎకరాలతోపాటు, 300 ఇళ్లు భూసేకరణ కింద తీసుకుంటున్నారు. కరేడు గ్రామంలో రైతులతో నాయకులు సమావేశమయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేదల భూములు, ఇళ్లు తొలగించడానికి కమ్యూనిస్టు పార్టీలు ఒప్పుకోవని, మీ వెంట చివరి వరకు ఉంటామని ధైర్యం చెప్పారు.

భూసేకరణ నోటీసులు వెనక్కి తీసుకోవాల్సిందే : వి.శ్రీనివాసరావు

కరేడు గ్రామం పరిధిలో భూసేకరణ కోసం ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌కు చట్టబద్ధత లేదని, దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజల అభిప్రాయం తీసుకోకుండా నోటీసులు ఎలా జారీ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం మరిచిపోయారా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో పరిశ్రమల కోసం 50 వేల ఎకరాలు తీసుకున్నారని, ఎన్ని పరిశ్రమలు పెట్టారో, ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో ఈ ప్రభుత్వం చెప్పగలదా? అని సవాల్ విసిరారు. పచ్చని పొలాలను ఇండోసోల్ కంపెనీకి కట్టబెడతారా అని ప్రశ్నించారు. ప్రజలు ఇక్కడ నుంచి వెళ్లరని, పరిశ్రమనే ఇక్కడ నుంచి మరోచోటుకు తరలించాలని డిమాండ్ చేశారు. పేదల భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. చిన్నచిన్న కూలి పనులు చేసుకుంటూ, సాగు చేసుకుంటున్న భూములుక పట్టాలి ఇవ్వాలని పోరాటం చేస్తుంటే ఇలాంటి చర్యలు ఏమిటని ప్రశ్నించారు. వెంటనే నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజలకు మద్దతుతో వామపక్ష పార్టీ ఆధ్వర్యాన పోరాడుతామని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు కెవివి ప్రసాద్ మాట్లాడుతూ తాము సాగు చేస్తున్న భూములను కాపాడుకోవడానికి కరేడు ప్రజలు చేస్తోన్న యుద్ధానికి ఎర్రజెండా అండగా ఉంటుందని, ఒక్క సెంటు భూమినీ ప్రభుత్వం తీసుకోవడానికి వీల్లేదని అన్నారు. ఆర్ఎస్‌పి నాయకులు జానకిరాములు, సిపిఐ ఎంఎల్ (న్యూ డెమొక్రసీ) నాయకులు వెంకటేశ్వర్లు, పిఎ సాగర్, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి సురేష్, సిపిఐ ఎంఎల్ నాయులు హరనాథ్, ఐఎఫ్‌టియు నాయకులు మోహన్, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పద్మ, సిపిఐఎంఎల్ (ప్రజాపంథా) నాయకులు నాంచారం, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. పుల్లయ్య, సీనియర్ నాయకులు మాల్యాద్రి, రైతు సంఘం నాయకులు రమణయ్య, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, జిల్లాకు చెందిన వామపక్ష పార్టీల నేతలు పాల్గొన్నారు. వామపక్ష నాయకులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సంజయ్‌కుమార్, నాయకులు వి. సుధీర్, వై.మల్లికార్జునరెడ్డి, ఎస్. నరేష్ కలిసి సంఘీభావం తెలిపారు.

గతంలో కూటమి నేతలు ఇలా..

2023 అక్టోబర్ 26న టిడిపి నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.."అధిక ధరకు డిస్కములు ట్రాన్స్‌ఫార్మర్లు (షిరిడి సాయి ఎలక్ట్రికల్ నుంచి) కొనుగోలు చేయడంపై సిబిఐ విచారణ జరపాలని" డిమాండ్ చేశారు. ఇది భారీస్కాం అని డిస్కములు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆరోపించారు.

2023 నవంబర్ 2న బిజెపి అధికార ప్రతినిధి లంకా దినకర్ మీడియాతో మాట్లాడుతూ.. ఇండోసోల్ సోలార్, షిరిడిసాయి ఎలక్ట్రికల్స్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల బినామీ కంపెనీలని ఆరోపించారు. అందుకే వారికి పవర్ ప్రాజెక్టులు, మెటీరియల్ సప్లై కాంట్రాక్టులు ఇచ్చారని విమర్శించారు.

2023 నవంబర్ 15న జనసేన నేత, ప్రస్తుత మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ.. అప్పటి ముఖ్యమంత్రి సన్నిహితులు 22 నెలల క్రితం ముందుకు తెచ్చిన డొల్ల కంపెనీ అని ఆరోపించారు. రామాయపట్నం సమీపంలో 5,148 ఎకరాలు వారికి కేటాయించారని, మరో 3,200 ఎకరాలు షిరిడిసాయి ఎలక్ట్రికల్స్‌కు సంబంధించిన వారికి కట్టబెట్టడానికి ప్రణాళిక రూపొందించారని విమర్శించారు.

వైద్య కళాశాలలపై నిఘా

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాణ్యమైన వైద్య విద్య ప్రమాణాల కోసం కళాశాలలపై నిఘా పెట్టాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్.. ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ అధికారులను ఆదేశించారు. విశ్వవిద్యాలయ పనితీరుపై బుధవారం ఆయన సమీక్షించారు. ప్రధాన విషయాలపై విశ్వవిద్యాలయం దృష్టిపెట్టకుండా సాధారణ బాధ్యతల నిర్వహణతో సాగుతోందన్నారు. వైద్య కళాశాలల్లో విద్యాబోధన నాణ్యతను పెంచడంపై ఇప్పటి వరకు దృష్టిసారించిన దాఖలాలు లేవన్నారు. కేవలం సిలబస్ తయారీ, పరీక్షల నిర్వహణకు పరిమితమైందని పేర్కొన్నారు. ఉన్నత వైద్య విద్య నాణ్యత కోసం మౌలిక సదుపాయాలు, బోధనా తీరులు, వైద్యులు, విద్యార్థుల హాజరుపై పటిష్ఠ నిఘా విధానాన్ని రూపొంచాలని ఆదేశించారు.

గృహ నిర్మాణశాఖ జిఎమ్‌గా వెంకట రమణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గృహ నిర్మాణశాఖ జనరల్ మేనేజరుగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వెంకటరమణను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఒడిలో ఎస్ఇగా పనిచేస్తున్న జయరామాచారి ఇప్పటి వరకు జిఎమ్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. వెంకటరమణ నియామకంతో జయరామాచారికి ప్రభుత్వం అదనపు బాధ్యతల నుంచి తప్పించింది. ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణాలకు కేటాయించిన ఇనుము పక్కదారి పట్టిందనే ఆరోపణలు వస్తున్న నేపధ్యంలో ఈ బదిలీ జరిగింది.

మెడికల్ స్టూడెంట్లను ఎందుకు వేధిస్తున్నారు?

- వైసిపి అధినేత జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విదేశాల్లో విద్యను అభ్యసించి ఇక్కడ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణులైనా వారికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని వైసిపి అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వడం ఫార్మాలిటీ అయినా వేధిస్తున్నారని, ఇదేనా పరిపాలన అని విమర్శించారు.

తప్పులను ఎత్తిచూపితే పోలీసులతో దాడులు చేయిస్తున్నారని, వారిపై వివక్ష చూపుతూ ఇంటర్న్‌షిప్ పేరుతో దీర్ఘకాలం చాకిరీ చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు మెడికల్ కళాశాలలకు లాభం కలిగిచేందుకే వీరికి రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వడం లేదని, తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని అప్పులు చేసి మరీ తల్లిదండ్రులు విదేశాల్లో చదివిస్తే వారిని అంటరానివారిగా చూస్తున్నారని ఆగ్రహించారు.

అవినీతి కోసం స్కాములు చేస్తూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూడా అడ్డుకున్నారని వివరించారు. పులివెందుల మెడికల్ కళాశాలకు ఎన్ఎంసి కేటాయించిన సీట్లను కూడా వద్దని ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. తల్లిదండ్రులు, విద్యార్థులపై ఇంత పగ ఎందుకో చెప్పాలన్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి వెంటనే రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని, ఎన్ఎంసి గైడ్‌లైన్స్ ప్రకారం ఎఫ్ఎంజి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి వెంటనే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్వర్ణ కుప్పం.. నా లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థికి ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరఫున చదివిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. తల్లికివందన పథకం ఇంట్లో చదువుకుంటున్న పిల్లలందరికీ అందిందా? అని అడిగి తెలుసుకున్నారు. అందిందంటూ తిమ్మరాజుపల్లి గ్రామస్తులు తెలిపారు. చంద్రబాబు వెంట చిత్తూరు ఎంపి దుగ్గమల్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. రాత్రి ఒంటిగంట వరకు ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం చేశారు.

రూ.1617 కోట్ల విలువైన ఒప్పందాలు

అంతకుముందు అభివృద్ధి, నైపుణ్య శిక్షణకు సంబంధించి నాలుగు కంపెనీలు రూ.1,617 కోట్ల విలువైన ఒప్పందాలను చంద్రబాబు సమక్షంలో ప్రజావేదికపై కుదుర్చుకున్నాయి. వీటిలో రూ.200 కోట్ల వ్యయంతో ఇ-ఆటోలు, ఇ-బైక్స్, ఇ-స్వీపింగ్ ఎలక్ట్రిక్ మెషిన్ల తయారీ కంపెనీ, రూ.525 కోట్లతో సమీకృత పాల ఉత్పత్తులు పోషకాహార కాంప్లెక్స్ ఏర్పాటుకు ఏస్ ఇంటర్నేషనల్ సంస్థ, రూ.372.8 కోట్ల పెట్టుబడితో ఎస్‌విఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉన్నాయి. కుప్పంలోని యువతకు నైపుణ్యాభివద్ధి కేంద్రం ఏర్పాటు చేసి మూడేళ్లలో వెయ్యి మంది యువతకు నైపుణ్యాభివద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా, చంద్రబాబు నాయుడు బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో తుంశి గ్రామానికి రావాల్సి ఉంది. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రోడ్డు మార్గంలో వచ్చారు.

ప్రభుత్వం సంప్రదింపులు చేపట్టాలి

- బనకచర్లపై తుంగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం తొందరపాటుతోనూ, ఏకపక్షంగానూ వ్యవహరిస్తోందని సామాజికవేత్త తుంగా లక్ష్మీనారాయణ తెలిపారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం ఒక్కసారి కూడా నిపుణులను కలవలేదని, సంప్రదించలేదని విమర్శించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో, పైగా నీటి వివాదాలు పరిష్కారం కాకుండా ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టం వల్ల వివాదాలకు మరింత తావిచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. గోదావరి జలాల సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, దీనిపై కేంద్రం కూడా సరిగ్గా స్పందించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే గోదావరి నదిపై ఉన్న ప్రాజెక్టులకు నికర జలాల పంపిణీ అంశంలో సిడబ్ల్యుసి గానీ, కేంద్రం గానీ స్పష్టత ఇవ్వడం లేదని పేర్కొన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నికర జలాలు పంపిణీ పూర్తయిన తరువాతే మిగులు జలాలు ఉంటాయని, ఇప్పటి వరకు కేంద్రం ఆ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

ఐపిఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ రాజీనామా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిజిపి కార్యాలయంలో ఎస్‌పి (అడ్మిన్)గా విధులు నిర్వహిస్తున్న ఐపిఎస్ అధికారి సిద్ధార్థ కౌశల్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో, కుటుంబ సభ్యుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2012 బ్యాచ్‌కు చెందిన సిద్ధార్థ్ గతంలో కృష్ణా, ప్రకాశం, కడప జిల్లాల్లో ఎస్‌పిగా పనిచేశారు. తన రాజీనామా పూర్తిగా వ్యక్తిగత స్వచ్ఛంధ నిర్ణయమేనని, తనపై ఎలాంటి బలవంతం, వేధింపులు లేవని తెలిపారు. ప్రభుత్వం, సీనియర్లు, సహచరులు, జూనియర్లు, తనకు సేవ చేసే అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - నెల్లూరు కార్పొరేషన్

నెల్లూరులో ఇంటర్ చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు వివరాల మేరకు.. నగరంలోని వైకెస్ రోడ్డులో నివసిస్తున్న విద్యార్థి సాయి రేవంత్ (17) ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్యసాయి క్యాంపస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొందరు విద్యార్థులు తనను ఇబ్బందిపెడుతున్నారని బుధవారం రాత్రి తన తల్లిదండ్రులకు సాయిరేవంత్ ఫోన్ చేసి విషయం చెప్పాడు. గురువారం ఉదయం తన హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ బిడ్డ ఎందుకు చనిపోయాడో కారణం చెప్పాలని యాజమాన్యాన్ని విద్యార్థి తల్లిదండ్రులు నిలదీశారు. రూ. లక్షల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు కనీస భద్రత కల్పించడంలో నిర్లక్ష్యం వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సిసికెమెరాలు కూడా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బివి పట్టాభిరామ్ మృతి పట్ల సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, అభ్యుదయవాది, రచయిత బివి పట్టాభిరామ్ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు. ఆయన మృతి తీరని లోటని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రజల్లో మూఢనమ్మకాలు తొలగించడానికి ఆయన ఎంతో కృషి చేశారని, చేతబడిపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారని పేర్కొన్నారు. ఇంద్రజాలాన్ని జోడించి మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించారని, గోదావరి వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారని, పలు పత్రికల్లో వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారని వివరించారు.

ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యూటీ తక్షణమే చెల్లించాలి

- మంత్రి పయ్యావులకు ఎస్‌డబ్ల్యుఎఫ్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎస్‌డబ్ల్యుఎఫ్ కోరింది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎపి పిటిడి (ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, జనరల్ సెక్రటరీ ఎం అయ్యప్పరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎపిఎస్‌ఆర్‌టిసి విలీనం అనంతరం రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. నాలుగు నెలలు దాటినా రిటైర్డు ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వంలో విలీనమైన తర్వాత రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ఫలితంగా రిటైర్డ్ ఉద్యోగ, కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఖాళీ బిందెలతో పోలవరం నిర్వాసితుల ధర్నా

సమస్యలు పరిష్కరించాలని ఐటిడిఎ వద్ద ఆందోళన

ప్రజాశక్తి - దేవీపట్నం / రంపచోడవరం (అల్లూరి జిల్లా)

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండల పోలవరం నిర్వాసితులు బుధవారం సిపిఎం ఆధ్వర్యాన రంపచోడవరం ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు ఖాళీ బిందెలను తలపై పెట్టుకుని స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా ఐటిడిఎ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శాంతిరాజు మాట్లాడారు. దేవీపట్నం మండలంలోని చిన్నరిగండి కాలనీ, మూలపాడుకాలనీ, తాళ్లూరు, మడిపల్లి, కచ్చులూరు, కొండమొదలు, తెలిపేరు, మెట్లగూడెం నిర్వాసితుల కాలనీల్లో తక్షణమే మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చిన్నరిగండి కాలనీ నిర్వాసితులకు టాయిలెట్స్ నిర్మించాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ బకాయి సొమ్ము చెల్లించాలని కోరారు. చిన్నరిగండి కాలనీ, మూలపాడు కాలనీ, తాళ్లూరు, మడిపల్లి, కచ్చులూరు, కొండమొదలు, తెలిపేరు, మెట్లగూడెం గ్రామాల నిర్వాసితులకు తక్షణమే భూ నష్టపరిహారం చెల్లించాలని, కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా చిన్నరిగండి కాలనీ, మూలపాడుకాలనీ, తాళ్లూరు, మడిపల్లి, కచ్చులూరు, కొండమొదలు, తెలిపేరు, మెట్లగూడెం గ్రామాల ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాసం తక్షణమే కల్పించాలని, నిర్వాసితులకు ఉపాధి హామీలో 200 రోజులు పని దినాలు కల్పించి, రూ. 600 వేతనం ఇవ్వాలని, తాళ్లూరు గ్రామంలోని కాలనీలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఏ గ్రామానికి ఆ గ్రామంలోనే అంగన్‌వాడీ, పాఠశాల, కమ్యూనిటీహాల్, పశువుల స్థలం తక్షణమే ఏర్పాటు చేయాలని, నిర్వాసిత కాలనీలలో సిసి రోడ్లు నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోమరాజు వీరభద్రరెడ్డి సత్తిబాబు నాగిరెడ్డి కొమరం కృష్ణ, మడి గంగరాజు, రామయ్యమ్మ, సుభాషిని, నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రంపచోడవరం ఐటిడిఎ వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి ఫీల్డు అసిస్టెంట్లు

రెన్యువల్ చేయాలని ఫీల్డు అసిస్టెంట్ల నిరసన

- మేన్ డేస్ విధానం రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి - విజయనగరం కంటోన్మెంట్

ఫీల్డ్ అసిస్టెంట్లందరినీ రెన్యువల్ చేసి మూడు నెలలు బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన బుధవారం విజయనగరం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. మేన్ డేస్ విధానాన్ని రద్దు చేయాలని, జిల్లాలో సస్పెండ్ చేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌లందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రాజారావు, ఈశ్వరరావు మాట్లాడారు. పెనాల్టీ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ, అందరికీ ఎఫ్‌టిఎఫ్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉపాధి కార్మికుల హాజరు విధానాన్ని ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిసెంట్లు ఒకేసారి ఫొటో అప్‌లోడు చేయడం వలన సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. కార్మికులు వంద రోజుల పని పూర్తి చేయకపోతే పెనాల్టీ వేసి ఫీల్డ్ అసిస్టెంట్‌లను బాధ్యులు చేయడం అన్యాయమన్నారు. అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు మండల స్థాయిలో బదిలీలు చేయాలని, మేట్లకు గౌరవ వేతనం ఇవ్వాలని, జూనియర్ మేట్, సీనియర్ మేట్, ఫీల్డు అసిస్టెంట్ అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా పరిగణించి సమానమైన జీతాలు చెల్లించాలని కోరారు. విధి నిర్వహణలో ఫీల్డ్ అసిస్టెంట్ చనిపోతే వారి కుటుంబానికి రూ. పది లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

కారుణ్య నియామకం పద్ధతిలో కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, కార్మికులకు ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించి, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. ధర్నా వద్దకు వచ్చిన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శారదకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను పరిశీలించి కృషి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు.

మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేయండి

- పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం తగదు : అజశర్మ

ప్రజాశక్తి- కోటవురట్ల (అనకాపల్లి జిల్లా)

మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న అజశర్మ తదితరులు

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీ నిర్మాణానికి టిడిపి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. మెడికల్ కాలేజీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలు నిర్మించాలనే లక్ష్యంతో మాకవరపాలెం మండలంలో నిర్మాణం మొదలుపెట్టారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కాలేజీల నిర్మాణం అర్ధాంతరంగా ఆపేసిందని, దీనివల్ల మెడిసిన్ చదువుకునే విద్యార్థులకు చదువు, ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుందని పేర్కొన్నారు. కాలేజీ అందుబాటులోకి వస్తే మాకవరపాలెం, కోటవురట్ల, నర్సీపట్నం, చింతపల్లి మండల ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను నిలిపివేయడం తగదన్నారు. చింతపల్లి నుంచి వైద్యానికి విశాఖపట్నం వెళ్లాలంటే దాదాపు నాలుగున్నర గంటల సమయం పడుతుందని, మాకవరపాలెం మండలంలో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయితే వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి కాలేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే పరిసర ప్రాంత ప్రజలందరినీ కలుపుకుని ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు, సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే ఫార్మా కంపెనీల్లో భారీ ప్రమాదాలు

- యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి, తనిఖీలు పెంచాలి : సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

ఫార్మా కంపెనీల యాజమాన్యం నిర్లక్ష్యంతో భారీ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆయా యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. విశాఖ జిల్లా జగదాంబ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం శ్రీనివాస్, ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని "సిగాచి ఫార్మా"లో జూన్ 30న రియాక్టర్ పేలి 40 మంది మరణించారని, మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారని, గతంలో జరిగిన అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్‌ఇజెడ్‌లో 'ఎషన్షియా ఫార్మా' ప్రమాదంలో 17 మంది మరణించారని, గత సంవత్సరంలో అనకాపల్లి జిల్లాలో మరో 11 ప్రమాదాలలో 32 మంది మరణించారని, దక్షిణకొరియాకు చెందిన ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదంలో 15 మంది చనిపోయారని... ఈ ప్రమాదాలన్నింటిలోనూ యాజమాన్యాల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారని, యాజమాన్యాల నిర్లక్ష్యం ఉన్నా నివేదికలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పైగా ఎల్‌జి పాలిమర్స్ కంపెనీ ప్రతినిధులకు తిరుపతి జిల్లా శ్రీ సిటీలో సన్మానం చేసి కంపెనీ పెట్టించారని విమర్శించారు. ఫార్మా రసాయన కంపెనీలు 'ప్రమాద పరిశ్రమల' జాబితాలో ఉన్న "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" పేరుతో తనిఖీల పద్ధతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎత్తివేశాయన్నారు. 'కృత్రిమ మేధస్సు' (ఎఐ)ను ఉపయోగించి ప్రమాదాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు అరికట్టలేరని ప్రశ్నించారు. తీవ్ర ప్రమాదాలు జరిగితే ఆ కంపెనీలను మూసివేయాలని, తిరిగి వారికి అనుమతులు తిరస్కరించాలని డిమాండ్ చేశారు. "సేఫ్టీ ఆడిట్" కంటితుడుపు చర్యలాగా మిగిలిందన్నారు. ఫ్యాక్టరీ చట్టాలను తుంగలో తొక్కి లేబర్ కోడ్స్‌ను తెచ్చారన్నారు. వాటికి వ్యతిరేకంగా ఈ నెల తొమ్మిదిన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

వల్లభనేని వంశీకి సుప్రీంలో ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. రెండు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది. స్థల వివాదం నేపథ్యంలో తనపై దాడి చేసిన కేసులో వంశీకి హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని సుంకర సీతామహాలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా 2024లో దాడి చేస్తే, 2025లో ఫిర్యాదు చేశారనే ప్రాతిపదికన ఆ పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే మైనింగ్ కేసులో వంశీ హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను బుధవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఇప్పటికే అనేక కేసుల్లో వంశీని అరెస్టు చేశారు కదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తమ వాదన వినకుండా బెయిల్ ఇచ్చారని ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదించారు. రూ.195 కోట్ల అక్రమ మైనింగ్ జరిగిందని అన్నారు. ఇందుకు సంబంధించి జరుగుతున్న దర్యాప్తు నివేదిక 700 పేజీలు ఉందని తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం నివేదికను సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 17కి వాయిదా వేసింది.

సెన్సెక్స్‌కు 287 పాయింట్ల నష్టం

ముంబయి : అమెరికా విధించిన టారిఫ్ గడువు జులై 9 సమీపిస్తున్న వేళ మదుపర్లు అప్రమత్తతతో అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో బుధవారం మార్కెట్లు నష్టాలను చవి చూశాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 287 పాయింట్ల నష్టంతో 83,410కి పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ సైతం 88.40 పాయింట్ల నష్టంతో 25,453 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఎల్‌అండ్‌టి, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బిఇఎల్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, మారుతీ సుజుకీ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

- పోలవరం స్పిల్‌వే నుంచి 1,06,975 క్యూసెక్కులు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 1,06,975 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ అధికారులు బుధవారం తెలిపారు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఉప నదులు, కొండవాగుల నీరు గోదావరిలో కలిసి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ వస్తోంది. అదనంగా వస్తున్న జలాలను ప్రాజెక్టు స్పిల్‌వే 48 గేట్లు, స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఎగువున 27,160 మీటర్లు, దిగువున 18,000 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్‌కు ఎగువున 27,250 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకు దిగువున 16,100 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల మధ్య 16,000 మీటర్ల నీటిమట్టం నమోదయ్యింది. పోలవరం ప్రాజెక్టు దిగువున గోదావరి నీటిమట్టం 5.17 మీటర్లు నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నిలకడగా ఉందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

ఉగ్ర లింకులపై లోతైన దర్యాప్తు : పివిఎన్ మాధవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉగ్ర లింకులపై లోతైన దర్యాప్తు చేయాలని ప్రభుత్వాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కోరారు. అన్నమయ్య జిల్లా, రాయచోటిలో ఆరు నెలల్లో జరిగిన రెండు సంఘటనల్లో ఉగ్ర శిక్షణ పొందిన వారి పాత్ర ఉందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఒకచోట పోలీసులపై చెప్పులు విసిరిన సంఘటన కాగా, మరొకటి వీరభద్రస్వామి ఊరేగింపుపై జరిగిన దాడి వెనుక ఉన్నవారికి ఉగ్రవాదులతో సంబంధాలున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అనుమానాలను పోలీసులు నివృత్తి చేయాలన్నారు. విజయనగరంలో పోలీసు కుటుంబానికి చెందిన వ్యక్తికి ఉగ్రవాదులతో సంబంధాలు వెలుగు చూడటం, విజయవాడలో పోలీస్ తనిఖీల్లో బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలకు చెందిన వారు అక్రమంగా నివాసం ఉంటున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయన్నారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణ జిఒ రద్దు చేయాలి

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)

ఆదివాసీ గిరిజనుల మనుగడకు ముప్పు వాటిల్లే అనంతగిరి మండలం పెదకోట ఎరియాలో హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన జిఒ 51ను వెంటనే రద్దు చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది. పెదకోట ప్రాంతంలో హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, సిపిఎం అనంతగిరి మండల నాయకులు ఎస్ నాగులు బుధవారం స్థానిక గిరిజనులతో కలిసి పరిశీలించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గిరిజనులు పెద్ద ఎత్తున వచ్చి ఆందోళన చేశారు. జిఒ 51 కాపీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా గంగరాజు, వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్‌ఆర్‌ఇడిసిఎపి) ద్వారా పెదకోట ఎరియాలో 800 మెగావాట్లు ఉన్న దాన్ని 1800 మెగావాట్లుకు పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకోట ఎరియా రేగులపాలెం, ప్రాంతంలోని రైవాడ చింతలపూడి మారిక మధ్యలో 900 సామర్థ్యంతో లిఫ్ట్‌డ్ పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు 2019-2025 మధ్య రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేశాయని తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో, రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లోని ఆదివాసీలను, ఇతర పేదలను వారి ఆవాసాల నుంచి వెళ్ల గొట్టేందుకు తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నారని, పెదకోట ఏరియాలో అత్యధిక గ్రామాలను ఖాళీ చేయించే పని అదాని మనుషులు పూనుకున్నారని తెలిపారు. దీన్ని గిరిజనులు ప్రతిఘటిస్తున్నారని తెలిపారు. గిరిజనుల పోరాటాలను, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపి జిఒ 51ను విడుదల చేయడం శోచనీయమన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం టోకూరు పంచాయతీ చిట్టంపాడు హైడ్రో పవర్ ప్రాజెక్ట్, గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ సర్వేలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలతో అదాని మనుషులు సిద్ధమవుతున్నారని, దీన్ని అడ్డుకుంటామని స్పష్టంచేశారు.

జిఒ 51 కాపీని దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు, ఆదివాసీ గిరిజనులు

పలు వస్తువులపై జిఎస్‌టి తగ్గింపు..!

న్యూఢిల్లీ : హెచ్చు పన్ను విధానంపై తీవ్ర విమర్శలు వస్తోన్న వేళ కేంద్రం జిఎస్‌టి తగ్గింపు యోచన చేస్తోన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జిఎస్‌టి శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా 12 శాతంలో ఉన్న చాలావరకు వస్తువులను 5 శాతం పన్ను పరిధిలోకి తీసుకు రావాలని భావిస్తోందని రిపోర్టులు వస్తున్నాయి. అత్యధికంగా ఉపయోగించే టూత్‌పేస్టు, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టుమిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంటగదిలో వినియోగించే పాత్రలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషిన్లు, సైకిళ్లు, వ్యవసాయ ఉపకరణాలపై జిఎస్‌టి తగ్గించాలని యోచిస్తోందని సమాచారం. ఈ నెలాఖరులో జరిగే జిఎస్‌టి సమావేశంలో దీనిపై స్పష్టత రావొచ్చని తెలుస్తోంది. సాధారణంగా మోడీ సర్కార్ పెంచిన ధరలను, పన్ను రేట్లను తగ్గించిన ఘటనలు చాలా అరుదు.

రద్దీ వేళల్లో ప్రయాణం తడిసి మోపెడు

- రేట్లు పెంచనున్న క్యాబ్ సంస్థలు
- ప్రయివేటు మోటార్ సైకిళ్లకు కేంద్రం అనుమతి

న్యూఢిల్లీ : రద్దీ సమయాల్లో ఇకపై క్యాబ్ సర్వీసులను బుక్ చేసుకుంటే బిల్లు తడిసి మోపెడు కానుంది. యాప్ ఆధారంగా క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ర్యాపిడో, ఉబర్, ఓలా తదితర వంటి సంస్థలు రద్దీ సమయాల్లో రేట్లు పెంచుకునేలా వెసులుబాటు కల్పిస్తూ బుధవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ నూతన గైడ్‌లైన్స్ ప్రకారం నామమాత్రంగా రద్దీ ఉన్న సమయాల్లో బేస్ ఛార్జీల్లో సగం సర్‌ఛార్జీ కింద పెంచుకునేందుకు వీలు కల్పించింది. ఒకవేళ రద్దీ విపరీతంగా ఉంటే 200 శాతం పెంచుకునేందుకు అనుమతిచ్చింది. అంతకుముందు ఈ వెలుసుబాటు 150 శాతంగా ఉండేది. మూడు కిలోమీటర్ల లోపు ప్రయాణానికి ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకూడదని నిబంధన పెట్టింది. యాప్ ద్వారా రైడ్‌ను అంగీకరించిన తర్వాత సరైన కారణం చెప్పకుండా డ్రైవర్ క్యాన్సిల్ చేస్తే ఛార్జీలో 10 శాతం లేదా రూ.100 మించకుండా జరిమాన పడుతుంది. దానిని డ్రైవర్, అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్ చెరి సమానంగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ, సరైన కారణం చెప్పకుండా ప్రయాణికులు రైడ్ క్యాన్సిల్ చేసినా ఇదే జరిమాన వర్తిస్తుంది. అదే విధంగా అగ్రిగేటర్ ప్లాట్‌ఫామ్‌లతో అనుబంధంగా ఉన్న ప్రతి డ్రైవర్‌కు కనీసం రూ.5లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల మేర టర్మ్ బీమా కవరేజ్‌ను తప్పనిసరిగా అందించాలని ఆదేశాలు జారీ చేసింది.

స్కోడా అమ్మకాల్లో 134 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రముఖ ప్రీమియం కార్ల కంపెనీ స్కోడా ఈ ఏడాది ప్రథమార్థంలో రికార్డ్ స్థాయిలో అమ్మకాలు చేసినట్లు ప్రకటించింది. 2025 జనవరి నుంచి జూన్ కాలంలో 36,194 యూనిట్ల అమ్మకాలు చేసినట్లు తెలిపింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలోని విక్రయాలతో పోల్చితే 134 శాతం పెరుగుదల చోటు చేసుకుందని పేర్కొంది. దీంతో దేశంలోని టాప్ 7 ఆటోమోటివ్ కంపెనీల్లో ఒక్కటిగా నిలిచినట్లు తెలిపింది. ఇంతక్రితం 2022 ప్రథమార్థంలో అత్యధికంగా 28, 899 యూనిట్ల అమ్మకాలు చేసింది.

పామాయిలు రికార్డ్ దిగుమతి

- జూన్‌లో 61 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ : వ్యవసాయ ఆధారిత ప్రధాన దేశంగా ఉన్న భారత్ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కనీసం వంట నూనెలను సరిపడ ఉత్పత్తి చేసుకోలేకపోతోంది. వంట నూనెల్లో స్వయం సమృద్ధి సాధించలేక విదేశాల నుంచి రికార్డ్ స్థాయిలో దిగుమతి చేసుకుంటుంది. ఈ ఏడాది జూన్‌లో ఏకంగా 9,53,000 మెట్రిక్ టన్నుల పామాయిల్‌ను దిగుమతి చేసుకుంది. గతేడాది ఇదే నెల దిగుమతులతో పోల్చితే 61 శాతం పెరిగి.. 11 నెలల గరిష్ట స్థాయికి చేరడం గమనార్హం. ఈ రంగంలోని డీలర్ల అంచనా ప్రకారం.. ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలు దేశీయ నిల్వలు తక్కువగా ఉండటమే. సోయాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ సరిపడ లభించకపోవడం.. వీటి ధరలు అధికంగా ఉండటం. మరోవైపు పామాయిల్ ధరలు తక్కువగా ఉండటం హెచ్చు దిగుమతులకు దారి తీస్తున్నాయి. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద వంట నూనెల దిగుమతిదారుగా భారత్ నమోదు కావడం విశేషం.

సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఇఎ) 2024-25 నవంబర్ నుంచి అక్టోబర్ చమురు సంవత్సరంలో మొదటి ఏడు నెలల్లో భారతదేశం సగటున నెలకు 475,699 టన్నుల పామాయిల్‌ను దిగుమతి చేసుకుంది. జూన్‌లో మొత్తం వంట నూనెల దిగుమతులు సుమారు 15 లక్షల టన్నులుగా ఉన్నాయి. ఇందులో సోయా ఆయిల్ 400,000-450,000 టన్నులుగా, మిగితా సన్ ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు జరిగాయి.

మే నెలలో పామాయిల్ దిగుమతులు 84 శాతం పెరిగి 592,888 టన్నులకు చేరుకున్నాయని ఏషియన్ పామ్ ఆయిల్ అలయన్స్ ఛైర్మన్ అటుల్ చతుర్వేది పేర్కొన్నారు. ఈ ధోరణి తర్వాత నెలలో కూడా కనిపించిందన్నారు. భారత్ ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా నుండి పామాయిల్‌ను, అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ నుండి సోయాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటుంది.

వెలువడినవి



వక్ఫ్ చట్ట సవరణ మైనారిటీలపై దాడి
- హన్నన్ మొల్లా
రూ. 5/-

మత విద్వేషాన్ని ఓడించండి
ఉగ్రవాదాన్ని మట్టుబెట్టండి
రూ. 5/-

కేంద్ర ఎన్నికల కమీషన్‌కు
సిపిఐ(ఎం) విజ్ఞాపన
రూ. 5/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్ విజయవాడ. ఫోన్ : 9490099061, 9490099057

5వ అమ్మకపు ప్రకటన

రిజిస్టర్డు ఆఫీసు: 23-16-44, జైగోపాల్ భవన్ హరిపురం, రాజమండ్రి, తూర్పు గోదావరి, ఆం.ప్ర, పిన్: 533105, ఇండియా.
లిక్విడేటర్ చిరునామా: ఇంటి నం. 1-1-380/38, అశోక్ నగర్ ఎక్స్‌టెన్షన్, హైదరాబాద్-500020. సంప్రదించు నం.: +91 9849995678
ఇ-మెయిల్ : rp.karuturiceramics@gmail.com, bnagabhushan@yahoo.com

ఇ-వేలం

ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్ 2016 క్రింద

లిక్విడేషన్ ఎస్టేట్ యొక్క ఫార్మింగ్ పార్ట్ సిఐఎన్: యు26933ఎపి2010పిటిసి117739 కలిగిన మెసర్స్ కరుటూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్) యొక్క దిగువ అసెట్స్& ఆస్తులు, దిగువ పట్టికలో పేర్కొన్న వివరాల ప్రకారం, "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది ప్రాతిపదికన" మరియు "రీకోర్స్ లేకుండా ప్రాతిపదికన" ఇ-వేలం ద్వారా లిక్విడేటర్ చేత అమ్మకం కొరకు ఉన్నవి.
అమ్మకం అనునది ఇ-వేలం ప్లాట్‌ఫారం ద్వారా (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో) చేపట్టబడును.
https://ibbi.baanknet.com/eauction-ibbi/home

అసెట్ వివరణ	రిజర్వు ధర రూ.లలో	ధరావత్తు మొత్తాలు రూ.లలో	బిడ్ పెంపుదల విలువ (రూ.లలో)
కంపెనీ యొక్క ప్లాంట్ & మిషనరీ అమ్మకం (స్టాండలోన్ ప్రాతిపదికన ఆస్తుల అమ్మకం)	6,11,71,875/-	61,17,187	5 లక్షలు
అర్హత పత్రాలు దాఖలుచేయుటకు చివరి తేది			21.07.2025
లిక్విడేటర్‌కు రెండు రోజుల ముందు సమాచారంతో పరిశీలించుటకు చివరి తేది			21.07.2025
ధరావత్తు కొరకు చివరి తేది			21.07.2025
ఇ-వేలం తేది			03.30 P.M to 04.30 P.M of 24.07.2025

1. ఆసక్తిగల బిడ్డరుదారులు ఎలక్ట్రానిక్ యాక్షన్ ప్లాట్‌ఫారం ద్వారా ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్ యొక్క సెక్షన్ 29ఎ క్రింద అర్హత ప్రకటనతోపాటు కోరిన పత్రాలను దాఖలుచేయవలెను.
2. ఆసక్తిగల అభ్యర్థులు వారంతట వారుగా https://ibbi.baanknet.com/eauction-ibbi/home వద్ద నమోదుచేసుకోవలెను, ఆన్‌లైన్ ఇ-వేలం పోర్టల్, ఇ-వేలం బిడ్ ఫారం, అర్హతానియమావళి, బిడ్డరుదారుల డిక్లరేషన్, కోరిన ధరావత్తు మొ॥వాటి యొక్క నియమాలు& షరతుల వివరాలు కలిగియున్న పూర్తి ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రంను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఆసక్తిగల బిడ్డరుదారులు ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రంలో సిఫారసుచేసినట్లుగా వారి అర్హత పత్రాలను అప్‌లోడ్‌చేయవలెను. ఏవేని అదనపు సమాచారం కావలసినచో, ఇ-మెయిల్ ఐడి: rp.karuturiceramics@gmail.com (ప్రాసెస్ స్పెసిఫిక్)కు పంపవలెను.
3. ఆసక్తిగల బిడ్డరుదారులు ధరావత్తు డిపాజిట్ (ఇఎండి)ని వెబ్‌సైట్:https://ibbi.baanknet.com/eauction-ibbi/home ద్వారా డిపాజిట్‌చేయవలెను.
4. వేలం ప్రక్రియలో అనర్హులుగా గుర్తించినట్లైతే, గరిష్ట బిడ్ వేసిన గెలుపొందిన బిడ్డరు యొక్క ధరావత్తు జప్తుచేయబడుతుంది.
5. కంపెనీ యొక్క రిజర్వు ధర మరియు ఇంక్రిమెంటల్ మొత్తాలకు తక్కువ విలువ కొరకు బిడ్డరుదారు బిడ్ వేయలేరని బిడ్డరుదారులు గమనించగలరు.
6. లిక్విడేటర్ ఏ సమయమునైనా ఇ-వేలంను ఆమోదించు లేదా రద్దుచేయు లేదా పొడిగించు లేదా ఏవేని నియమాలు& షరుతులను ఆధునీకరించు మొ॥ వాటి హక్కులు కలిగియుంటుంది.
7. ఇ-వేలం ప్లాట్‌ఫారం: ఆసక్తిగల బిడ్డరుదారులు వెబ్‌సైట్ https://ibbi.baanknet.com/eauction-ibbi/home ను దర్శించి మరియు బిడ్ దాఖలుచేసి & పత్రాలను అప్‌లోడ్‌చేయవలసిందిగా కోరబడుచున్నది.
8. జిఎస్‌టి & ఇతర లెవల్స్, పన్నులు ఏవేనిని బిడ్డరుదారుచేత రిజర్వు ధర/ ఫైనల్ సేల్ మొ॥వాటికి అదనంగా చెల్లించవలసి ఉంటుంది.

సం/-
నాగభూషన్ భగవతి
లిక్విడేటర్
మెసర్స్ కరుటూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్
IBBI Reg. No.: IBBI/IPA-001/IP-P00032/2016-17/10085

తేది: 03.07.2025,
ప్రదేశం: హైదరాబాద్

సంపాదకీయం

అప్పుల సుడిగుండం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్ల తరువాత కూడా భద్రమైన జీవితం గడపడం కన్నా కూడా సామాన్యుడికి అప్పు తీర్చడమే జీవిత లక్ష్యంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కొరత, ప్రభుత్వ ఆర్థిక విధానాల వైఫల్యంతో వెంటాడే ద్రవ్యోల్బణం సామాన్యుడిని ఆర్థిక దిగ్బంధనం చేస్తోంది. 2023 మార్చిలో ఒక్కో భారతీయుడిపై సగటు అప్పు రు. 3.9లక్షలుగా ఉండగా, 2025 మార్చి నాటికి అది 4.8 లక్షల రూపాయలకు చేరింది. అంటే రెండు సంవత్సరాల్లోనే దాదాపుగా 23 శాతం పెరుగుదల! ఇది ఆర్థికంగా సామాన్యులు ఎలా చితికిపోతున్నారనడానికి నిలువెత్తు నిదర్శనం. గృహ నిర్మాణం కోసం తీసుకుంటున్న అప్పులు గత ఏడాది జిడిపిలో 23.1 శాతంగా ఉండగా, ఈ ఏడాదికి 23.9 శాతానికి చేరాయి. మరోవైపు నికర పొదుపు కరోనాకు ముందు 19 శాతం ఉండగా, 2024 నాటికి అది 13.1శాతానికి పడిపోయింది. ఆదాయాన్ని మించుతున్న ఖర్చుల కోసం అప్పుల మీద ఆధారపడాల్సిరావడం అన్నది దేశ వ్యాప్తంగా ఒక ధోరణిగా మారుతోంది. ఆహారం, విద్య, వైద్యం, నివాసం వంటి ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడం కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రిటైల్‌లోన్లలో 91శాతం వరకు వ్యక్తిగత రుణాలే కావడం గమనార్హం. వీటిలో 55 శాతం వినియోగ ఖర్చులే! అంటే, ఏ నెలకానెల బతకడానికి కూడా బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల మీద ఆధారపడాల్సిన స్థితి ఏర్పడుతోంది.

సామాన్యుడి అప్పులు పెరిగిపోవడానికి ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదనుకుంటే పొరపాటే. నిజానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రతి దశలోనూ సామాన్యుల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు 2016లో నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేసింది. పెద్దసంఖ్యలో చిన్న వ్యాపారాలు దెబ్బతినడం, అసంఘటిత రంగం తీవ్రంగా ప్రభావితం కావడం, ఉద్యోగాలు పోయి, మరోమార్గం లేక అప్పుల మీద ఆధారపడాల్సిరావడం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 2022-23 నాటికి ఉత్పత్తి రంగంలో ఉన్న చిన్నాచితక పరిశ్రమల సంఖ్య (అసంఘటిత రంగం) 9.3శాతానికి తగ్గింది. ఈ పరిశ్రమల్లోని 15 శాతం కార్మికులు ఉపాధి కోల్పోయారు. కరోనా ముందునాటి గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం దేశంలో ఈ తరహా పరిశ్రమలు సంవత్సరానికి 20 లక్షల దాకా కొత్తగా ఏర్పాటయ్యేవి. ఆ మేరకు ఉపాధి అవకాశాలను దేశం కోల్పోయింది. మోడీ ప్రభుత్వం అట్టహాసంగా చెప్పిన నల్లధనం బయటపడింది లేదు. కానీ, ఈ ప్రక్రియ కాకులను కొట్టి గద్దలకు వేసిన విధంగా మారింది! ప్రభుత్వం అమలు చేస్తున్న జిఎస్‌టి విధానం కూడా లక్షలాది వ్యాపారాలను, వాటి మీద ఆధారపడిన ప్రజలను తీవ్రంగా దెబ్బతీసింది. అదే సమయంలో అప్పులతో ఆర్థిక చక్రాన్ని నడిపించే వ్యూహానికి ప్రభుత్వం తెరతీసింది. ఫలితంగా ఊరూరా మైక్రోఫైనాన్స్ కంపెనీలు, మొబైల్ ఫోన్‌లో లోన్‌యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. 'ఫైనాన్షియల్ ఇంక్లూజన్' పేరిట జరిగిన ఈ ప్రక్రియలో సామాన్యులే సమిధలుగా మారారు. 2023 నాటికి ఈ రంగంలో రుణ గ్రహీతల సంఖ్య ఆరు కోట్లకు చేరింది. మొత్తం రుణభారంలో వీటి వాటా 15 నుండి 20శాతం ఉంటుందని అంచనా. రుణాలు వసూలు చేయడానికి ఈ తరహా సంస్థలు అమలు చేస్తున్న విధానాలు తరచూ వివాదాస్పదమౌతుండటం, అప్పులు చేసిన వారు ఆత్మహత్యలే శరణ్యం అనే పరిస్థితికి తీసుకువస్తుండటం కళ్లముందు జరుగుతున్నదే.

అప్పులు తీర్చలేక సామాన్యుడు ఒకవైపు ఆత్మహత్యల బారిన పడుతుంటే, మరోవైపు కార్పొరేట్లకు భారీ మొత్తంలో రాయితీలు లభిస్తున్నాయి. 2014-24 మధ్య కాలంలో కార్పొరేట్లకిచ్చిన రుణాల్లో 16.61 లక్షల కోట్ల రూపాయలను బ్యాంకులు రద్దు చేశాయి. 2024వ సంవత్సరంలో 11.39 లక్షల కోట్ల రూపాయల పారు బకాయిల్లో 69 శాతాన్ని బ్యాంకులు రద్దు చేశాయి. కార్పొరేట్లకు లక్షల కోట్లు కట్టబెడుతున్న ప్రభుత్వానికి సామాన్యులు ఏమాత్రం పట్టడం లేదు. ఇప్పటికైనా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంతో పాటు, అప్పులను రద్దు చేసి పేదలను రుణవిముక్తులను చేయాలి. కార్పొరేట్లపై సంపద పన్ను విధించి పేదల అభివృద్ధికి ఖర్చు చేయాలి. అప్పుడే సామాన్యుడికి నిజమైన స్వాతంత్ర్యం లభిస్తుంది.

మంచి మాట

మరిన్ని లాభాలు గడించే కొత్త మార్గాల కోసం వెదకడం... ఎంత తప్పుడు మార్గాల్లోనైనా చివరికి యుద్ధం, కిరాకతమైన నియంతృత్వం ద్వారానైనా లాభాలను పోగు చేసుకోడానికి చేసే ప్రయత్నం...ఆర్థిక అరాచకత్వానికి, విపరీతమైన మానవ వినాశనానికి దారితీస్తుంది.

- హన్నా మిడిల్టన్,
ఆస్ట్రేలియా కమ్యూనిస్టు పార్టీ నేత.

జన గణనలో ఆదివాసుల అస్తిత్వ గుర్తింపు

విశ్లేషణ

బృందా కరత్

చాలా కాలంగా ఆలస్యం అవుతూ వచ్చిన జన గణనను 2027లో చేపట్టడానికి మోడీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఈ గెజిట్‌లో మోడీ వాగ్దానం చేసిన కులగణనకు సంబంధించి స్పష్టత లేకపోవడం సహజంగానే విమర్శలకు దారి తీసింది. అలాగే తమ ప్రత్యేక అస్తిత్వాన్ని, విశ్వాసాలను గుర్తించే విధంగా జన గణన ప్రక్రియలో తగు విధానాలను అమలు చెయ్యాలని ఆదివాసీ/షెడ్యూల్డ్ ట్రైబ్‌లు సుదీర్ఘ కాలంగా చేస్తున్న డిమాండ్‌పై ఎలాంటి ప్రస్తావనా లేదు.

జనాభా లెక్కింపులో భాగంగా దేశవ్యాప్తంగా ప్రాంతాల వారీగా ఆయా వ్యక్తుల మత విశ్వాసాలను కూడా నమోదు చేస్తారు. హిందూ మతం, క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాం, జైన, సిక్కు మతాలకు సంబంధించి నిర్దిష్ట ప్రస్తావనలు ఉన్నాయే తప్ప మిగిలిన అన్ని మత విశ్వాసాలను ఒకే గాటన కడుతూ 'ఇతర మత విశ్వాసులు' అన్న కాలమ్‌ను పొందుపరిచారు. షెడ్యూల్డు తెగలకు సంబంధించిన ప్రత్యేక మత విశ్వాసాలను ప్రస్తావించడానికి ఎక్కడా అవకాశం లేదు. ఏ రకంగా చూసినా ఇది రాజ్యాంగ ఉల్లంఘనే.

రాజ్యాంగ విరుద్ధ చర్య

షెడ్యూల్డు తెగల ప్రజానీకం నమ్మకాలు, విశ్వాసాలు, సంప్రదాయాల పరిరక్షణకు సంబంధించిన నిర్దిష్టమైన హామీలు రాజ్యాంగంలోని ఐదు, ఆరవ షెడ్యూల్‌లో పొందుపరచబడి ఉన్నాయి. దీనికి తోడు 371ఎ, 371బి అధికరణాలు నాగాలాండ్, అస్సాం ప్రజానీకం అనుసరించే సంప్రదాయ సూత్రాలు, ఆచరణల పరిరక్షణకు హామీ ఇస్తున్నాయి. ఏ వ్యక్తి అయినా తాను నమ్మిన మతాన్ని ఆచరించేందుకు, ఆ మతం గురించి ప్రచారం చేసుకునేందుకు రాజ్యాంగం లోని 25వ అధికరణం హక్కులు కల్పించింది. మత క్రతువుల నిర్వహణకు 26వ అధికరణం స్వేచ్ఛను కల్పిస్తున్నది. కాబట్టి షెడ్యూల్డు తెగల ప్రజా సముదాయాలకు ఉన్న ఈ హక్కులను వాస్తవ రూపంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రకృతి ఆరాధన, వారసత్వ సంప్రదాయాల ఆధారంగా షెడ్యూల్డు తెగల ప్రజానీకం అనుసరించే వైవిధ్యభరితమైన మత విశ్వాసాలను జనాభా లెక్కింపు ప్రక్రియ సహా న్యాయపరమైన, విధానపరమైన ప్రతి మౌళిక చట్రంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నది.

జనాభా లెక్కింపు పత్రాలలో కేవలం ఆరు మతాలను మాత్రమే పేర్కొని మిగిలిన మత విశ్వాసాలను గంపగుత్తగా 'అన్య మత విశ్వాసాల' కోవకు కుదించడం రాజ్యాంగంలోని 25వ అధికరణాన్ని ఉల్లంఘించడమే. షెడ్యూల్డు తెగల ప్రజానీకం ప్రధాన స్రవంతి మతాలతో ఏదో ఒక దానితో గుర్తింపు పొందాల్సిన అగత్యానికి నెట్టబడుతున్నారు.

2011 జనాభా లెక్కలలో కూడా ఈ రకమైన పొరబాట్లు దొర్లాయి. ఆనాటి జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో షెడ్యూల్డు తెగల ప్రజల సంఖ్య 10.43 కోట్లు (120 కోట్ల జనాభాలో 8.6 శాతం). 2011 జనాభా గణన నివేదికలో పట్టిక సి-01ను పరికిస్తే 'అన్య మత విశ్వాసులు' కాలమ్‌లో 79 లక్షల మంది మాత్రమే (అంటే షెడ్యూల్డ్ తెగల జనాభాలో కేవలం 0.66 శాతం మంది మాత్రమే) నమోదయ్యారు. అంటే మెజారిటీ షెడ్యూల్డు తెగల ప్రజానీకం తమ మత విశ్వాసాలను స్పష్టంగా ప్రకటించుకునే అవకాశం లేక ఏదో ఒక ప్రధాన మతాన్ని ఆశ్రయించారని స్పష్టం అవుతున్నది. ఇది అన్యాయం. అక్రమం.

> **జనాభా లెక్కింపులో భాగంగా దేశవ్యాప్తంగా ప్రాంతాల వారీగా ఆయా వ్యక్తుల మత విశ్వాసాలను కూడా నమోదు చేస్తారు. హిందూ మతం, క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాం, జైన, సిక్కు మతాలకు సంబంధించి నిర్దిష్ట ప్రస్తావనలు ఉన్నాయే తప్ప మిగిలిన అన్ని మత విశ్వాసాలను ఒకే గాటన కడుతూ 'ఇతర మత విశ్వాసులు' అన్న కాలమ్‌ను పొందుపరిచారు. షెడ్యూల్డు తెగలకు సంబంధించిన ప్రత్యేక మత విశ్వాసాలను ప్రస్తావించడానికి ఎక్కడా అవకాశం లేదు. ఏ రకంగా చూసినా ఇది రాజ్యాంగ ఉల్లంఘనే.**

మెజారిటీ ఆదివాసీ ప్రజానీకం మారుమూల కుగ్రామాల్లో నివసిస్తుండం మూలంగా 'అన్య మత విశ్వాసులు' అన్న మాటకు వాస్తవ అర్థం ఏమిటో తెలుసుకునే స్థితిలో లేరు. ఎక్కడైతే ఆదివాసీ సంఘాలు బలంగా ఉన్నయో వారి జోక్యం మూలంగా కొద్ది మేరకైనా 'అన్య మత విశ్వాసులు'గా నమోదయ్యారు. జనాభా లెక్కల నివేదికలో అనుబంధంగా చేర్చిన పట్టికలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది.

జార్ఖండ్‌లో సంఘాల కృషి మూలంగా 49 లక్షల మంది అన్య మత విశ్వాసుల పట్టికలో తాము ఆచరించే 'సర్న' మతం నమోదయ్యింది. గోండులు అత్యధికంగా నివసించే మధ్యప్రదేశ్‌లో కేవలం 10 లక్షల మంది మాత్రమే అన్య మత విశ్వాసుల పట్టికలో తమ గోండు మతాన్ని నమోదు చేసుకోగలిగారు. అన్య మత విశ్వాసుల 'కాలమ్'లో తాము ఆచరించే మతాన్ని నమోదు చేయించుకోవచ్చనే ఎరుక లేకపోవడం మూలంగా ఈ లోపం జరిగింది.

ఆదివాసుల హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతున్న ప్రస్తుత రాజకీయ నేపథ్యంలో ఈ సమస్య మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. గత పదేళ్ళుగా ఆర్.యస్.యస్, దీని అనుబంధ శక్తులు...క్రైస్తవ మిషనరీలు, ఎస్టీలలో క్రైస్తవ మతాన్ని స్వీకరించిన జనాభాను లక్ష్యంగా చేసుకుని భౌతిక దాడులకు తెగబడుతున్నాయి. 'ఘర్ వాపసీ' పేరిట మతాంతీకరణకు పాల్పడుతున్నాయి. మోడీ ప్రభుత్వ అండదండలతో పెట్రేగిపోతున్న కాషాయ పరివార శక్తులు 'వనవాసీలు' (గిరిజనులు) చారిత్రకంగా హిందువులలో అంతర్భాగమే అనే ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. షెడ్యూల్డు తెగల ప్రజానీకాన్ని హైందవీకరిస్తున్నాయి. రాజ్యాధికారాన్ని అడ్డం పెట్టుకుని వివిధ తెగల పెద్దలను నయానో, భయానో ఈ హైందవీకరణ ప్రాజెక్టును అమలు చేస్తున్నాయి.

షెడ్యూల్డు తెగల ప్రజలు నివసించే ప్రాంతంలో హిందూ దేవాలయాలు స్థాపించడం, ఆయా తెగల ప్రజానీకం ఆచరించే సంప్రదాయాలను హైందవ సంప్రదాయాలతో మిళితం చెయ్యడం, కట్టుకథలు ప్రచారం చెయ్యడం, ఆదివాసులు హనుమంతుడి వారసులని నమ్మబలకడం, అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం అంటూ గిరిజనుల నివాస ప్రాంతాలు, వనదేవతలను నెలకొల్పిన చోట్ల నుండి మట్టి సేకరించడం ద్వారా వారి అస్తిత్వాన్ని క్రమంగా మసకబారుస్తున్నారు. వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ తరఫున నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాలల్లో షెడ్యూల్డు తెగల ప్రజానీకం సంప్రదాయాలు, సంస్కృతిని నేర్పడానికి బదులు హిందూ మతాచారాలు, పండుగల ప్రాశస్త్యం హిందూ శ్లోకాలు నేర్పుతున్నారు. ఈ పాఠశాలల నిర్వహణ కోసం ఆర్.యస్.యస్‌కు కావాల్సిన నిధులను కార్పొరేట్ కంపెనీలు తమ సామాజిక బాధ్యతా నిధి నుండి కుమ్మరిస్తున్నాయి. షెడ్యూల్డు తెగల ప్రజానీకం తమ అస్తిత్వాన్ని కోల్పోయి హిందూ మతంలోకి ఇమిడిపోయేలా చెయ్యాలన్న ఆర్.యస్.యస్ బృహత్తర ప్రణాళికలో భాగంగానే ఇదంతా సాగుతున్నది.

షెడ్యూల్డు తెగల ప్రజానీకం పట్ల ఆర్.యస్.యస్ అనుసరించే ద్వంద్వ ప్రమాణాలను గమనిస్తే ప్రజా సముదాయాన్ని ఆర్.యస్.యస్ ఎలా వంచిస్తున్నదో స్పష్టం అవుతుంది. క్రైస్తవ మతం స్వీకరించిన షెడ్యూల్డు తెగలకు ఎస్టీ రిజర్వేషన్ వర్తింపచెయ్యకూడదని కాషాయ పరివార శక్తులు డిమాండ్ చేస్తుంటాయి. ఆదివాసీల మత విశ్వాసాలను ఆచరించే వారికే రిజర్వేషన్లు అమలు పరచాలని అంటూనే హైందవ మతం స్వీకరించిన వారికి మాత్రం రిజర్వేషన్లు కొనసాగించాలని దగాకోరు వాదనలు చేస్తుంటుంది. రాజ్యాంగ పరంగా గానీ, చట్ట పరంగా గానీ ఎస్టీలను వారు అనుసరించే మతం ఆధారంగా కాకుండా ఇతరత్రా అనేక అంశాల ఆధారంగా నిర్ధారిస్తారనే వాస్తవాన్ని ఈ కాషాయ పరివార శక్తులు కావాలనే విస్మరిస్తుంటాయి.

> **నవంబర్ 2020లో జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం...2021 జనాభా లెక్కింపు సందర్భంగా 'సర్న' మతస్థులు తమ మతాన్ని నిర్దిష్టంగా పేర్కొనడానికి వీలుగా 'ఎన్యూమరేషన్' పత్రాల్లో ప్రత్యేకంగా 'కాలమ్' పొందుపరచాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనిని శాసనసభలో బిజెపి వ్యతిరేకించే సాహసం చెయ్యలేదు. ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపినా మోడీ సర్కారు ఇప్పటి వరకూ ఈ అంశం మీద స్పందించలేదు. ఆ తీర్మానానికి ఇవాల్టికీ ప్రాసంగికత ఉన్నది. ఇది కేవలం ఒక రాష్ట్రానికే పరిమితమైనది కాదు. 'ఎన్యూమరేషన్' పత్రాల్లో ప్రస్తుతం పేర్కొన్న ఆరు మతాలతో పాటు ఆదివాసి/ఎస్.టి మత విశ్వాసం పేరిట 'కాలమ్'ను పొందుపరచాలి. ఆదివాసుల ప్రజాస్వామిక, రాజ్యాంగ పరమైన హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టేలా అన్ని రాజకీయ పక్షాలూ ఒత్తిడి తీసుకురావాలి.**

ఒకే దేశం - ఒకే ప్రజ - ఒకే జాతి పేరిట భారత ప్రజానీకం మొత్తాన్ని హిందూత్వలో గుదిగుచ్చాలని ఆర్.యస్.యస్, బిజెపి లు చేపట్టిన ప్రణాళిక ఆదివాసీ తెగల అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంది. మన దేశంలో ఎస్టీలుగా గుర్తింపబడిన 700 తెగల ప్రజానీకం మధ్యన కొన్ని సారూప్యతలు, వివిధ భిన్నత్వాలు నెలకొని ఉన్నాయి. సాంస్కృతికంగా, భాషాపరంగా, ఆధ్యాత్మికంగా భారతదేశానికి ఉన్న వైవిధ్యతకు షెడ్యూల్డ్ తెగల జనాభా ఒక ప్రతీక. కానీ ప్రస్తుతం ఈ తెగల ప్రజానీకాన్ని వివిధ మార్గాలు, పద్ధతుల ద్వారా తమ అస్తిత్వం కోల్పోయేలా చేస్తున్నారు. జనాభా లెక్కింపులో తమ మత విశ్వాస ప్రకటనకు చోటు లేకుండా చెయ్యడం ఆ కుట్రలో భాగమే.

ప్రత్యేక కాలమ్ రూపొందించాలి

నవంబర్ 2020లో జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం...2021 జనాభా లెక్కింపు సందర్భంగా 'సర్న' మతస్తులు తమ మతాన్ని నిర్దిష్టంగా పేర్కొనడానికి వీలుగా 'ఎన్యూమరేషన్' పత్రాల్లో ప్రత్యేకంగా 'కాలమ్' పొందుపరచాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనిని శాసనసభలో బిజెపి వ్యతిరేకించే సాహసం చెయ్యలేదు. ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపినా మోడీ సర్కారు ఇప్పటి వరకూ ఈ అంశం మీద స్పందించలేదు. ఆ తీర్మానానికి ఇవాల్టికీ ప్రాసంగికత ఉన్నది. ఇది కేవలం ఒక రాష్ట్రానికే పరిమితమైనది కాదు. 'ఎన్యూమరేషన్' పత్రాల్లో ప్రస్తుతం పేర్కొన్న ఆరు మతాలతో పాటు ఆదివాసి/ఎస్.టి మత విశ్వాసం పేరిట 'కాలమ్'ను పొందుపరచాలి. ఆదివాసుల ప్రజాస్వామిక, రాజ్యాంగ పరమైన హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టేలా అన్ని రాజకీయ పక్షాలూ ఒత్తిడి తీసుకురావాలి.

/ 'హిందూ' పత్రిక సౌజన్యంతో /
/ వ్యాసకర్త సిపిఐ(యం) సీనియర్ నేత /

సెటైర్

పాజిటివ్ థింకింగ్

సుబ్రమణ్యం

శ్రీకాకుళం వెళ్ళవలసిన పని పడింది. ఆర్టీసీ బస్సెక్కాను. వేగంగా పోతోంది. నా పక్క సీటులో ఒక పెద్దాయన కూర్చున్నాడు. పలకరింపులయ్యాక లోకాభిరామాయణంలో పడ్డాం. ఎదుగూ బొదుగూ లేని ఇపిఎఫ్ పెన్షన్ నెలకు 1800 వస్తోందతనికి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో రిటైర్ అయిన ఉద్యోగి అతడు. ప్రభుత్వం మీద అతడికున్న అసంతృప్తినంతటినీ వెళ్ళగక్కుతున్నాడు. నేను వింటున్నాను. అవతలి వరుసలో కూర్చున్న మరో పెద్దాయన మాతో కలిసేడు. అతగాడు ఒక సుమారు రైతు. కౌలుకి కూడా చేస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి తోడ్పాటూ లేదని అతగాడూ తన బాధను వ్యక్తం చేస్తున్నాడు. మా చర్చ అంతా మా సమస్యల చుట్టూ సాగుతోంది. నేను పెంచుతున్న ఆస్తి పన్ను, బెదిరిస్తున్న స్మార్ట్ మీటర్ల గురించి మాట్లాడుతున్నాను.

బస్సులోని తక్కిన ప్రయాణీకులకు మా చర్చ పెద్దగా పట్టడం లేదు. చంద్రబాబు లేదా జగన్ -ఇద్దరిలో ఎవరు బెటర్ అన్న చర్చ పెడితే బహుశా కొందరు చర్చలో పాల్గొనేవారేమో. మోడీ మెరుగా లేక రాహుల్ గాంధీకి ఏమైనా అవకాశం ఇవ్వాలా అని చర్చ జరిగినా కొంత ఆసక్తిని చూపించివుండేవారు. మేం అసలు పవర్‌స్టార్ ఊసే ఎత్తలేదు. చాగంటి, గరికపాటి ప్రవచనాల జోలికి పోవడం లేదు. తీర్థయాత్రల ప్రస్తావనా లేదు. అంచాత మా చర్చ అంత ప్రజాకర్షకంగా సాగడం లేదు. మాకు మాత్రం బాగానేవుంది.

ఉన్నట్టుండి మా వెనక సీటులోని ఒక కుర్రాడు "ఎక్స్యూజ్ మీ సర్! ఇందాకటి నుంచీ మీ చర్చ ఫాలో ఔతున్నాను. మీరు నాకన్నా అన్నింట్లోనూ పెద్దవారు. అంచాత మీకు చెప్పేపాటి వాడిని కాను కాని మీరు మరోలా అనుకోకపోతే నా అభిప్రాయాన్ని చెప్దామనుకుంటున్నాను." అన్నాడు. నాలుగోవాడు తగిలేడు కదా అని మేం సంతోషించాం. అతడి అభిప్రాయాన్ని చెప్పమన్నాం.

"మీరంతా చాలా నెగెటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారండీ. మీ ఆలోచనా విధానం మారాలి. మీరు పాజిటివ్ మైండ్‌సెట్ అలవాటు చేసుకోవాలి." అన్నాడతడు.

"ఇందులో పాజిటివ్, నెగెటివ్ ఏముంది బాబూ, మా బాధల గురించి మాట్లాడుకుంటున్నాం అంతే కదా" అన్నాను నేను.

"నేనూ అదే అంటున్నానండీ, ఎంతసేపూ మీ బాధలు, సమస్యలే తప్ప అవతలివాళ్ళ వైపు నుంచి కూడా ఆలోచించాలి కదా. మీ సమస్యల్ని తీర్చాల్సిన ప్రభుత్వాలు ఎన్ని ఇబ్బందుల మధ్య పని చేస్తున్నాయో గమనించాలి కదా. అటువైపు నుంచీ పాకిస్తాన్ తో, ఉగ్రవాదంతో యుద్ధం, ఇటువైపు బొత్తిగా దేశభక్తి లేని ప్రతిపక్షం పెట్టుకుని మోడీజీ ఇంత పెద్ద దేశాన్ని పాలించడం ఎంత కష్టమో మీరు ఆలోచించాలి కదా? అలాగే ఖాళీ ఖజానాతో చంద్రబాబు రాష్ట్రాన్ని పట్టాలమీదకి ఎక్కించాలనుకుంటున్నాడు. అది ఎంత పెద్ద పనో మీరు ఆలోచిస్తున్నారా? ఎంతసేపూ నాకేం చెయ్యడం లేదు ఈ ప్రభుత్వాలు అంటున్నారు కాని, మీరు ఈ దేశానికి ఏం చేశారో ఆలోచిస్తున్నారా? " అని ఆ యువకుడు అన్నాడు.

> **నేనూ ఒక పౌరుడినే. నా డ్యూటీ నేను చేస్తున్నాను. కొన్న సరుకుల మీద పన్ను కడుతున్నాను. జీతంలో నుండే ఆదాయ పన్ను కట్ అయిపోతుంది. నెల నెలా కరెంటు బిల్లు, ఆర్నెల్లకోసారి ఆస్తి పన్ను, నీటి పన్ను, వృత్తి పన్ను-ఇలా అన్ని పన్నులు కడుతున్నాను. ఎన్నో ఇ.ఎం.ఐ లు కడుతున్నాను. కాని ఈ ప్రభుత్వం పన్నులు ఎగ్గొట్టేవాళ్ళని, బ్యాంకుల్లో రుణాలు ఎగ్గొట్టేవాళ్ళని వెనకేసుకొస్తోంది. పాజిటివ్‌గా ఆలోచించి ఏదో ఓ మూల చిన్న గుడిసె వేసుకున్న పేదల్ని అక్కడి నుంచి లేపేసేదాకా ఊరుకోడం లేదు. సోషల్ మీడియాలో ఏదో పోస్టు పెట్టినవాడిని వెతికి పట్టుకుని మరీ కేసులు పెడుతోంది కాని దళితులపై హత్యాచారాలు చేసివాడిని ఒక్కడిని కూడా శిక్షంచిన పాపాన పోలేదు. ఇలా చాలా చెప్పొచ్చు. కాని ఒక్కటి మాత్రం విను. మన దేశంలో పాజిటివ్ థింకింగ్ అనేదే గనుక వర్కర్లకి, ఉద్యోగస్తులకి, రైతులకి లేకపోయి వుంటే దేశం ఒక్కడుగు కూడా ముందుకు వేయడం సాధ్యం కాదు.**

"బాగుంది బాబూ. మరి ఆ పాజిటివ్ మైండ్‌సెట్‌తో నువ్వేం చేస్తున్నావో కాస్త మాకు తెలియజెప్పు' అని అడిగాం. తానొక రియల్ ఎస్టేట్ కంపెనీలో పార్ట్‌నర్‌నని, వ్యాపారం కోసం ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తానని, అయినప్పటికీ కనీసం రోజుకో గంట సేపు సమాజ సేవలో పాల్గొంటానని చెప్పాడు. ప్రతీ ఏడూ దగ్గర్లో ఉన్న స్కూలుకి వెళ్ళి పిల్లలకి నోటుపుస్తకాలు పంచుతాడట. వేసవిలో చలివేంద్రం పెట్టడానికి విరాళమిస్తాడట. ఏడాదిలో రెండుసార్లు రక్తదానం చేస్తాడట. యోగా చేస్తాడట. ప్రవచనాలు రోజూ వింటాడట. జగ్గీ వాసుదేవ్ బాబా అంటే అభిమానం అట. రాజకీయాల జోలికి పోడట. ఉద్యమాలంటే పడదట. అదంతా అరాచక కార్యక్రమం అని అతగాడు భావిస్తాడు.

"నీ సంగతి బాగానే వుంది కాని మా సమస్యల సంగతేమిటని మళ్ళీ అడిగాం. "సమస్యలు లేనిదెవరికి సార్? ఎంత సంపద ఉంటే అన్ని సమస్యలు ఉంటాయి. ఏ సమస్యలూ లేకుండా హాయిగా నిద్రపోయేది పేదవాడు మాత్రమే. మనకి సమస్యలు ఉన్నట్టే ప్రభుత్వానికీ సమస్యలుంటాయి. ప్రభుత్వాలని పాజిటివ్‌గా అర్థం చేసుకోవాలే తప్ప విమర్శించకూడదు." అన్నాడు.

స్మార్ట్ మీటర్ పెడితే సహకరిస్తానన్నాడు. ఆస్తి పన్ను పెంచకుంటే ప్రభుత్వానికి ఆదాయం ఎలా అనడిగాడు. వేటాడిన లేడిని కడుపారా తిన్న చిరుతపులి తృప్తి అతడి మాటల్లో వినిపించింది.

ఈ లోపు ఉన్నట్టుండి బస్ కండక్టర్ వచ్చి "పాజిటివ్ థింకింగ్ మాకు లేకపోతే ఇంకెవరికి ఉంది సార్? ధరలు పెరిగినప్పటికీ జీతాలు పెంచకపోయినా మా డ్యూటీలు మేం చేస్తూనే వున్నాం. మాకు పాజిటివ్ థింకింగ్ ఉంది కాబట్టే మీరు స్విచ్చి నొక్కితే బల్బు వెలుగుతుంది. కుళాయి తిప్పితే నీరు వస్తుంది. రాత్రుళ్ళు మేం రోడ్లు చిమ్ముతేనే తెల్లారి మీకు రోడ్లు నీట్‌గా కనిపిస్తాయి. రైతన్నలు పాజిటివ్‌గా ఉన్నారు కాబట్టే గిట్టుబాటు కాకున్నా వ్యవసాయం చేస్తున్నారు. అందుకే మీబోటివాళ్ళకి నోట్లోకి నాలుగు వేళ్ళు రోజూ మూడు పూటలా పోతున్నాయి. 15 సంవత్సరాలుగా కనీస వేతనాలు పెంచకపోయినా రాష్ట్రంలో ఎక్కడా ఉత్పత్తి ఆగలేదు. ఉద్యమాల వల్ల మూతబడ్డ కంపెనీని గత పదేళ్ళలో ఒక్కదానినైనా చూపించగలరా?" అన్నాడు.

మన పాజిటివ్ యువకుడు వెనక్కి తగ్గలేదు. "మీరు చెప్పినవన్నీ మీ విధులు. అవి చేయాలి. ప్రభుత్వాన్నెందుకు పనిగట్టుకుని విమర్శిస్తారు? సమ్మెలు, ఉద్యమాలు ఎందుకు?" అన్నాడు.

"మా విధులు మేం చేస్తున్నాం. మరి ప్రభుత్వం తన విధుల్ని చేయకపోతే విమర్శించమా? పోరాడమా? అది ప్రజాస్వామ్యంలో భాగం కాదా?" అని అడిగాడా కండక్టర్.

"ఒక్క ప్రభుత్వం ఎన్నని చేయగలదు? మీరు పాజిటివ్‌గా అర్థం చేసుకోవాలి కదా?" అన్నాడా యువకుడు.

"చూడు బాబూ! నేను ఒక పౌరుడినే. నా డ్యూటీ నేను చేస్తున్నాను. కొన్న సరుకుల మీద పన్ను కడుతున్నాను. జీతంలో నుండే ఆదాయ పన్ను కట్ అయిపోతుంది. నెల నెలా కరెంటు బిల్లు, ఆర్నెల్లకోసారి ఆస్తి పన్ను, నీటి పన్ను, వృత్తి పన్ను-ఇలా అన్ని పన్నులు కడుతున్నాను. ఎన్నో ఇ.ఎం.ఐ లు కడుతున్నాను. కాని ఈ ప్రభుత్వం పన్నులు ఎగ్గొట్టేవాళ్ళని, బ్యాంకుల్లో రుణాలు ఎగ్గొట్టేవాళ్ళని వెనకేసుకొస్తోంది. పాజిటివ్‌గా ఆలోచించి ఏదో ఓ మూల చిన్న గుడిసె వేసుకున్న పేదల్ని అక్కడి నుంచి లేపేసేదాకా ఊరుకోడం లేదు. సోషల్ మీడియాలో ఏదో పోస్టు పెట్టినవాడిని వెతికి పట్టుకుని మరీ కేసులు పెడుతోంది కాని దళితులపై హత్యాచారాలు చేసివాడిని ఒక్కడిని కూడా శిక్షంచిన పాపాన పోలేదు. ఇలా చాలా చెప్పొచ్చు. కాని ఒక్కటి మాత్రం విను. మన దేశంలో పాజిటివ్ థింకింగ్ అనేదే గనుక వర్కర్లకి, ఉద్యోగస్తులకి, రైతులకి లేకపోయి వుంటే దేశం ఒక్కడుగు కూడా ముందుకు వేయడం సాధ్యం కాదు." అన్నాడు ఆ కండక్టర్.

"మరి జగ్గీ బాబా మీలో ఎక్కువమందికి పాజిటివ్ థింకింగ్ లేదన్నాడే?" అన్నాడు ఆ యువకుడు.

"జగ్గీ బాబా, ఆ బాపతు మనుషులు కొందరికి ప్రశ్నించడం అన్నా, విమర్శించడం అన్నా పడదు. ఇన్ఫోసిస్ మేధావికీ అంతే. మాబోటివాళ్ళని నోరెత్తకుండా చేయడం ఎలా అన్నదే వాళ్ళ ప్రయత్నం అంతా, దానికి పెట్టిన ముద్దు పేరు పాజిటివ్ థింకింగ్" అన్నాడు కండక్టర్.

"ఎప్పటికైనా ప్రపంచంలో పేదవాళ్ళు లేకుండా పోయి, సమసమాజం ఏర్పడాలని ఆరాటపడే మాబోటివాళ్ళకన్నా పాజిటివ్ థింకర్స్ ఎవరయ్యా?" అన్నాను నేను.

ఆ యువకుడు ఎగాదిగా చూసి " మీరు గాని కొంపదీసి కమ్యూనిస్టులా?" అనడిగాడు.

శ్రీకాకుళం బస్టాండ్ వచ్చేసింది. నేను ఆ యువకుడివైపు పాజిటివ్‌గా చూసి మరింత పాజిటివ్‌గా నవ్వి

" కొంపలు దీసేవాడిని మాత్రం కాదు లెండి" అని బస్సు దిగిపోయేను.

జనవాక్యం

రైల్వే చార్జీల పెంపు ఎందుకు?

నిన్నటి నుండి రైలు టికెట్లకు చార్జీలు పెంచారు. ఎందుకు పెంచారో అర్థంకాలేదు. సహజంగా నష్టాలు వస్తుంటే ఆ నష్టాన్ని పూడ్చుకోటానికి రేట్లు పెంచుతారు. రైళ్లన్నీ కిటకిటలాడుతుంటే నష్టం ఎలా వస్తుంది? జనరల్ బోగీలు లేనందున, రిజర్వేషన్ బోగీలు కూడా ఎక్కిపోతున్నారు. ఎసి పెట్టెల్లో కూడా ఎక్కిపోతున్నారు. ఈ రైళ్లు చాలక వందే భారత్ రైళ్ళు, వందే మాతరం రైళ్లు కూడా వేసి ప్రయాణికుల జేబులు కొడుతున్నారు. ఈ రైళు వస్తుంటే మిగిలిన రైళ్లు జీ హుజూర్ అంటూ పక్కకు తప్పుకోవాలి. రాజుగారు వస్తుంటే సేవకులు పక్కకు తప్పుకునేట్లు. పాసింజర్ రైళ్ళు తీసివేసి, పేర్లు మార్చి ఎక్స్‌ప్రెస్ రైళ్ళు వేశారు. ఒకటో రెండో జనరల్ బోగీలు వేసి సామాన్యుడు రైలు ఎక్కకుండా చేస్తున్నాడు మోడీ. కొన్ని రైళ్లకు స్టేషన్ బుకింగ్‌లో టికెట్లు ఇవ్వరు. ఇంటి దగ్గరే టికెట్లను ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవాలట. ఇంతగా రైల్వే వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందుతుంటే ఇంకా నష్టాలు ఎలా వస్తున్నాయి? ఖచ్చితంగా లాభాలు వస్తున్నట్లే!! మరి లాభాలు వస్తే చార్జీలు ఎందుకు పెంచారు? ప్రజలకు వివరంగా చెప్పాల్సిన బాధ్యత టికెట్ల చార్జీలు పెంచిన వారి మీద ఉంది. అంతేనా! ఐదేళ్ల క్రితం సీనియర్ సిటిజన్లకు తీసివేసిన రాయితీని కూడా ఇంతవరకు మరలా ఇవ్వలేదు. ఒకపక్క ప్రయాణికులను ఇంతగా ఇబ్బంది పెడుతూ చార్జీలు పెంచటం అనైతికం. సీనియర్ సిటిజన్లకు టికెట్లలో రాయితీ కల్పించండి. ప్రతి ఎక్స్‌ప్రెస్‌కీ సగం జనరల్ బోగీలు వెయ్యండి. విజయవాడ, తిరుపతి మధ్య లోకల్ రైళ్ళు వెయ్యండి. పెంచిన టికెట్ రేట్లు తొలగించండి.

- నార్నె వెంకట సుబ్బయ్య.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com

డిగ్రీ అడ్మిషన్లు ఇంకా ఆలస్యం



- ఇఎపిసెట్ తొలి కౌన్సిలింగ్ తరువాతే నిర్వహణ
- వాయిదా వేస్తున్న ఉన్నత విద్యాశాఖ
- ఇప్పటికే రెండు నెలల నుంచి ఖాళీగా విద్యార్థులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ మరింత ఆలస్యంకానుందని తెలిసింది. 'మేజర్ సబ్జెక్టు' విధానంపై ప్రభుత్వం ఇంత వరకు నిర్ణయం తీసుకోకపోవడంతో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ రాష్ట్రంలో నిలిచిన సంగతి తెలిసిందే. దీనిపై ఒకవైపు విద్యార్థుల్లో ఆందోళన నెలకొనగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మరికొంతకాలం వేచి చూడాలని భావిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం ఇఎపిసెట్ తొలి కౌన్సిలింగ్ తరువాతే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై దృష్టి సారించే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సిలింగ్‌ను ఈ నెల మూడో వారంలో నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి ఆలోచన చేస్తోంది. ఈ షెడ్యూల్‌పై కసరత్తు చేస్తోన్న విద్యామండలి నేడో,రేపో షెడ్యూల్‌ను ప్రకటించ నుంది. ఆగస్టు తొలి వారంలో తొలిదశ కౌన్సిలింగ్ పూర్తయ్యేలా షెడ్యూల్‌ను ఇప్పటికే సిద్ధం చేసింది. ఈ తొలిదశ కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిన తరువాతే డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అయిన తరువాత ముగియడానికి కనీసం 15 రోజుల సమయం పడుతుందని భావి స్తున్నారు. దీంతో తరగ తులు ఆగస్టు చివరిలో గానీ, సెప్టెంబర్ మొదటి వారంలో గానీ మొదల య్యే అవకాశం ఉంది. దీంతో డిగ్రీలో చేరే విద్యార్థులకు నాలుగు నెలల సమయం వృథా కానుంది.

ఎందుకిలా...?

ప్రతి ఏటా ఇంజనీరింగ్ అడ్మిషన్ల కంటే ముందుగా డిగ్రీలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. దీంతో ఇఎపిసెట్ రాసిన కొంత మంది విద్యార్థులు ముందుగా డిగ్రీ కోర్సులో చేరుతున్నారు. ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ ప్రారంభమయిన తరువాత దీనికి హాజరై ఇందులో ప్రవేశం తీసుకుంటున్నారు. ఇలా సుమారు 10వేల మంది విద్యార్థులు మారుతుంటారని అంచనా. దీంతో ఆ సీట్లను భర్తీ చేసుకోవడం ఇబ్బందిగా మారుతుందని ఉన్నత విద్యామండలి భావిస్తోంది. అలా కాకుండా ముందుగా ఇంజనీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తే ఇందులో చేరేవారు చేరతారని, మిగిలిన వాళ్లు డిగ్రీలో చేరతారని ఆలోచిస్తోంది. గతేడాది ఇంజనీరింగ్ తొలిదశ అడ్మిషన్ల కౌన్సిలింగ్‌ను జులై 18వ తేదికి, డిగ్రీ కౌన్సిలింగ్‌ను జులై 19వ తేదిన పూర్తిచేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్‌ను ఇంకా ప్రకటించలేదు.

విద్యార్థులకు నష్టం

ఉన్నత విద్యాశాఖ చేస్తున్న ఆలోచన వల్ల డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులకు నష్టదాయకంగా ఉంటుందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ కోర్సుల్లో ప్రతి ఏటా సుమారు 1.50 నుంచి 2లక్షల మంది విద్యార్థులు చేరుతున్నారు. గత విద్యాసంవత్సరం 1.80లక్షల మంది విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్లు తీసుకున్నారు. ఉన్నత విద్యాశాఖ చెబుతున్నట్లు డిగ్రీ నుంచి ఇంజనీరింగ్‌లో ప్రవేశం పొందే విద్యార్థుల సంఖ్య కేవలం 10వేల లోపే ఉంటుంది. డిగ్రీలో చేరి ఇంజనీరింగ్ వైపు వెళ్తున్నారనే ఆలోచనతో సుమారు 1.80లక్షల మంది విద్యార్థులను మూడు నెలల పాటు ఖాళీగా ఉంచడం సరైన నిర్ణయం కాదని విద్యావేత్తలు అంటున్నారు.

కేసుల దర్యాప్తు కోసం
ఫోన్ ట్యాపింగ్‌ను చట్టం అనుమతించదు

- కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు మద్రాస్ హైకోర్టు షాక్
- 2011లో జారీ చేసిన ఉత్తర్వులు రద్దు

చెన్నై : రహస్య కేసుల దర్యాప్తు కోసం ఫోన్ ట్యాపింగ్ చేయడాన్ని చట్టం అనుమతించదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం కీలకమైన తీర్పును వెల్లడించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఎ) 2011లో జారీ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఉత్తర్వులను రద్దు చేసింది. ఇలాంటి నిఘా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన గోప్యతా హక్కును ఉల్లంఘిస్తుందని విమర్శించింది. 'ప్రస్తుత చట్టం ప్రకారం, రహస్య కార్యకలాపాల కోసం లేదా నేరాలను గుర్తించే లక్ష్యంతో రహస్య పరిస్థితుల కోసం టెలిఫోన్ సంభాషణలు లేదా సందేశాలను ట్యాప్ చేయడానికి చట్టం అనుమతించదు' అని జస్టిస్ ఎన్ ఆనంద్ వెంకటేష్ తన తీర్పులో పేర్కొన్నారు. 94 పేజీల ఈ తీర్పులో ' చట్టం ద్వారా స్థాపించబడిన విధానం ద్వారా సమర్థించబడకపోతే.. ఫోన్ ట్యాపింగ్ అనేది ఒక వ్యక్తి యొక్క గోప్యతా హక్కును ఉల్లంఘించడమే అవుతుంది' అని కోర్టు తెలిపింది. 2011, ఆగస్టు 12న ఎంహెచ్‌ఎ జారీ చేసిన ఉత్తర్వును సవాల్ చేస్తూ ఎవెరాన్ ఎడ్యుకేషన్ లిమిటెడ్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ పి కిషోర్ దాఖలు చేసిన పిటిషన్ విచారణలో హైకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. తన మొబైల్ ఫోన్‌ను ట్యాపింగ్ చేయడానికి అధికారం ఇచ్చిన ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ ఈ పిటిషన్ వేశారు. ఆదాయపు పన్ను సీనియర్ అధికారికి రూ. 50 లక్షల లంచం ఇచ్చిన కేసులో నిఘా కోసం కిషోర్‌పై ఈ నిఘాను ఆదేశించారు.

అవినీతిని గుర్తించాల్సిన అవసరం కోసం ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఒక వ్యక్తి గోప్యతను ఉల్లంఘించడానికి ప్రభుత్వానికి చట్టం అవకాశం ఇవ్వలేదని కోర్టు స్పష్టం చేసింది.

గోదావరి పుష్కరాలకు 64 స్నానాల రేవులు అనుకూలం

ప్రజాశక్తి - నరసాపురం

గోదావరి పుష్కరాలకు జిల్లాలో 64 స్నానాల రేవులు అనుకూలమని ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి చెప్పారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పుష్కరాలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామన్నారు. ఇప్పటికే 400 కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో త్వరలో పెట్రోలింగ్ వాహనాలను ప్రవేశపెడుతున్నామన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి, దొంగ నోట్లు నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మండలంలోని నవరసపురంలో గతేడాది కోడి పందాలపై దాడి చేసి పెద్ద మొత్తంలో నగదు. కోళ్లను స్వాధీనం చేసుకున్న డిఎస్‌పితో పాటు 17మంది పోలీసు సిబ్బందికి ఆయన ప్రశంసాపత్రాలను అందించారు.

బానిసత్వం కంటే జైలులోనే ఉంటా

- ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్ : పాకిస్థాన్ పాలకులు నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నారని ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల పార్లమెంటు చేసిన ఓ చట్ట సవరణను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో స్పందించిన ఆయన.. ఈ బానిసత్వాన్ని అంగీకరించడానికి బదులు జైల్లో చీకటి గదిలో జీవించడానికి ఇష్టపడతానని అన్నారు. తన సందేశాన్ని ప్రజలకు చేరకుండా ప్రభుత్వం అన్నివిధాలా అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని తన మద్దతుదారులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. "ప్రజాస్వామ్యంలో నాలుగు అంశాలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఓటుహక్కు, చట్టబద్ధ పాలన, నైతికత, స్వేచ్ఛాయుత మీడియా. ఇటీవల చేసిన ఇరవై ఆరవ రాజ్యాంగ సవరణ వీటన్నింటినీ నాశనం చేసింది. జులై 6 తర్వాత.. ఈ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాలని దేశం మొత్తానికి ముఖ్యంగా పిటిఐ కార్యకర్తలకు, మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఈ బానిసత్వాన్ని అంగీకరించడం కంటే జైల్లో చీకటి గదిలోనే జీవిస్తా" అని ఇమ్రాన్ పేర్కొన్నారు. తన సందేశాన్ని ప్రజలకు చేరకుండా ప్రభుత్వం అన్నివిధాలా అడ్డుకుంటోందన్నారు.

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అనేక కేసులు ఎదుర్కొంటున్నారు. 2023 ఆగస్టు నుంచి జైల్లో ఉంటున్న ఆయన.. బెయిల్ కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఆ విఫలం అవుతున్నాయి.

'జిందాల్' హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ అల్యూమినియం కర్మాగారం కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో జిందాల్ బాధితులకు జిల్లా అధికారుల సమక్షంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం నాయకుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బొడ్డవరలో నిర్వాసిత రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రైతుల నుంచి భూములను జిందాల్ తీసుకొని 18 ఏళ్లయినా కంపెనీని నిర్మించలేదని అన్నారు. ఈ దృష్ట్యా చట్టం ప్రకారం ఎవరి భూమి వారికి అప్పగించకుండా ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్ పేరుతో తిరిగి చిన్న పరిశ్రమలకు అమ్ముకోవడాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. నిర్వాసితులకు భూమి అప్పగించి ఉద్యోగ కల్పనకు అవసరమైతే అదే భూమిని రైతుల నుంచి సేకరించాలన్నారు. అప్పుడు జిందాల్ కంపెనీకి భూములు ఇచ్చిన ముసిడిపల్లి, పెద్దకండేపల్లి, కిల్తంపాలెం, బొడ్డవర గ్రామాల ఎండిఆర్, ఎస్‌ఎఫ్‌ఎ రికార్డులను పంచాయతీల్లో అందుబాటులో లేకుండా తహాశీల్దార్ కార్యాలయంలో దాచేయడానికి కారణాలేంటో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ నాలుగు పంచాయతీల రెవెన్యూ రికార్డుల్లో అనేక అవకతవకలు జరిగాయన్నారు. వీటిపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

రాజధానికి చేరిన జిందాల్ భూ సమస్య

మండలంలోని జిందాల్ భూ సమస్య రాజధానికి చేరింది. షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కెఎస్.జవహర్‌ను రాజధానిలో జిందాల్ భూ నిర్వాసితులు బుధవారం కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జిందాల్ కంపెనీ పరిశ్రమ ప్రారంభించనందున తమ భూములు మళ్లీ తమకే ఇప్పించాలని కోరారు.

ట్రంప్ నోటిదురుసు

కమ్యూనిస్టులనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి నోరుపారేసుకున్నారు. కమ్యూనిస్టులపై తనకున్న అక్కసును వెళ్లగక్కారు. 'కమ్యూనిస్టు పిచ్చోడు' అని పేర్కొంటూ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో నేరుగా ఎవరి పేరూ ప్రస్తావించలేదు. అయితే ఆయన చేసిన ఈ కామెంట్ న్యూయార్క్ మేయర్ డెమొక్రాటిక్ అభ్యర్థి మమ్దానీని ఉద్దేశించేనని సోషల్ మీడియా కోడై కూస్తుంది. ట్రంప్ రాసిన పోస్టులో "ప్రశాంతంగా ఉండండి. నా దగ్గర అన్ని పనిముట్లు, కార్డులు ఉన్నాయి. న్యూయార్క్ నగరాన్ని కాపాడతాను. దానిని మళ్ళీ హాట్ అండ్ గ్రేట్‌గా మారుస్తా" అని రాసుకొచ్చారు. మమ్దానీ ఇటీవల న్యూయార్క్ నగర మేయర్‌గా గెలిచిన డెమొక్రటిక్ అభ్యర్థి మమ్దానీని ట్రంప్ మద్దతుదారులు వివాదంలోకి లాగారు. మమ్దానీ అమెరికన్ పౌరసత్వాన్ని రద్దు చేయాలనీ, దేశం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

టార్గెట్ వెనుక..

33 ఏండ్ల జోహ్రాన్ మమ్దానీ డెమొక్రటిక్ అభ్యర్థిగా న్యూయార్క్ మేయర్‌గా ప్రైమరీలో విజయం సాధించారు. అప్పటి నుంచి ట్రంప్ ఆయనపై మాటల దాడిని తీవ్రం చేశారు. మమ్దానీని 'కమ్యూనిస్ట్, అసమర్థుడు, ప్రమాదకరమైన నాయకుడు' అని ప్రచారం చేస్తున్నాడు. అదే సందర్భంలో అక్రమ వలసదారుల్ని అరెస్టు చేయకుండా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ)ను ఆపేయాలని మమ్దానీ చెప్పడాన్ని ట్రంప్ తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఫెడరల్ ఏజెన్సీల నిబంధనలు పాటించకపోతే, అరెస్టు చేయాల్సి ఉంటుందంటూ హెచ్చరిక చేశారు. అమెరికాలో కమ్యూనిస్టులు వద్దనీ, అలాంటి కార్యకలాపాలను తాను నిశితంగా గమనిస్తానంటూ సోషల్ మీడియా ఖాతా ట్రూత్‌లో పోస్టులు పెట్టారు.

నియంతృత్వం-మమ్దానీ

ట్రంప్ బెదిరింపులను జోహ్రాన్ మమ్దానీ తిప్పికొట్టారు. ఆయనది నియంతృత్వమనీ, తాను భయపడబోనని స్పష్టం చేశారు. తనను అమెరికా అధ్యక్షుడు అరెస్టు చేస్తాననీ, పౌరసత్వాన్ని తొలగిస్తాననీ, నిర్బంధ శిబిరంలో ఉంచుతాననీ, బహిష్కరిస్తానని బెదిరించారని చెప్పారు. కేవలం న్యూయార్క్ సిటీ ప్రజల్లో భయాన్ని వ్యాప్తి చేయడం కోసమే ట్రంప్ ఈ తరహా కామెంట్స్ చేస్తున్నారని పేర్కొన్నారు.

ఎవరీ జోహ్రాన్ మమ్దానీ?

జోహ్రాన్ మమ్దానీ భారతీయ-అమెరికన్ చలన చిత్ర నిర్మాత మీరా నాయర్ కుమారుడు. అతను ఉగాండాలోని కంపాలాలో జన్మించాడు. భార్య రామా దువాజీ సిరియన్ మూలానికి చెందిన కళాకారిణి. ఆమె 2018లో అమెరికా పౌరసత్వం పొందింది. ఆమె 2021 నుంచి న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యురాలుగా ఉన్నారు, మమ్దానీ న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికలకు డెమొక్రాటిక్ ప్రైమరీలో గెలవడంతో ట్రంప్ దృష్టి ఆయనపై పడింది. అప్పటి నుంచి నయానా భయానా మమ్దానీని హెచ్చరిస్తూనే ఉన్నారు.

నిష్పాక్షికత ప్రశ్నార్థకం

- కేంద్ర సాధికార కమిటీపై మాజీ సివిల్ సర్వెంట్ల ఆందోళన
- సీజేఐ గవాయ్‌కి 60 మంది లేఖ

న్యూఢిల్లీ : కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే సెంట్రల్ సాధికార కమిటీ (సీఈసీ) నిష్పాక్షికత గురించి రిటైర్డ్ సివిల్ సర్వెంట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో 60 మంది రిటైర్డ్ సివిల్ సర్వెంట్ల బృందం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కి లేఖ రాసింది. అందులో పలు అంశాలను బృంద సభ్యులు లేవనెత్తారు.

ఏమిటీ సీఈసీ?

సుప్రీంకోర్టు ఒత్తిడి మేరకు 2002లో సీఈసీని తొలిసారిగా ఏర్పాటు చేశారు. అడవులు, వన్యప్రాణులు, సంరక్షణకు సంబంధించిన సుప్రీంకోర్టు తీర్పులను ట్రాక్ చేయటానికీ, ఈ విషయాలలో వివిధ పార్టీలు (వాదప్రతివాదులు) నిబంధనలు పాటించని కేసులను పరిశీలించటానికి దీని ఏర్పాటు జరిగింది. సీఈసీలో పదవీవిరమణ చేసిన ప్రభుత్వ అధికారులే కాకుండా ఇద్దరు స్వతంత్ర సభ్యులు ఉంటారు. అయితే,డిసెంబర్, 2023లో సీఈసీని పునర్నిర్మించారు. కొత్త సీఈసీలో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలో ఉన్నత పదవులు నిర్వహించిన పదవీ విరమణ చేసిన అధికారులు మాత్రమే ఉంటారు. దీంతో, సీఈసీ నిష్పాక్షికతపై రిటైర్డ్ బ్యూరోక్రాట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతనెల 30న లేఖ

ఈ మేరకు గతనెల 30న జస్టిస్ గవాయ్‌కు వారు లేఖ రాశారు. ప్రయోజనాల సంఘర్షణ, సహజ న్యాయ సూత్రాల ఉల్లంఘన గురించి పెద్ద ఆందోళన ఉన్నదనీ, ఇది దేశంలో అడవుల తరుగుదలను మరింత ముందుకు తీసుకెళ్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేఖపై సంతకం చేసినవారిలో కేరళలోని మాజీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రకృతి శ్రీవాస్తవ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి మీనా గుప్తా, బీహార్ మాజీ ప్రధాన కార్యదర్శి అనుప్ ముఖర్జీ, ప్లానింగ్ కమిషన్ మాజీ కార్యదర్శి ఎన్‌సి సక్సేనా, పంజాబ్ మాజీ డీజీపీ జూలియో రిబీరోలు ఉన్నారు.

సీఈసీ సభ్యుల నుంచి స్వతంత్ర సలహాలు ఆశించలేం

సీఈసీకి సంబంధించి అనేక ప్రయోజనాల సంఘర్షణలకు సంబంధించి మాజీ సివిల్ సర్వెంట్లు తీవ్రమైన ఆందోళనలను వెలిబుచ్చారు. "సీఈసీ సభ్యులలో ఇద్దరు భారత ప్రభుత్వంలో అత్యున్నత అటవీ, వన్యప్రాణుల విభాగంలో డైరెక్టర్ జనరల్, ప్రత్యేక కార్యదర్శిగా పదవులు నిర్వహించి ఇటీవలే పదవీ విరమణ చేశారు. దీంతో విధాన రూపకల్పనలో దగ్గరి సంబంధం కలిగి ఉన్న వీరు సీఈసీలో భాగంగా ఉంటే సుప్రీంకోర్టుకు స్వతంత్ర సలహా ఇస్తారని ఆశించలేం" అని సదరు లేఖలో వారు పేర్కొన్నారు. అటవీ సంరక్షణ సవరణ బిల్లు 2023ను తయారు చేసింది అప్పటి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలో అధికారంలో ఉన్న సీఈసీ సభ్యుడని వివరించారు. అంతేకాదు, బిల్లును, శాస్త్రవేత్తలు, ఇతర నిపుణులతో సహా ప్రజలు లేవనెత్తిన వివిధ ఆందోళనలను పరిశీలించాలని సూచించబడిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ముందు దానిని సదరు సభ్యుడు సమర్థించారని గుర్తు చేశారు.

అటవీ సంరక్షణ చట్టంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు

ప్రస్తుతం, సుప్రీంకోర్టులో దాఖలైన అనేక పిటిషన్లు అటవీ సంరక్షణ చట్టం 2023ని సవాలు చేశాయి. ఈ కేసులను సర్వోన్నత న్యాయస్థానం ఇంకా విచారిస్తున్నది. ఈ అంశంపై దాని తుది నిర్ణయం పెండింగ్‌లో ఉన్నది. ఇందులో సీఈసీ పాత్ర కీలకం కానున్నది. సీఈసీ, దాని సభ్యులు సుప్రీంకోర్టుకు సలహాదారు పాత్రను పోషిస్తారు. ఈ కేసుపై కూడా వారు కోర్టుకు సలహా ఇస్తారు. దీంతో సీఈసీలో స్వతంత్ర సభ్యులు లేకపోవటాన్ని లేఖలో మాజీ బ్యూరోక్రాట్లు ఆక్షేపించారు. సీఈసీ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సీజేఐని మాజీ బ్యూరోక్రాట్లు కోరారు.

JM FINANCIAL

జెఎమ్ ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఐడెంటిఫై నంబర్ : U67190MH2007PLC74287
నమోదిత కార్యాలయం : 7వ అంతస్తు, సినర్జీ, అప్ప సాహెబ్ మారత్ మార్గ్, ప్రభాదేవి, ముంబై-400025, వెబ్‌సైట్ :www.jmfinancialarc.com
సంప్రదించాల్సిన వ్యక్తి : 1. రమణారావు-9849271633, 2. చందన్ సఖల్కార్- 9820407168, 3. సింధూజ పిళ్లై-022-6224 1676,

ఇ-వేలం విక్రయ నోటీసు- తాజా అమ్మకం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("సర్ఫేసీ యాక్ట్") యొక్క సెక్షన్ 5(1) (బి) క్రింద పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ లోన్ పూల్ అసైన్ చేయబడిన (క్రింద పేర్కొన్న లోన్లతో సహా) అంతర్లీనతో కలిపి దానిపై క్రెడిట్ చేయబడిన సెక్యూరిటీ ఇంట్రస్ట్‌తో పాటు అన్నీ హక్కులు, టైటిల్ మరియు దానిపై వడ్డీ, జెఎమ్‌ఎఫ్ ఎఆర్‌సి (జెఎమ్)కి అనుకూలంగా అనుసరించి తేది 29 మార్చి, 2023 నాటి వైడ్ అసైన్‌మెంట్ అగ్రిమెంట్ ("అసైన్‌మెంట్ అగ్రిమెంట్") అనుసరించి (ఇక్కడ అసైనీగా సూచిస్తారు) జెఎమ్‌ఎఫ్‌ఎఆర్‌సి-అరణ్య-ట్రస్ట్ యొక్క ట్రస్టీ హోదాలో వ్యవహరిసుంది. అసైన్‌మెంట్/సర్వీస్ అగ్రిమెంట్ ప్రకారం అన్ని కార్యాచరణ మరియు విధానాల ప్రక్రియలను సులభతరం చేయడానికి సర్వీస్ ప్రొవైడర్/కలెక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించడానికి పిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కి అధికారం ఉందని మరియు నియమించబడిందని తెలియజేయడం. **సర్ఫాసీ యాక్ట్, 2002** క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి ద్వారా ఇక్కడ క్రింద పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌ని రుణగ్రహీత/ల నుండి బకాయిల రికవరీ కొరకు **'ఎక్కడ ఉందో అక్కడే", "ఆధారం ఏమిటి" మరియు "ఏది ఉందో అదే" ప్రాతిపదికన** భౌతిక స్వాధీనంచేసుకొన్న చేసుకోవడం జరిగినది. స్థిరాస్తి కొనుగోలు కొరకు దిగువసంతకందారు ద్వారా ఆఫర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరాలు దిగువ విధంగా ఉన్నవి :

లోన్ కోడ్/శాఖ/ రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీత(లు)/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి చిరునామా- ఫైనల్	రిజర్వు ధర	బయానా మొత్తం (ఇఎమ్‌డి) (10 శాతం ఆర్‌పి)	బకాయి మొత్తం (25.06.2025)
Loan Code No.: 02400006135, విజయవాడ (శాఖ), జేమ్స్ రంప (రుణగ్రహీత), సుకన్య రంప (సహ రుణగ్రహీత1)	తేది : 29.06.2021, రూ. 29,00,265/- (ఇరవై తొమ్మిది లక్షల రెండు వందల అరవై ఐదు రూపాయలు మాత్రమే)	ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ ఉన్న విస్తీర్ణం : కృష్ణాజిల్లా, విజయవాడ రూరల్ మండలం, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలోని గొల్లపూడి గ్రామం మరియు గ్రామ పంచాయతీ ఏరియా వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.559/1లో కవర్ చేయబడిన "సాయి మహాలక్ష్మి రెసిడెన్సీ" యొక్క రెండవ అంతస్తులో ఫ్లాట్ నం.ఎస్-1 తో ప్లింత్ ఏరియా 1200 చ.అ.లు., సాధారణఏరియా 100 చ.అ.లు. మరియు పార్కింగ్ ఏరియా 100 చ.అ.లు. షెడ్యూల్ ఆస్తి పరిధి 35 చ.గ.లు. సైట్ అవిభక్త మరియు పేర్కొనబడని బయట 330 చ.గ.లు. ఉన్న హద్దులు : అంశం నం.1 (స్థలం సరిహద్దులు) : తూర్పు: అల్లం నూకాలమ్మ ప్లాట్ నం.42 ఆస్తి దక్షిణం: ప్లాట్ నం.50 ఆస్తి, పడమర : వారణాసి సురేష్ ప్లాట్ నం.44 ఆస్తి, ఉత్తరం : 33 అ.లు. రోడ్డు. అంశం నం.2 : (ఫ్లాట్ సరిహద్దులు) : తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : కామన్ కారిడార్, మెట్లకేస్ మరియు లిఫ్ట్ సరిహద్దులు : ఉత్తరం : కామన్ కారిడార్ మరియు మెట్లకేస్, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై	రూ. 30,00,000/- (ముప్పై లక్షల రూపాయలు మాత్రమే)	రూ. 3,00,000/- (మూడు లక్షల రూపాయలు మాత్రమే)	రూ. 50,75,042/- (యాభై లక్షల డెభై ఐదు వేల నలభై రెండు రూపాయలు మాత్రమే)

ఇ-వేలం తేది : 07.08.2025, ఉ॥11.00 గం.ల నుండి మ॥1.00 గం.ల వరకు (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో), బిడ్ సమర్పణకు చివరి తేది : 06.08.2025, సా॥ 4.00గం.లకు ముందు.
అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నిబంధనల కొరకు, దయచేసి అమ్మకం కొరకు అందించబడిన లింక్ **https://www.jmfinancialarc.com/Home/Assetsforsale** లేదా **https://www.bankauction.in** ని చూడండి.

సర్ఫాసీ యాక్ట్ క్రింద రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు చట్టపరమైన 30 రోజుల అమ్మకం నోటీసు
పైన పేర్కొన్న రుణగ్రహీత/హామీదారు సెక్షన్ 13(2) నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని వేలం తేదీకి ముందు వరకు వచ్చిన వడ్డీతో పూర్తిగా చెల్లించాలని గమనించగలరు, విఫలమైతే ఏ ఆస్తిని వేలం వేయబడుతుంది/విక్రయం చేయబడుతుంది మరియు బకాయిలు ఏదైనా ఉంటే, రుణగ్రహీత/హామీదారుల నుండి వడ్డీ మరియు ఖర్చుతో తిరిగి పొందబడుతుంది.
తేది : 03.07.2025, ప్రదేశం : కృష్ణ, ఎ.పి. సం/- (అధీకృత అధికారి), (అరణ్య-ట్రస్ట్)

JM FINANCIAL

జెఎమ్ ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఐడెంటిఫై నంబర్ : U67190MH2007PLC74287
నమోదిత కార్యాలయం : 7వ అంతస్తు, సినర్జీ, అప్ప సాహెబ్ మారత్ మార్గ్, ప్రభాదేవి, ముంబై-400025, టెలి : +91 22 6630 3030/ ఫ్యాక్స్ : +911 22 6630 3223/ www.jmfinancialarc.com
సంప్రదించాల్సిన వ్యక్తి : 1. రమణారావు-9849271633, 2. రోహన్ సావంత్-9833143013 3. సింధూజ పిళ్లై-022-6224 1676,

ఇ-వేలం విక్రయ నోటీసు- తదుపరి అమ్మకం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("సర్ఫేసీ యాక్ట్") యొక్క సెక్షన్ 5(1) (బి) క్రింద పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ లోన్ పూల్ అసైన్ చేయబడిన (క్రింద పేర్కొన్న లోన్లతో సహా) అంతర్లీనతో కలిపి దానిపై క్రెడిట్ చేయబడిన సెక్యూరిటీ ఇంట్రస్ట్‌తో పాటు అన్నీ హక్కులు, టైటిల్ మరియు దానిపై వడ్డీ, జెఎమ్‌ఎఫ్ ఎఆర్‌సి (జెఎమ్)కి అనుకూలంగా అనుసరించి తేది 29 మార్చి, 2023 నాటి వైడ్ అసైన్‌మెంట్ అగ్రిమెంట్ ("అసైన్‌మెంట్ అగ్రిమెంట్") అనుసరించి (ఇక్కడ అసైనీగా సూచిస్తారు) జెఎమ్‌ఎఫ్‌ఎఆర్‌సి-అరణ్య-ట్రస్ట్ యొక్క ట్రస్టీ హోదాలో వ్యవహరిసుంది. అసైన్‌మెంట్/సర్వీస్ అగ్రిమెంట్ ప్రకారం అన్ని కార్యాచరణ మరియు విధానాల ప్రక్రియలను సులభతరం చేయడానికి సర్వీస్ ప్రొవైడర్/కలెక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించడానికి పిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కి అధికారం ఉందని మరియు నియమించబడిందని తెలియజేయడం.
సర్ఫాసీ యాక్ట్, 2002 క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి ద్వారా ఇక్కడ క్రింద పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌ని రుణగ్రహీత/ల నుండి బకాయిల రికవరీ కొరకు **'ఎక్కడ ఉందో అక్కడే", "ఆధారం ఏమిటి" మరియు "ఏది ఉందో అదే" ప్రాతిపదికన** భౌతిక స్వాధీనంచేసుకొన్న చేసుకోవడం జరిగినది. స్థిరాస్తి కొనుగోలు కొరకు దిగువసంతకందారు ద్వారా ఆఫర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరాలు దిగువ విధంగా ఉన్నవి :

లోన్ కోడ్/శాఖ/ రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీత(లు)/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి చిరునామా- ఫైనల్	రిజర్వు ధర	బయానా మొత్తం (ఇఎమ్‌డి) (10 శాతం ఆర్‌పి)	బకాయి మొత్తం (25.06.2025)
Loan Code No.: 02400006414, విజయవాడ (శాఖ), హరిత కోల్డ్ స్టోరేజ్ (రుణగ్రహీత), ఎస్‌ఎమ్‌ఎమ్ ట్రేడర్స్ (సహ రుణగ్రహీత1) మధుసూధనరావు సముద్రాల (సహ రుణగ్రహీత 2) హరిత వెంకట దుర్గా రాధిక సముద్రాల (హామీదారు 1)	తేది : 19.11.2019, రూ. 1,48,02,159/- (ఒక కోటీ నలభై ఎనిమిది లక్షల రెండు వేల ఒక వందా యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే)	ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ ఉన్న విస్తీర్ణం : హరిత కోల్డ్ స్టోరేజ్, మూల్యాంకనం నం.1072, ఎస్‌వై.నం.357/1, రైస్ మిల్ వద్ద, నవాబ్‌పేట గ్రామం, పెనుగంచిప్రోలు, కృష్ణ, ఆంధ్రప్రదేశ్-521190.	రూ. 3,40,10,000/- (మూడు కోట్ల నలభై లక్షల పది వేల రూపాయలు మాత్రమే)	రూ. 34,01,000/- (ముప్పై నాలుగు లక్షల ఒక వెయ్యి రూపాయలు మాత్రమే)	రూ. 3,16,91,825/- (మూడు కోట్ల పదహారు లక్షల తొంభై ఒక్క వేల ఎనిమిది వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే)
Loan Code No.: 02400006123, విజయవాడ (శాఖ), వాణి మహేష్ బెజవాడ (రుణగ్రహీత), సరిత బెజవాడ (సహ రుణగ్రహీత1) రామ సుజాత బెజవాడ (సహ రుణగ్రహీత 2)	తేది : 14.06.2021, రూ. 23,87,542/- (ఇరవై మూడు లక్షల ఎనభై ఏడు వేల ఐదు వందల నలభై రెండు రూపాయలు మాత్రమే)	ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ ఉన్న విస్తీర్ణం : ఆంధ్రప్రదేశ్-520007, కృష్ణ, పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామం, యనమలకుదురు మజీద్ గ్రౌండ్, మజీద్ గ్రౌండ్ వద్ద, హిల్ డౌన్ ఏరియా, బెజవాడ వాణి మహేష్ నిలయం, గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నం.201 ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ సరిహద్దులు : ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం: లిఫ్ట్, మెట్లు మరియు కారిడార్, తూర్పు : ఫ్లాట్ బాల్కానీ/ కారిడార్, పడమర : ఓపెన్ టుస్కై సరిహద్దులు : ఉత్తరం : ఓపెన్ టుస్కై, దక్షిణం: లిఫ్ట్, మెట్లు మరియు కారిడార్, తూర్పు : ఫ్లాట్ బాల్కానీ/ కారిడార్, పడమర : ఓపెన్ టు స్కై.	రూ. 16,70,000/- (పదహారు లక్షల డెభై వేల రూపాయలు మాత్రమే)	రూ. 1,67,000/- (ఒక లక్షా అరవై ఏడు వేల రూపాయలు మాత్రమే)	రూ. 44,51,905/- (నలభై నాలుగు లక్షల యాభై ఒక్క వేల తొమ్మిది వందల ఐదు రూపాయలు మాత్రమే)

ఇ-వేలం తేది : 22.07.2025, ఉ॥11.00 గం.ల నుండి మ॥1.00 గం.ల వరకు (ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపుతో), బిడ్ సమర్పణకు చివరి తేది : 21.07.2025, సా॥ 4.00గం.లకు ముందు.
అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నిబంధనల కొరకు, దయచేసి అమ్మకం కొరకు అందించబడిన లింక్ **https://www.jmfinancialarc.com/Home/Assetsforsale** లేదా **https://www.bankauction.in** ని చూడండి.

సర్ఫాసీ యాక్ట్ క్రింద రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు చట్టపరమైన 15 రోజుల అమ్మకం నోటీసు
పైన పేర్కొన్న రుణగ్రహీత/హామీదారు సెక్షన్ 13(2) నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని వేలం తేదీకి ముందు వరకు వచ్చిన వడ్డీతో పూర్తిగా చెల్లించాలని గమనించగలరు, విఫలమైతే ఏ ఆస్తిని వేలం వేయబడుతుంది/విక్రయం చేయబడుతుంది మరియు బకాయిలు ఏదైనా ఉంటే, రుణగ్రహీత/హామీదారుల నుండి వడ్డీ మరియు ఖర్చుతో తిరిగి పొందబడుతుంది.
తేది : 03.07.2025, ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ సం/- (అధీకృత అధికారి), (అరణ్య-ట్రస్ట్)

పంజాబ్ నేషనల్ బ్యాంక్
punjab national bank
(భారత ప్రభుత్వరంగ సంస్థ)

అసెట్ రికవరీ మానిటరింగ్ బ్రాంచ్,
డి నెం.30-15-169, 1వ అంతస్తు, కె.ఎస్.టవర్, సరస్వతి పార్క్ దగ్గర, విశాఖపట్నం-530020 (ఏపి)

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. **శ్రీ తొర్లపాటి వెంకటేశ్వరరావు,** డి.నెం.16-43, మౌలానగర్, హై స్కూల్ రోడ్డు ఎదురుగా, గొల్లపూడి, విజయవాడ-521225. (ఋణగ్రహీత)
2. **శ్రీమతి తోర్లపాటి మల్లీశ్వరి,** డి.నెం.16-43, మౌలానగర్, హై స్కూల్ రోడ్డు ఎదురుగా, గొల్లపూడి, విజయవాడ-521225. (ఋణగ్రహీత)
3. **శ్రీ వంగేటి ఉపేంద్ర, తండ్రి: కోటేశ్వరరావు,** 76-8/7-12, నవరంగి ధల్మిల్ రోడ్డు, భవానీపురం, కామకోటినగర్, విజయవాడ - పిన్: 520012. (హామీదారు)

డియర్ సర్/మేడమ్,
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (SARFAESI)లో సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు

మా **నరసరావుపేట బ్రాంచ్ (ఇంతక ముందు ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్)** నుండి **శ్రీ తొర్లపాటి వెంకటేశ్వరరావు, శ్రీమతి తోర్లపాటి మల్లీశ్వరి మరియు శ్రీ వంగేటి ఉపేంద్ర** వారు పొందిన ఋణసౌకర్యములు వివరములు దిగువున పేర్కొనబడినవి.

లోన్ సౌకర్యం	NPA తేదీ 01.05.2025 నాటికి వడ్డీతో సహా బకాయి	వర్తించని వడ్డీ 01.05.2025 నుండి 22.06.2025 వరకు)	పీనల్ వడ్డీ (సింపుల్)	బ్యాంకు భరించిన ఖర్చు/ ఛార్జీలు
టర్మ్ లోన్ (హౌసింగ్) 0924306208279	రూ. 27,96,791.89	రూ. 35,816.00/-		420.53

రిజర్వు బ్యాంకు వారి మార్గదర్శకాల ప్రకారం సదరు బకాయి వాయిదాలు/వడ్డీ/అసలు చెల్లించుటలో విఫలమైనందున సదరు ఖాతా (NPA) **నిరర్థక ఖాతాగా తేది. 01.05.2025న వర్గీకరించడమైనది. 23.06.2025** తేదీ నాటి లెటర్ ప్రకారం పైన తెలిపిన ఋణసౌకర్యములకు సంబంధించి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం బకాయిను చెల్లించవలెనని కోరియున్నాము/ఆదేశించినాము.

తేది. 22.06.2025 నాటికి బ్యాంక్‌కు మీరు చెల్లించవలిసిన బకాయి మొత్తము **రూ. 28,33,028.42 (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల ముప్పై మూడు వేల ఇరవై ఎనిమిది రూపాయలు మరియు నలభై రెండు పైసలు మాత్రమే)** పూర్తి చెల్లింపు తేదీ వరకు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం వడ్డీ & ఇతర ఛార్జీలు. పై సౌకర్యాల యొక్క బకాయి సెక్యూర్డ్ అయ్యేందుకు మీరు దిగువ **ఆస్తులు/అసెట్స్ తనఖా ద్వారా సెక్యూరిటీ ఇంటరెస్ట్** ఏర్పరచినారు.

పార్టు-I: (హైపోథికేట్ చేయబడిన చరాస్తి): డాక్యుమెంట్లలో (షెడ్యూల్B) పేర్కొన్న కంపెనీ యొక్క స్టాక్‌లు, ట్రేడ్‌లోని స్టాక్‌లు, స్వీకరించదగినవి, వినియోగ దుకాణాలు మరియు విడిభాగాలు మరియు ప్రస్తుత ఆస్తులు మొత్తం మరియు హైపోథెకేటెడ్ మూవబుల్ ప్లాంట్ మరియు యంత్రాలు మొదలైన వాటితో సహా ప్రస్తుత ఆస్తులన్నింటినీ హైపోథెకేటెడ్ ఆస్తులను పేర్కొనబడింది.

పార్టు-II: (స్థిరాస్తుల సమానమైన తనఖా): విజయవాడ, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రీ, గొల్లపూడి గ్రామం & గ్రామ పంచాయతీ ఏరియా, సిహెచ్. ఉమ్మయ్య వీధి, అసెస్‌మెంట్ నెం. 1730, ఆర్.యస్.నెం. 586/1 సబ్ డివిజన్ తర్వాత ఆర్.యస్.నెం. 586/1B, ప్లాట్ నెం. 20, డి.నెం. 15-65 లో 200 చ॥గ॥ లేదా 167.23 చ॥మీ॥ల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ స్థలం నందు గ్రౌండ్ మరియు రెండు పై అంతస్తులు, స్టిల్ట్ 3612.51 చ॥అ॥ల తో బిల్డింగ్ శ్రీ తొర్లపాటి వెంకటేశ్వరరావు & శ్రీమతి తొర్లపాటి మల్లీశ్వరి పేరున కలదు.
(డాక్యుమెంట్ నెం.7606/2014, తేది. 26.11.2014 ప్రకారం). **ఆస్తి హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.10 ఆస్తి, **దక్షిణం:** రోడ్డు, **పడమర:** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:** యోగేష్ చంద్రశర్మ, జి.పూర్ణిమ యొక్క ఆస్తి.
కాపీ ఫార్వార్డ్ టూ: శ్రీ వంగేటి ఉపేంద్ర, తండ్రి: కోటేశ్వరరావు, 76-8/7-12, నవరంగి ధల్మిల్ రోడ్డు, భవానీపురం, విజయవాడ, కామకోటినగర్, పిన్-520012. (హామీదారు).

మీరు అమలు చేసిన హామీ పరంగా నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించవలసిందిగా మిమ్మల్ని కోరడమైనది.

మేము మీకు SARFAESI చట్టం 2002 ప్రకారం ఈ నోటీసు జారీచేయుచూ మిమ్ములను బకాయి మొత్తము **రూ. 28,33,028.42 (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల ముప్పై మూడు వేల ఇరవై ఎనిమిది రూపాయలు మరియు నలభై రెండు పైసలు మాత్రమే)** కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం వడ్డీ & ఇతర ఛార్జీలు పూర్తి చెల్లింపు తేదీ వరకు లెక్కించి ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలెనని కోరుచున్నాము.

అట్లు చేయక విఫలమైనచో చట్టబద్ధంగా బ్యాంకుకు గల ఇతర అధికారములు ఉపయోగించుటతో పాటు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (SARFAESI) లో సెక్షన్ సెక్షన్ 13(4) లోని ఏదైనా లేదా అన్ని హక్కులు ఉపయోగించుటకు బ్యాంకు వారు నిర్ణయించినారు.సెక్యూర్డు బకాయి చెల్లించనట్లయితే బ్యాంకువారు చర్యలు తీసుకొనుటకు నిర్ణయించిన ఆస్తులు వివరములు పైన తెలుపబడినవి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

దయచేసి గమనించవలసినది ఏమనగా సెక్షన్ 13(13) లోని నియమాల ప్రకారం మీరు నోటీసు స్వీకరించిన తదుపరి పై సెక్యూర్డు ఆస్తులను అమ్మకం, లీజు లేదా ఇతరములు గా బదిలీచేయరాదు. అట్లు చేయుటకు బ్యాంకు అనుమతి తప్పనిసరి, దీనికి వ్యతిరేకంగా వ్యవహరించినచో సదరు చట్ట ప్రకారం స్టాట్యూటరీ ఇంజక్షన్ / రిస్ట్రేయింట్ ఉపయోగించబడును. ఏదైనా కారణంగా సెక్యూర్డు ఆస్తులను సాధారణ వ్యాపారం కాక వేరే విధంగా అమ్మిన లీజుకి ఇచ్చిన దానివల్ల పొందిన సొమ్మును లేదా ఆదాయాలను బ్యాంకుకు డిపాజిట్/చెల్లింపులు చేయవలెను. అట్లు రాబట్టే సొమ్ములను ప్రత్యేకంగా ఖాతా నిర్వహించవలెను.

* మాకు ఇతర సెక్యూర్డు ఆస్తులపైకూడా చర్య తీసికొను హక్కు కలదు. * దయచేసి ఈ నోటీసులోని డిమాండ్ ప్రకారం అనుసరించి మీకు ఇబ్బందిలేకుండా చూసుకోవలెను. ఒకవేళ మీరు దీనికి వ్యతిరేకంగా వ్యవహరించినచో, తగిన చర్యలు తీసికొని మీ వద్ద నుండి బకాయి మొత్తం ఖర్చులు అయిన ఛార్జీలు కలిపి అన్నీ రాబట్టుకొనబడును. దీనికి మీరు బాధ్యులు. * ఈ నోటీసును ఎటువంటి పక్షపాతం లేకుండా, బ్యాంకు వారు డిఆర్‌టి/కోర్టు వారి ఎదుట చట్టబద్ధంగా చర్యలు తీసుకొనుటకు గల హక్కులకు భంగం లేకుండాను జారీచేయబడినది. * డిఆర్‌టి/కోర్టులో పెండింగ్‌లో ఉన్న దావా/వ్యాజ్యంపై బ్యాంక్ హక్కులకు ఎటువంటి భంగం కలుగకుండా ఈ నోటీసును ఎటువంటి పక్షపాతం లేకుండా జారీచేయబడినది.

తేదీ: 23.06.2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

Chola
Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: "చోళా క్రెస్ట్", సి54 మరియు 55, సూపర్ బి-4, తిరు వికా ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
బ్రాంచ్ ఆఫీసు: డి.నెం.59-14-2ఎ, 1వ అంతస్తు, శాంతి ప్లాజా, గాయత్రి నగర్, విజయవాడ-520008.
సంప్రదించాల్సిన నెం.: శ్రీ. చైతన్య కుమార్ పగడాల, శ్రీ.మహమ్మద్ రహీస్- ఫోన్ నెం.8124000030 / 6374845616.

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) నియమంతో చదవగల సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన. ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి సాధారణంగా మరియు ప్రత్యేకంగా రుణగ్రహీతకు/సహ-రుణగ్రహీతకు/ తనఖాదారులకు తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ దిగువ పేర్కొన్న తనఖాపెట్టబడిన స్థిరాస్తులను **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి **లాంఛనప్రాయంగా** స్వాధీనంలోకి తీసుకున్నారు. అవి ఇకమీదట **చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**గా పేర్కొనబడను. సెక్యూర్డ్ ఆస్తులను **"ఎక్కడ ఎలా ఉందో అక్కడ అలాగే" మరియు"ఏదైతే ఎలా ఉందో అలాగే"** ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా విక్రయించబడును. ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా బహిరంగ ఇ-వేలాన్ని వెబ్‌సైట్: http://bankauctions.in ద్వారా నిర్వహించబడును.

క్ర. సం	ఖాతా నెంబరు మరియు రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, తనఖాదారుల పేర్లు	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం మరియు తేది	ఆస్తి/ ఆస్తులకు సంబంధించిన వివరణ	రిజర్వు ధర / ధరావత్తు డిపాజిట్ మొత్తం / బిడ్ పెంపుదల మొత్తం
1	Loan Account No. HE01RAO00000048261 1) నరేంద్రరెడ్డి బొమ్మిరెడ్డి, 2) అరుణ బొమ్మిరెడ్డి, 3) సౌజన్య బొమ్మిరెడ్డి, 4) సత్యనారాయణ రెడ్డి బొమ్మిరెడ్డి, అందరి నివాసం: 5-120/ఏ, ఏల్చూరు, సంతమాగులూరు, ప్రకాశం-523303. 5) బొమ్మిరెడ్డి ఫ్యూయెల్స్, 85/1, గుర్జిపలి గ్రామం, సంతమాగులూరు, ప్రకాశం-523327.	07-02-2025 & Rs. 40,35,882/- as on 07-02-2025	ఆస్తి శ్రీ.నరేంద్ర రెడ్డి (దరఖాస్తుదారుడు)& శ్రీ సత్యనారాయణ రెడ్డి (సహ-దరఖాస్తుదారు)కు చెందినది: నరసరావుపేట ఆర్.డ్ని.నరసరావుపేట ఉపజిల్లా, ఏల్చూరు గ్రామపంచాయతీ, సంతమా గుళ్లూరు మండల పరిషత్, ఏల్చూరు గ్రామం, సర్వే నెం.102, డోర్ నెం.5-120/ఏ, అసెస్‌మెంట్ నెం.166 కలిగిన విస్తీర్ణం 336-11 చదరపు గజాల ఆర్‌సిసి ధాబాగల స్థలం మరియు బిల్డింగ్ మొత్తం భాగం, అన్ని సులభ హక్కులతో. **సరిహద్దులు: ఉత్తరం:** ఈ ఆస్తి యొక్క వెన్నపూస రాంబాబు గోడ 55 అ.లు, **తూర్పు:** లచ్చబోయిన కొండలు ఇంటి గోడ-55అ.లు, **దక్షిణం:** తిరుమలశెట్టి శ్రీనివాసరావు ఆస్తి గోడ-55 అ.లు, **పడమర:** పంచాయితీ బజార్-55 అ.లు (లాంఛనప్రాయ స్వాధీనతా)	Rs.54,00,000/- / Rs.5,40,000/- / Rs.1,00,000/-

ఇ-వేలం తేది మరియు సమయం: 08-08-2025 ఉ.11.00గం.ల నుండి మ.1.00గం.ల వరకు (3 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు సమర్పణకు చివరి తేది: 07-08-2025 (సా.5.30గం.ల వరకు) తనిఖీచేయు తేది: 04-08-2025 మరియు 05-08-2025 (ఉ.11.00గం.ల నుండి మ.1.00గం.ల వరకు)

1) ఔత్సాహిక పాల్గొనదారులు/ బిడ్డరుదారులను వెబ్‌సైట్: https://bankauctions.in/ & https://cholamandalam.com/news/auction-notices ను సందర్శించాలని సలహా ఇవ్వడమైనది. ఇ-వేలానికి సంబంధించిన వివరాలు, సహాయం, విధానం మరియు ఆన్‌లైన్ ట్రైనింగ్‌కు ఔత్సాహిక బిడ్డరుదారులు వీరిని సంప్రదించవచ్చు: **శ్రీ.ముహమ్మద్ రహీస్-8124000030 / 6374845616, మెసర్స్4 క్లోజర్: రేఖా, ఫోన్ నెం.8142000062, ఇ-మెయిల్:** CholaAuctionLAP@chola.murugappa.com లో సంప్రదించాలి.
2) ఇ-వేలంలో పాల్గొనే క్రమానికి నియమ నిబంధనల తదుపరి వివరాలకు దయచేసి వెబ్‌సైట్‌ను దర్శించండి: https://bankauctions.in/ & https://cholamandalam.com/news/auction-notices
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002లోని రూల్ 8(6)ప్రకారం చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు ప్రకటనగా కూడా దీనిని పరిగణించడును.

తేదీ: 03-07-2025, ప్రదేశం: నరసరావుపేట సం/- అధీకృత అధికారి, చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

‘కరేడు’

భూసేకరణ దుర్మార్గం

- కిసాన్ కాంగ్రెస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం, కరేడు ప్రాంతంలో సోలార్ పవర్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం 8,350 ఎకరాల పంట భూములివ్వడం దుర్మార్గమని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు పేర్కొన్నారు. ఇండోసోలార్ సంస్థకు సోలార్ ప్లాంట్ కోసం రైతుల భూములు తీసుకోవడాన్ని బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇటువంటి ప్రాజెక్టులు పంటలు పండని భూముల్లో పెట్టాలి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం మామిడి తోటలున్న భూములు కేటాయించడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపుకు నిదర్శనమన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు.

జగన్ భద్రతపై విచారణ

ప్రజాశక్తి-అమరావతి

మాజీ సిఎం వైఎస్ జగన్‌కు జడ్‌ప్లస్ భద్రత ఉండని, ఇలాంటి ప్రముఖ వ్యక్తులకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర విఫలమవుతుందంటూ వైసిపి నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. వైఎస్ జగన్ నెల్లూరు పర్యటనకు ఈ నెల 3వ తేదీ (గురువారం) వర్యటనకు వస్తున్న సందర్భంగా తాత్కాలిక హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతినిచ్చేలా పోలీసులను ఆదేశించాలని వైసిపి నేతలు లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ ఎన్ హరినాథ్ బుధవారం విచారించారు.

దీనిపై హైకోర్టు, వైఎస్ జగన్‌కు కల్పించనున్న భద్రతకు సంబంధించిన వివరాలు అందజేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది.

రైల్వే లైన్ సర్వే పనుల నిలిపివేత ఉత్తర్వులు రద్దు

కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ అలైన్మెంట్ సర్వే నిలిపివేయాలంటూ గతంలో జారీ చేసిన స్టే ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. అలైన్మెంట్ కోసం చేసే సర్వే విషయంలో పోలీసులను ముందుకు తీసుకెళ్లాలని రైల్వేను ఆదేశించింది. ట్రాక్ రీ అలైన్మెంట్ ద్వారా ఎవరైనా రాజకీయ నాయకులు, బడా వ్యక్తులు లబ్ధిపొందుతున్నారో లేదో చెప్పాలని అధికారులను హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఇప్పటి వరకు స్టే కారణంగా పనులు ఆగిపోయాయని పిటిషనర్ వాదించారు.

నోటీసు ఇవ్వాకే విచారణ

మాజీ సిఎం వైఎస్ జగన్, గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలం, రెంటపాళ్ల పర్యటన సమయంలో ట్రాఫిక్‌కు సమస్యలు సృష్టించారంటూ రెంటపాళ్ల వీఆర్ఓ బూసిరాజు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు కేసును డివిజన్ బెంచ్ విచారించింది. కేసును కొట్టివేయాలంటూ విడదల రజిని, దేవినేని అవినాష్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు విచారించింది. ఇదే ఘటనలో ఇతర నిందితులకు బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులిస్తామని ప్రభుత్వం చెప్పిందని పిటిషనర్ల వాదన. పిటిషనర్ల విషయంలో పోలీసులు నోటీసు ఇచ్చాకే విచారణకు ఆదేశించాలని హైకోర్టు పేర్కొంది.

చెవిరెడ్డికి లభించని ఊరట

మద్యం కేసులో వైసిపి నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అరెస్ట్ నుండి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ కేసులో తీవ్ర ఆరోపణలు ఉన్నాయని చెప్పింది. ఈ నేపథ్యంలో రక్షణ కల్పించలేమని వెల్లడించింది. తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని వాదనను సంబంధిత కోర్టును ఆశ్రయించాలని జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు దశల్లో మలివిడత

అమరావతి భూ సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

- తొలిదశలో 32 వేల ఎకరాలు
- ఆమోదించిన అథారిటీ
- త్వరలో నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణంలో మలివిడత భూ సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. మలివిడత పూలింగును రెండు దశల్లో చేపట్టాలని నిర్ణయించారు. తొలిదశలో 32 వేల ఎకరాలు, రెండోదశలో అచ్చంగా విమానాశ్రయ అభివృద్ధి కోసం పదివేల నుండి 12 వేల ఎకరాలు మొత్తంగా 44 వేల ఎకరాల వరకూ సమీకరించనున్నట్లు తెలిసింది. మంగళవారం విడుదల చేసిన రూల్స్‌లోనూ అమరావతి విమానాశ్రయానికి భూములిచ్చే రైతులకు ఒకేవోట భూములు ఇస్తామని ప్రత్యేక నిబంధన చేర్చారు. విమానాశ్రయానికి ఇచ్చే భూములు రెండోదశలో సమీకరణ కింద తీసుకొన్నారు. విమానాశ్రయం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే అవకాశం ఉండటంతో అక్కడ రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలనే నిర్ణయించినట్లు సమాచారం. ఇదేవిధంగా దేవపర్ర వాటాను ఇవ్వాలనినవి ఒకవోట, రైతులకు ఒకవోట జరిగిన అథారిటీ సమావేశంలో భూ సమీకరణపై జరిగిన చర్చలో తొలిదశలో మూడు మండలాల పరిధిలో 32 వేల ఎకరాలు తీసుకునేందుకు ఆమోదం తెలిపారు. దీనిపై ఈ వారంలోనే జిల్లా అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. తరువాత గ్రామాల వారీ నోటిఫికేషన్ ఇచ్చి సభలు నిర్వహించనున్నారు. తొలిదశలో అమరావతి మండల పరిధిలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడి గ్రామాలు ఉన్నాయి. తుళ్లూరు మండల పరిధిలోని హరిశ్చంద్రాపురం, వడ్డమాను, పెదపరిమి గ్రామాలను ఖరారు చేశారు. తాడికొండ మండలంలో ఏ గ్రామాన్ని తీసుకోవాలనేది ఇంకా ఖరారు కాన్నట్లు తెలిసింది. రెండోదశలో భూములు తీసుకునేందుకు పెదకూరపాడు మండలంలోని రెండు గ్రామాలు, తాడికొండ మండల పరిధిలోని రెండు గ్రామాలను ఎంపిక చేశారు. అవసరాన్ని బట్టి గ్రామాల సంఖ్యను పెంచే అవకాశమూ ఉంది. ఇప్పటికే పెదకూరపాడు ఎమ్మెల్యే ఎంపిరిది గ్రామల్లో సభలు పూర్తి చేశారు. పాత అమరావతి గ్రామం పులిశంకర తీసుకోవాలా వద్దా అనే అంశంపై కొంత తర్జన భర్జన పడుతున్నారు. ఈ గ్రామంలో ఎక్కువశాతం లేఅవుట్లు వేసి ఉండటంతో ప్రభుత్వానికి భూమి ఎంత మిగులుతుందనే అంశంపై లెక్కలు ఖరారు కాకపోవడంతో అమరావతి గ్రామాన్ని తీసుకోవాలా వద్దా అనే అంశంపై స్పష్టత రాలేదని సమాచారం. దీనిపై ఒకటిరెండు రోజుల్లో జరిగే సమావేశంలో స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిసింది.

విశాఖ నుంచి బయలుదేరిన ఎంవి ఎంప్రెస్ నౌక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

చెన్నై - పుదుచ్చేరి - విశాఖపట్నం మధ్య తిరిగే విలాసవంతమైన క్రూయిజ్ లైనర్ ఎంవి.ఎంప్రెస్ నౌక బుధవారం ఉదయం 1200 మంది పర్యాటకులతో విశాఖపట్నం చేరుకుంది. తిరుగు ప్రయాణంలో బుధవారం సాయంత్రం విశాఖ నుంచి మరో 600 మంది పర్యాటకులను కలుపుకొని బయలుదేరింది. ఈ నౌక గురువారం ఉదయం పుదుచ్చేరి చేరుకొని మరలా సాయంత్రం పుదుచ్చేరి నుండి బయలుదేరి మరుసటి రోజు శుక్రవారం ఉదయం చెన్నై చేరుకుంటుంది. అదేవిధంగా తిరుగు దశలో శుక్రవారం రాత్రి చెన్నై నుంచి బయలుదేరి శనివారం సాయంత్రానికి విశాఖపట్నం చేరుకుంటుంది

చెన్నై - పుదుచ్చేరి - విశాఖపట్నం మధ్య జులై నెలలో రెండుసార్లు, ఆగస్టు నెలలో ఒకసారి పర్యటించేందుకు ఒప్పందం కుదిరింది, అక్టోబర్ అనంతరం తరుచూ విశాఖపట్నం వచ్చేలా ఆ సంస్థతో చర్చలు జరుపుతున్నామని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు తెలిపారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, జిల్లా పాలనా యంత్రాంగం సంయుక్తంగా గ్రాండ్ ఫేర్ వెల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. వర్చువల్‌గా క్రూయిజ్ షిప్పింగ్ కేంద్ర పోర్ట్సు నౌకా జలరవాణా శాఖమంత్రి శర్బానంద సోనోవాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యాటక అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో విశాఖపట్నం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కేంద్ర పోర్టులు నౌకా జలరవాణా శాఖ సహాయ మంత్రి శంతను ఠాకూర్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా క్రూయిజ్ టూరిజాన్ని అభివృద్ధి పరచడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రూయిజ్ టూరిజం చరిత్రలో ఒక చారిత్రక ఘట్టమని కేంద్ర పోర్టు నౌకా జలరవాణా శాఖ కార్యదర్శి టికె.రామచంద్రన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న రాష్ట్ర పర్యటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక సర్క్యూట్లు, హబ్‌లను అభివృద్ధి చేయడంపై చర్చలు చేపట్టిందని వెల్లడించారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ... ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలదని, మారిటైం ఇండియా విజన్‌కు అనుగుణంగా ఉందని తెలియజేశారు. విశాఖ పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ... క్రూయిజ్ టూరిజం అభివృద్ధి లక్ష్యాన్ని గుర్తుచేస్తూ, ముఖ్యమంత్రి ఆలోచన ప్రకారం ప్రతి 50 కిలోమీటర్లకు ఒక సముద్ర సంబంధిత కేంద్రంగా, షిప్ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్, కోస్టల్ లేదా క్రూయిజ్ టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం 5,000 మంది విద్యార్థులకు క్రూయిజ్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పించి, వారిని ఉపాధి అవకాశాలకు సిద్ధం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా ఎంవి.ఎంప్రెస్ షిప్‌లో ప్రయాణించే కుటుంబాలకు బోర్డింగ్ పాస్‌లు అందజేశారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం ఎంపి ఎం.శ్రీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం హరేంధిర ప్రసాద్ హాజరయ్యారు.

మెప్మాల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు

- ఉత్తర్వులు జారీ
- మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం పోరాటం ఫలించింది : ధనలక్ష్మి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెప్మా కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మెప్మా మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని ఎపి మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ గత నాలుగేళ్లుగా చేస్తున్న పోరాటం ఇప్పటికి ఫలించింది. ఇది ఆర్‌పిల యూనియన్ పోరాటాల ఫలితమేనని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి పేర్కొన్నారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు ఆర్డర్స్‌లో పెడుతూ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల మెప్మా ఆర్‌పి ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

మెడమీద కత్తిలా వేలాడుతున్న మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను అడ్డుపెట్టుకుని అనేకమంది ఆర్‌పిలను రాజకీయ వేధింపులకు గురి చేశారని, చాలా మందిని తొలగించారని యూనియన్ తెలిపింది. ప్రభుత్వం ఆర్‌పిల ఉపాధిని నిలబెట్టే విధంగా తీసుకున్న చర్యలకు యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న 28 వేలమంది వివోఎలకు కూడా ఇదే విధంగా మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న నీటి ప్రవాహం

- 875 అడుగులకు చేరిన నీటిమట్టం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం కొనసాగుతుంది. జూరాల నుంచి బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 31,380 క్యూసెక్కులు, గేట్ల ద్వారా 32,650 క్యూసెక్కులు మొత్తం 64,030 క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతోంది. జలాశయ గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 875 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిఎంసిలు కాగా ప్రస్తుతం 166.3148 టిఎంసిలు ఉంది.

తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో గడిచిన 24 గంటలలో 35,639 క్యూసెక్కుల నీటిని వినియోగించి 16.892 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 15,836 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 8.722 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి ద్వారా దిగువ నాగార్జునసాగర్‌కు 59, 475 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. నగరంలోని రాజ్ విహార్, బళ్లారి చౌరస్తా, కృష్ణానగర్, వీకర్ సెక్షన్ కాలనీ, సి క్యాంప్, సంధ్యా బెల్ పోస్ట్ తదితర ప్రాంతాల్లో రహదారిపై వర్షపు నీరు ప్రవహించింది.

మైక్రోసాఫ్ట్‌లో 9వేల మంది ఉద్యోగుల తొలగింపు

- లాభాల్లో ఉన్నా సిబ్బందిపై వేటు
- ఇదే బాటలో మరికొన్ని కంపెనీలు

వాషింగ్టన్: మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్త ఉద్యోగుల్లో 9,000 మందిని తొలగించింది. ఈ మేరకు బుధవారం నాడు ప్రకటన విడుదల చేసింది. 2026వ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఈ నిర్ణయం తీసుకుంది. గత త్రైమాసికంలో 26 బిలియన్ల లాభం సాధించినప్పటికీ పెద్ద సంఖ్యలో ఉద్యోగాలను తొలగించింది. కంపెనీ నిర్వహణ స్థాయిని తగ్గించి, కార్యకలాపాలను సులభతరం చేయాలనే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొంది. మైక్రోసాఫ్ట్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 228,000 మంది ఉద్యోగులున్నారు. ఇందులో 3.9% ఉద్యోగులను బుధవారం తొలగించింది. ఈ ఏడాదిలో మొత్తం 15,000 మంది ఉద్యోగాలు కోల్పోయారని, జూన్‌లో అమెరికా ప్రైవేట్ సెక్టార్‌లో 33,000 ఉద్యోగాలు తగ్గాయని ఏడిపి (ఆటోమేటిక్ డేటా ప్రోసెసింగ్) సంస్థ నివేదించింది.

లాభాలు ఉన్నా ఎందుకు తొలగింపు ?

మైక్రోసాఫ్ట్ లాభాల్లోనే పనిచేస్తుంది. మార్చి త్రైమాసికంలో కంపెనీ 70 బిలియన్ డాలర్ల ఆదాయంలో 26 బిలియన్ డాలర్ల నికర లాభం సాధించింది. ఈ లెక్కలు వాల్‌స్ట్రీట్ అంచనాలను మించిపోయాయి. అయినప్పటికీ కంపెనీ తన ఉద్యోగులను తగ్గించుకోవాలని భావిస్తోంది. తన కార్యకలాపాలను సులభతరం చేయడానికి, నిర్వహణ ఖర్చులను తగ్గించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ప్రతినిధి ఇమెయిల్ ద్వారా తెలిపారు. మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో విజయం సాధించడానికి, బృందాలను సిద్ధం చేయడానికి ఈ మార్పులు అవసరమని ఏఐ, క్లౌడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో 80 బిలియన్ల పెట్టుబడులు పెడుతూ, కంపెనీ దీర్ఘకాలిక అవిష్కరణలపై దృష్టి సారిస్తోందని తెలిపింది. ఈ ప్రకటనతో స్టాక్‌మార్కెట్‌లో మైక్రోసాఫ్ట్ షేర్లు బుధవారం ఉదయం 0.6% తగ్గిపోయాయి. మరోవైపు ప్రముఖ ఐటీ దిగ్గజ కంపెనీలు అలోడేస్క్, చెగ్గ్, క్రౌడ్‌స్ట్రైక్ వంటి కంపెనీలు ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమవుతున్నాయని ఐటీ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

అంబులెన్సులో ఏదో జరిగింది

- జగన్‌ను కలిసిన అనంతరం సింగయ్య భార్య లూర్దుమేరీ
- తప్పుడు కథనాలు రాయవద్దు, జయవర్ధనరెడ్డి తండ్రి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సింగయ్య ప్రమాదం జరిగిన తరువాత చిన్న చిన్న దెబ్బలతో బాగానే ఉన్నారని, అంబులెన్సులోనే ఏదో జరిగిందని జగన్ పర్యటనలో ప్రమాదానికి గురై మరణించిన చీలి సింగయ్య భార్య లూర్దుమేరీ తెలిపారు. బుధవారం ఉదయం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సింగయ్య కుటుంబ సభ్యులు జగన్‌ను కలిశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. జగన్ వస్తున్నారని తెలిసి అందరం వెళ్లామని, కొద్దిసేపటికి తన భర్తకు యాక్సిడెంట్ జరిగిందని ఫోన్ ద్వారా తెలిసిందని తెలిపారు. అప్పటికి ఆయన బాగానే ఉన్నారని, అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలోనే ఏదో జరిగిందనే అనుమానం ఉందని పేర్కొన్నారు. దీనిపై నిజాలు తేల్చాలని కోరారు. కొద్దిమంది వ్యక్తులు తమ ఇంటికొచ్చి ప్రలోభపెట్టాలని చూశారన్నారు. ఆటోలో తీసుకెళ్తామని వైసిపి నాయకులు చెబితే అంబులెన్స్ వచ్చిందంటూ పోలీసులు ఆపారని తెలిపారు. అందువల్లే అనుమానాలు వచ్చాయని వివరించారు. సింగయ్య మృతిపై వైసిపి రూ.10 లక్షల ఆర్థికసాయం కూడా చేసిందన్నారు.

మా కుమారుడి మరణంపై తప్పుడు కథనాలు వద్దు జయవర్ధనరెడ్డి తండ్రి భాస్కరరెడ్డి

జగన్‌ను చూడటానికి వెళ్లిన తమ కుమారుడు ఉద్వేగంతో గుండెపోటుకు గురై మరణించారని, తప్పుడు కథనాలు రాయవద్దని జగన్ పర్యటనలో మృతిచెందిన జయవర్ధనరెడ్డి తండ్రి భాస్కరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కూడా కుటుంబ సభ్యులతో జగన్‌ను కలిశారు. తన కుమారుడి మరణానికి ఎవరూ బాధ్యులు కారని పేర్కొన్నారు. దీనిపై జగన్ తమకు అండగా నిలిచారని వివరించారు. భార్గవ్‌రెడ్డి కూడా సహకరించారని తెలిపారు.

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM

Ground & First Floors, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam - 530020

Government of India

O.A. 425/2025

Between:

Bank of Baroda, Eluru Road Branch, Vijayawada, NTR District, represented by its Power of Attorney holder...Applicant Bank

And:

Mrs. Dande Venkata Rajeswari and others...Defendants

Defendant 1: Mrs. Dande Venkata Rajeswari, W/o. D. Veera Swamy, aged 49 years, D.No. 12-457/3/2, By Pass Road, Tadepalli, Guntur District, Andhra Pradesh - 522501. Pan No: AVKPD3252E.

Defendant 2: Mr. Dande Veera Swamy, S/o D. Subba Rao, aged 56 years, D.No. 12-457/3/2, By Pass Road, Tadepalli, Guntur District, Andhra Pradesh - 522501. Pan No: AEBPD0734M.

SUBSTITUTED SERVICE OF SUMMONS TO DEFENDANTS 1 TO 2 BY WAY OF PAPER PUBLICATION

WHEREAS the Applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act 1993 against you for the recovery of sum together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal at 10.30 or at such time immediately thereafter according to the convenience of Tribunal on 17.07.2025 to answer the claim.

If you intend to file any documents, you may file the same with a list along with the written statement.

You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader / Advocate duly instructed.

Take notice that, in default of your appearance on the day mentioned herein before the proceeding will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this 4th day of July 2025

Signature of the Officer
Authorized to issue summons

UNICO HOUSING FINANCE

విజయవాడ బ్రాంచి 40-9/1-24,11 9/1 బి, 3వ, రింగ్ రోడ్, మొదటి అంతస్తు, బెంజిసర్కిల్, విజయవాడ-520008.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (2002 యొక్క 54) ప్రకారం "యూనికో హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్" యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) తో చదువగల రూల్ 3 ప్రకారం సంక్రమించిన అధికారాలతో ఋణగ్రహీత, తనఖాదారు, సహ-ఋణగ్రహీతలు: 1. శ్రీ/శ్రీమతి. వేముపల్లి శ్రీనివాసరావు, తండ్రి: ప్రసాద్, 5/23, నందివాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521321. 2. శ్రీ/శ్రీమతి వేముపల్లి సుశీల, భర్త: శ్రీనివాసరావు, 5/23, నందివాడ, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521321. వారి లోన్ అకౌంట్ నెం. 995117184901 ద్వారా హౌసింగ్ లోన్ మంజూరు చేయబడినందుకు బకాయి ది.23.04.2025 నాటికి మొత్తం రూ. 20,53,956/- (అక్షరాల ఇరవై లక్షల యాభై మూడు వేల తొమ్మిది వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే) అదనంగా, కాంట్రాక్టు రేటు ప్రకారం వడ్డీతో పాటు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర అనుబంధ ఖర్చులు మొదలైన వాటితో కలిపి నోటీసు అందిన నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసిందిగా తేది. 23-04-2025న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.

ఋణగ్రహీత, తనఖాదారు మరియు సహ-ఋణగ్రహీతలు బకాయి సొమ్మును నిర్దిష్ట కాలంలో పైన తెలిపిన మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్షన్ 13(4)కు అనుసంధానమైన సదరు రూల్స్ నందలి SARFAESI యాక్ట్ యొక్క చదువబడిన రూల్ 8 ప్రకారము తేది. 02-07-2025న దిగువ పేర్కొన్న ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా ప్రత్యేకంగా ఋణగ్రహీత, తనఖాదారు, సహ-ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తిని పేర్కొనే ఎవరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీ జరిపినా "యూనికో హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్" వారికి లోన్ అకౌంట్ నెం. 995117184901 ద్వారా హౌసింగ్ లోన్ కు బకాయి ది.23.04.2025 నాటికి మొత్తం రూ. 20,53,956/- (అక్షరాల ఇరవై లక్షల యాభై మూడు వేల తొమ్మిది వందల యాభై ఆరు రూపాయలు మాత్రమే) అదనంగా, కాంట్రాక్టు రేటు ప్రకారం వడ్డీతో పాటు అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర అనుబంధ ఖర్చులు మొదలైన వాటితో కలిపి చెల్లించవలసి ఉంటుందని ఇందుమూలముగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన ఆస్తిని విడిపించుకోవడానికి అందుబాటులోవున్న గడువులో సదరు చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం కలిగియున్నారని తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, నందివాడ మండలం, నందివాడ గ్రామంలో గల క్రొత్త ఆర్.ఎస్.నెం. 471/3, పాత ఆర్.ఎస్.నెం. 470/1ప, డోర్ నెం. 557, డోర్ నెం. 3-188 లో గల 148 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూమి మరియు భవనం. సరిహద్దులు: తూర్పు: మాచర్ల వెంకటరత్నం గారికి చెందిన ఆస్తి, పడమర: దేవర శ్రీనివాసరావు గారికి చెందిన ఆస్తి, ఉత్తరం: ఫ్లట్ పాల్ సుదాకర్ గారికి చెందిన ఆస్తి, దక్షిణం: పంచాయతీ రోడ్.

తేది: 02-07-2025 ప్రదేశము: విజయవాడ

అధీకృత అధికారి M/s యూనికో హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

అజైల్ ఫ్లాట్ ఫాంను వినియోగించాలి

- యాప్‌ను ప్రారంభించిన సందర్భంగా స్పెషల్ సిఎస్ రాజశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అజైల్ (అగ్రికల్చర్ ఇన్‌పుట్ లైసెన్సింగ్ ఇంజిన్) ఫ్లాట్‌ఫాంను సమర్థవంతంగా వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ సూచించారు. సచివాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో అజైల్ యాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటి వ్యవసాయ వనరుల లైసెన్సింగ్ వ్యాపారంలో భాగస్వాములైన వారందరూ దీనిని వినియోగించాలని కోరారు. ఈ యాప్ ఒక అభివృద్ధి చెందిన కేంద్రీకృత డిజిటల్ ఇన్‌పుట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థగా పేర్కొన్నారు. దీనితో పూర్తిగా కాగిత రహితంగా వ్యవసాయశాఖ సేవలు లభ్యమవుతాయన్నారు. వ్యవసాయశాఖ సంచాలకులు ఢిల్లీరావు మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యాప్ పారదర్శకం, ప్రామాణికమైందని తెలిపారు. యాప్‌లో ముఖ్యాంశాలను వివరిస్తూ.. డ్యాష్ బోర్డుతో అధికారులు లైసెన్సింగ్ స్థితిని ప్రత్యక్షంగా గమనించే సౌకర్యం ఉంటుందన్నారు. పాలనాపరమైన పర్యవేక్షణ, పథకాల సమీక్షకు అనుకూలంగా వివరణాత్మక నివేదికలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇన్‌పుట్ పంపిణీపై ప్రత్యక్ష నియామకంతో పాటు తయారీదారులు, డీలర్లు, రిటైలర్లను సమన్వయం చేస్తుందని చెప్పారు. ఇ-గవర్నెన్స్‌లో భాగంగా ఆధార్ ఆధారిత ప్రమాణీకరణ, ఎస్ఎంఎస్, ఇ-మెయిల్ సమాచారం, డిజిలాకర్, పేమెంట్ గేట్‌వేలు, డీలర్ నెట్‌వర్క్‌లు జిఐఎస్ మ్యాపింగ్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎరువుల తయారీకి సంబంధించి తొలి డిజిటల్ లైసెన్స్‌ను శ్రీ ఆద్య ఆగ్రో కెమికల్స్ నిర్వాహకులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ కె శ్రీనివాసులు, రైతు సాధికార సంస్థ విసి విజయ్‌కుమార్, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కె గోపాల్, ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శారద జయలక్ష్మి, వ్యవసాయశాఖ జెడిఎ కృపాదాస్, విజయభారతి, బాలసుబ్రమణ్యం, డిఎడి విజయకుమారి, ఎడిఎ ప్రేమ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతం ఉపాధ్యాయుల బాధ్యత

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ విద్య బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులపై బాధ్యత ఉందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో గిరిజన గ్రామం జెవిం జిల్లాలో ప్రభుత్వ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎం కళ్యాణి కుమారిని "షైనింగ్ టీచర్" పేరుతో ఉండవల్లిలోని తన నివాసంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. పనిచేస్తున్న పాఠశాలలో కళ్యాణి అంకిత భావంతో పనిచేసి పాఠశాల రూపురేఖలు మార్చి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరికీ ఆమె ఆదర్శంగా నిలిచారని తెలిపారు. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఇకపై విద్యార్థుల ఫలితాలపై దృష్టిసారిస్తామని తెలిపారు. ఇకపై ఉత్తమ ఉపాధ్యాయులను కలిసి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఆమె నుంచి లోకేష్ సలహాలు, సూచనలు స్వీకరించారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు అదనంగా మరో టీచర్‌ను కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రికి ఆమె చెప్పారు. 2017లో జెవిం తండా మండల పరిషత్ ఏకోపాధ్యాయ పాఠశాలకు కళ్యాణి బదిలీ అయ్యారు. ఆ సమయంలో విద్యార్థులు 14 మంది మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయులుగా ఆమె సొంత నిధులతో స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. 2020-21లో విద్యార్థుల సంఖ్య 52కు పెంచారు. ఆ పాఠశాలలో విద్యనభ్యసించిన వారిలో 23 మంది విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశం పొందారు, ఒకరికి నవోదయ పాఠశాలలో ప్రవేశం లభించింది.

ముగిసిన డిఎస్సి

92.90శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన డిఎస్సి పరీక్షల ప్రక్రియ ముగిసింది. జూన్ 6వ తేదీ నుంచి మొదలైన పరీక్షలు బుధవారం జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలకు 92.90శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని మెగా డిఎస్సి కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 3,36,307 మంది అభ్యర్థులు అన్ని పోస్టులకు 5,77,694 దరఖాస్తులు చేసుకున్నారని, ఇందులో 5,36,690 దరఖాస్తులకు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్ష అన్ని ప్రాంతాల్లో సజావుగా,శాంతియుత వాతావరణంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తిచేశామని పేర్కొన్నారు.

బుధవారం నిర్వహించిన ఎస్జీటి తెలుగు, మైనర్ మీడియం పోస్టుల పరీక్షకు 19,879 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 19,409 మంది హాజరయ్యారని తెలిపారు. అభ్యర్థులకు సహాయ నిమిత్తం గురువారం నుంచి 8125046997, 7995649286, 7995789286, 9398810958 నెంబర్లను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

'ఇఎల్ఐ'ను ఖండించిన సిఐటియు

న్యూఢిల్లీ : ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల (ఇఎల్ఐ)ను ఆమోదిస్తూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించింది. గతంలో ఉపాధి కల్పన పేరుతో తీసుకువచ్చిన రూ.1.97లక్షల కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం (పిఎల్ఐ), రూ.76వేల కోట్ల మూల ధన వ్యయ ప్రోత్సాహక పథకం (కేపెక్స్ ఇన్సెంటివ్)ల బాటలోనే తాజా పథకాన్ని కూడా తీసుకువచ్చారని విమర్శించింది. తయారీ రంగంలో 14 పరిశ్రమలకు ఉద్దేశించి 2020లో పిఎల్ఐ పథకాన్ని తీసుకువచ్చారని, కానీ తర్వాత దాన్ని 17పరిశ్రమలకు విస్తరించారని, 60లక్షల ఉద్యోగాలను సృష్టించాలన్నది లక్ష్యమని చెప్పారని, కానీ వాస్తవానికి కనీసం 7లక్షల ఉద్యోగాలు కూడా కొత్తగా రాలేదని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటనలో విమర్శించారు.

ఇలాంటి మోసపూరిత పథకాలను తిరస్కరిస్తూ యావత్ కార్మిక వర్గం జులై 9నాటి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపిచ్చింది.

సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు

చండీగఢ్‌లో సిపిఐ జాతీయ మహాసభ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ ఏడాది సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు చండీగఢ్‌లో సిపిఐ 25వ పార్టీ జాతీయ మహాసభ నిర్వహిస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెల్లడించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో డిసెంబర్ 24, 25 తేదీల్లో అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ ప్రతినిధులతో కన్వెన్షన్ జరగనుందని తెలిపారు. సిపిఐ శతవార్షికోత్సవాల ముగింపు సభ జరపనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం నాడిక్కడ ఏపి భవన్‌లో సిపిఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, కూనంనేని సాంబశివరావులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దేశాన్ని కాపాడలంటే బిజెపిని అధికారం నుంచి దూరం చేయాలని అన్నారు. బిజెపికి మద్దతు ఇవ్వడంపై చంద్రబాబు, నితీష్ కుమార్‌లు పునరాలోచించుకోవాలని సూచించారు. రాజ్యాంగంలోని సెక్యులర్, సోషలిస్టు పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ నేతలు, ఉపరాష్ట్రపతి చేసిన వ్యాఖ్యాలను సిపిఐ ఖండిస్తుందని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం గురించి మాట్లాడే నైతిక హక్కు ఆర్ఎస్ఎస్‌కు లేదని అన్నారు. తమ పార్టీ 25వ జాతీయ మహాసభలో దేశంలోని జరుగుతున్న పరిస్థితులను చర్చిస్తామని, భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయాలు చేస్తామని అన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష భీభత్సం

- **51మంది మృతి**

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్‌లో కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో సుమారు 51మంది మరణించారు. మరో 22మంది గల్లంతయ్యారు. జూన్ 20 నుండి జులై 1 వరకు జరిగిన నష్టాలకు సంబంధించిన నివేదికను హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఎస్ఇఒసి) బుధవారం విడుదల చేసింది. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో పౌరులకు, పశువులకు, మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదిక తెలిపింది. వరదలు ముంచెత్తడం, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడ్డం వంటి కారణాలతో ఇప్పటివరకు 51మంది మరణించినట్లు వెల్లడించింది. గల్లంతైన వారి సంఖ్య 22గా ఉందని, మండి జిల్లాలో అత్యధికంగా పది మంది మరణించారని ఎస్ఇఒసి పేర్కొంది. ఈ ఘటనల్లో 103 మంది గాయపడ్డారని నివేదిక వెల్లడించింది. 204 ఇళ్లు దెబ్బతినగా, వాటిలో 22 పూర్తిగా ధ్వంసమయ్యాయని పేర్కొంది. ప్రజా మౌలిక వసతులకు అధిక నష్టం వాటిల్లిందని, ఇది రూ.283.39 కోట్లుగా అంచనా వేసినట్లు నివేదిక తెలిపింది.

బీహార్‌లో బూత్ స్థాయి ఏజెంట్లను పెంచండి : ఇసి

న్యూఢిల్లీ : బీహార్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కోసం బూత్ స్థాయి ఏజెంట్ల (బిఎల్ఎ)ను పెంచాలని ఎన్నికల కమిషన్ (ఇసి) బుధవారం ఆదేశించింది. భవిష్యత్‌లో ఆందోళనలు లేవనెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రణాళిక ప్రకారం సజావుగా కొనసాగుతోందని,జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను పాటిస్తోందని ఇసి పేర్కొంది. కాగా, ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి రాజకీయ పార్టీలతో బుధవారం జరగాల్సిన సమావేశాన్ని ఇసి వాయిదా వేసింది. భారీ కసరత్తులో సుమారు లక్షమంది శిక్షణ పొందిన బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఒ) మరియు 243 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 38 జిల్లా, ఎన్నికల అధికారులు, 9 డివిజన్‌ల కమిషనర్లు మరియు బీహార్ ప్రధాన ఎన్నికల అధికారి సమన్వయంతో లక్షమంది వాలంటీర్లు పాల్గొంటారు.

శ్రామికశక్తికి ఆందోళనకర పరిస్థితులు

- తక్కువ నైపుణ్యస్థాయి ఉద్యోగాల్లో గ్రాడ్యుయేట్లు
- దేశంలో 88 శాతం కంటే ఎక్కువ మందికి ఇవే కష్టాలు
- ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్‌నెస్ నివేదిక

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వ పాలనలో దేశ యువత, కార్మికశక్తి కఠిన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లోని అనేక మంది గ్రాడ్యుయేట్లకు వారి నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు దొరకడం లేదు. 50 శాతం కంటే ఎక్కువ మంది గ్రాడ్యుయేట్లు.. తక్కువ నైపుణ్య స్థాయిల కోసం ఉద్దేశించిన ఉద్యోగాలలో పని చేస్తున్నారు. గ్రాడ్యుయేట్లే కాదు, దేశంలో మొత్తం శ్రామిక శక్తిలో దాదాపు 88 శాతం మందికి ఇదే పరిస్థితి. దేశంలోని 88 శాతం శ్రామికశక్తి తక్కువ సామర్థ్యం గల వృత్తులు, ఉద్యోగాల్లో నిమగ్నమై ఉన్నారని, ఇది ఆందోళనను కలిగించే అంశమని హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజీ అండ్ కాంపిటీటివ్‌నెస్ అనుబంధ సంస్థ అయిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్‌నెస్ నివేదిక పేర్కొన్నది. "భవిష్యత్తు కోసం నైపుణ్యాలు : భారతదేశ శ్రామికశక్తి ప్రకృతి దృశ్యాన్ని మార్చటం" అనే పేరుతో ఈ నివేదిక విడుదలైంది. ఈ నివేదిక కోసం 2017-18 నుంచి 2023-24 వరకు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే డేటాను ఉపయోగించారు.

దేశంలో ప్రాంతీయ అసమానతలు

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. దేశంలో ప్రాంతీయ అసమానతలు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగ వాటాలలో వెనుకబడి ఉన్నాయి. ఇక చండీగఢ్, పుదుచ్చేరి, గోవా, కేరళ వంటి కేంద్రపాలిత ప్రాంతాలు(యూటీలు), రాష్ట్రాలు నైపుణ్యం కలిగినవారిని తగినంతగా ఉపయోగించుకోవటంలో ముందున్నాయి. గ్రాడ్యుయేట్లలో (విద్యా నైపుణ్యస్థాయి 3) 8.25 శాతం మంది మాత్రమే వారి అర్హతలకు సరిపోయే పాత్రల్లో ఉన్నారు. ఇక సగం మందికి పైగా తక్కువ నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను చేస్తున్నారు.

శ్రామికశక్తి, గ్రాడ్యుయేట్ల పరిస్థితి ఇది!

శ్రామికశక్తిలో 88 శాతం మంది తక్కువ నైపుణ్య ఉద్యోగాలైన వీధి విక్రయం, ఇంటి పని, మాన్యువల్ ఆపరేషన్లలో నిమగ్నమై ఉన్నది. ఇక 50 శాతం కంటే ఎక్కువ మంది గ్రాడ్యుయేట్లు గుమాస్తాలు, మెషిన్ ఆపరేటర్లు, సేల్స్ వర్కర్లు (స్కిల్ లెవల్ 2) వంటి పాత్రలలో పని చేస్తున్నారు. 38.23 శాతం మంది గ్రాడ్యుయేట్లు స్కిల్ లెవల్ 4 ఉద్యోగాలలో ఉండగా.. 28.12 శాతం పోస్ట్ గ్రాడ్యుయేట్లు మిడ్-స్కిల్ వృత్తులలో ఉన్నారు. ఇది వారిలో ఉన్న ఉపయోగించని ప్రతిభను సూచిస్తుంది. నైపుణ్యస్థాయిని బట్టి వేతనాల వృద్ధి ఉంటున్నది. నైపుణ్య స్థాయి 1 కార్మికులు కనీసం వేతనాలను పొందుతున్నారు. ఇక నైపుణ్య స్థాయి 2లో ఉన్నవారు వార్షిక వేతన వృద్ధిని 5-6 శాతం చూశారు. నైపుణ్య స్థాయి 3, 4 నిపుణులు వేతనాల్లో 8-12 శాతం వృద్ధిని చూశారు. ఇది ఎక్కువ మంది కార్మికులను అధిక-సామర్థ్య పాత్రలలోకి తరలించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తున్నది. ఢిల్లీ, పుదుచ్చేరి, గోవాలలో మధ్యస్థ, అధిక-నైపుణ్య ఉద్యోగ వాటాలలో స్వల్ప పెరుగుదల కనిపించింది.

దేశంలోని యువత, కార్మిక శక్తి ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించటానికి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని నివేదిక సూచనలు చేసింది. ఇందుకోసం ఒక కార్యాచరణను రూపొందించాలనీ, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని మేధావులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని మోడీ సర్కారు దేశయువతను మోసం చేసి ఇప్పటికీ 11 ఏళ్లు అవుతున్నదని వారు గుర్తు చేస్తున్నారు. యువతకు ఒకవేళ ఉద్యోగాలు దొరికినా.. అవి వారి నైపుణ్యాలు, సామర్థ్యాలకు అనుగుణంగా ఉండటంలేవనీ, ఇందుకు తాజా నివేదిక ప్రత్యక్ష ఉదాహరణ అని వారు చెప్తున్నారు.

ఆకస్మిక మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్‌లతో సంబంధం లేదు : కేంద్రం

న్యూఢిల్లీ : ఆకస్మిక మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్‌లతో ఎటువంటి సంబంధం లేదని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలో ఇటీవల భారీగా సంభవిస్తున్న ఆస్మిక మరణాలపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి), ఎయిమ్స్ అధ్యయనం నిర్వహించాయి. ఈ మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్‌లతో ఎటువంటి సంబంధంలేదని అధ్యయనంలో తేలినట్లు స్పష్టం చేశాయి. ఈ అధ్యయనాల నివేదికలను కేంద్ర ఆరోగ్య శాఖ బుధవారం విడుదల చేసింది. దేశంలోని పలు అనేక ఏజెన్సీల ద్వారా ఆకస్మిక మరణాల విషయాన్ని పరిశోధించామని తెలిపింది.

భారతదేశంలో కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితమైనవి, ప్రభావవంతమైనవని ఐసిఎంఆర్, ఎన్‌సిడిసి క్షు అధ్యయనాలు పేర్కొన్నాయి. అరుదుగా మాత్రమే తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగి ఉన్నాయని ధృవీకరించాయి.

జన్యుశాస్త్రం, జీవనశైలి, ముందుగా ఉన్న ఆరోగ్య పరిస్థితులు, కొవిడ్ -19 అనంతర సమస్యలు సహా అనేక రకాల కారణాల వల్ల ఆకస్మిక గుండె మరణాలు సంభవించవచ్చని పేర్కొంది. ముఖ్యంగా 18-45 సంవత్సరాల మధ్య వయస్సుగల యువకులలో, ఆకస్మిక మరణాల వెనుకగల కారణాలను తెలుసుకునేందుకు ఐసిఎంఆర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ (ఎన్ఐఇ), ఎన్‌సిడిసి కలిసి పనిచేశాయి. కారణం తెలుసుకునేందుకు విభిన్న పరిశోధనర విధానలను ఉపయోగించి రెండు అధ్యయనాలు చేపట్టాయి. గత ఆరోగ్య డేటా ఆధారంగా రెండు ప్రస్తుత ఆరోగ్య వివరాలను దర్యాప్తు చేశాయి. 2023 మే-ఆగస్టు మధ్య 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పలు ఆస్పత్రుల్లో సర్వే చేశాయి. ఆరోగ్యంగా కనిపించినప్పటికీ 2021 అక్టోబర్ నుండి 2023 మార్చి మధ్య ఆకస్మికంగా మరణించిన వారి డేటాను పరిశీలించాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత కొవిడ్ వ్యాక్సిన్‌తో ఆకస్మిక మరణాల ప్రమాదం లేదని స్పష్టంగా చూపాయి. నిశ్చయాత్మక ఆధారాలు లేకుండా ఊహాజనిత వాదనలు, కొవిడ్ సమయంలో లక్షలాది మంది ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషించిన వ్యాక్సిన్లపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొంది.

కాగా, కర్ణాటకలోని హసన్ జిల్లాలోనే గత నెల గుండెపోటుతో 20మందికి పైగా మరణించారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల తెలిపారు. కొవిడ్ 19 వ్యాక్సిన్‌ను త్వరితంగా ఆమోదించడం, ప్రజలకు పంపిణీ చేయడం కూడా మరణాలకు కారణం కావచ్చని ఆయన అన్నారు.

పార్లమెంటు భద్రతా ఉల్లంఘన కేసు

ఇద్దరు నిందితులకు బెయిల్

న్యూఢిల్లీ : భారత పార్లమెంటులో 2023 డిసెంబర్‌లో చోటు చేసుకున్న భద్రతా ఉల్లంఘన కేసులో ఇద్దరు నిందితులకు బెయిల్ లభించింది. నీలం ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, జస్టిస్ హరీశ్ వైద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం ఒక్కొక్కరికి రూ.50 వేల వ్యక్తిగత బాండ్, అంతేమొత్తానికి ఇద్దరు పూచీకత్తుపై వీరికి బెయిల్‌ను మంజూరు చేసింది. ఈ సంఘటనకు సంబంధించి మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వవద్దనీ, సోషల్ మీడియా పోస్టులు చేయొద్దని ధర్మాసనం వారిని ఆదేశించింది. గతంలో ట్రయల్ కోర్టు వారి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. అయితే, దానిని సవాలు చేస్తూ నిందితులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం నుంచి వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. '2001 పార్లమెంటు ఉగ్రదాడి' రోజు 2023, డిసెంబర్‌లో లోక్‌సభలో ఒక పెద్ద భద్రతా ఉల్లంఘన చోటు చేసుకున్నది. నిందితులు సాగర్ శర్మ, డి.మనోరంజన్‌లు జీరో అవర్ సమయంలో పబ్లిక్ గ్యాలరీ నుంచి లోక్‌సభ చాంబర్‌లోకి దూకారు. డబ్బాల నుంచి పసుపు వాయువును విడుదల చేసి, నినాదాలు చేశారు. ఆ తర్వాత కొంత మంది ఎంపీలు వారిని నిరోధించే యత్నం చేశారు.

పూర్తిగా యుద్ధం ముగిస్తేనే కాల్పుల విరమణకు సిద్ధం

- తేల్చి చెప్పిన హమాస్

కైరో : గాజాలో పూర్తి స్థాయిలో యుద్ధాన్ని ముగిస్తామంటేనే కాల్పుల విరమణకు అంగీకరిస్తామని హమాస్ బుధవారం తేల్చి చెప్పింది. గాజాలో 60రోజుల పాటు కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ అంగీకరించిందని, అలాగే పరిస్థితులు మరింత అధ్వాన్నమవకుండా ముందుగానే ఒప్పందాన్ని అంగీకరించాలంటూ మంగళవారం ట్రంప్ కోరారు. త్వరగా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలంటూ ట్రంప్ ఇరు పక్షాలపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ 60రోజుల కాల వ్యవధిలో పూర్తి స్థాయిలో యుద్ధాన్ని ఆపే దిశగా కసరత్తు చేయాలని ట్రంప్ సూచిస్తున్నారు. అయితే ఇందుకు ఇజ్రాయిల్ అంగీకరించడం లేదు. హమాస్ ఓటమే తమ లక్ష్యమని చెబుతోంది. హమాస్ కూడా బుధవారం తన వైఖరిని స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో అసలు ఒప్పందం వుంటుందా లేదా అనే అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి తాము చాలా సీరియస్‌గానే వున్నామని హమాస్ అధికారి తాహెర్ అల్ నునూ చెప్పారు. అయితే ఈ దిశగా చేపట్టే ఏ చర్య అయినా యుద్ధాన్ని పూర్తిగా నిర్మూలించేలా వుండాలని స్పష్టం చేశారు. కైరోలో ఈజిప్ట్,

కతార్ మధ్యవర్తులతో హమాస్ ప్రతినిధి బృందం సమావేశం కానుంది. యుద్ధాన్ని ముగించి, గాజా నుండి ఇజ్రాయిల్ వైదొలగితేనే మిగిలిన 50మంది బందీలను విడుదల చేస్తామని హమాస్ చెప్పింది. హమాస్ తన ఆయుధాలతో సహా లొంగిపోవాలని, నిరాయుధులైన తర్వాత ప్రవాసం వెళ్ళిపోవాలని అప్పుడే యుద్ధం ఆగుతుందని ఇజ్రాయిల్ చెబుతోంది. దీనికి హమాస్ తిరస్కరిస్తోంది. 60రోజుల డీల్ కుదుర్చుకుంటే గాజా నుండి పాక్షికంగా వైదొలగుతామని, మానవతా సాయం కూడా పెరుగుతుందని ఇజ్రాయిల్ అధికారి ఒకరు తెలిపారు.

మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమన్న ట్రంప్ స్పందించని ఇజ్రాయిల్, హమాస్

కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్ పెట్టారు. కాగా ట్రంప్ పోస్ట్‌పై ఇజ్రాయిల్, హమాస్‌లు అధికారికంగా ఇంకా స్పందించలేదు. అమెరికా అధ్యక్షుడిగా తాను బాధ్యతలు చేపట్టడానికి ముందే కాల్పుల విరమణను పాటించడం సహా యుద్ధాన్ని ఆపేసేందుకు ఇజ్రాయిల్ సంసిద్ధత వ్యక్తం చేసిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అయితే అదంత వట్టిదే అని తేలిపోయింది. మరి తాజాగా ప్రకటన చేసిన నేపథ్యంలో పరిణామాలు ఎలా వుంటాయో చూడాల్సి వుంది. కాగా ట్రంప్ వచ్చే సోమవారం శ్వేతసౌధంలో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో సమావేశమయ్యే అవకాశం ఉంది. గాజాపై సాధ్యమైనంత త్వరగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని నెతన్యాహుకు గట్టిగా చెబుతానని ట్రంప్ తన ఫ్లోరిడా పర్యటనలో విలేకరులకు చెప్పారు. ట్రంప్ ప్రకటనపై ఇజ్రాయిల్ అధికారికంగా ఎలాంటి స్పందన తెలియజేయనప్పటికీ అపరిష్కృత అంశాలు అనేకం ఉన్నాయని ఇజ్రాయిల్ అధికారులు గుర్తు చేశారు.

ట్రంప్ బిల్లుకు సెనెట్ ఆమోదం

- ఉపాధ్యక్షుడి ఓటుతో గట్టెక్కిన వైనం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన పన్ను, వ్యయ బిల్లుకు అమెరికా సెనెట్ స్వల్ప మెజారిటీతో ఆమోదం తెలిపింది. సవరణలపై సెనెట్‌లో ఓటింగ్‌కు ముందు విస్తృత చర్చ జరిగింది. బిల్లుకు సెనెట్ ఆమోదం తెలిపినప్పటికీ ప్రతినిధి సభలో పలు సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ బిల్లులో ఆరోగ్య, పౌష్టికాహార కార్యక్రమాలకు అందజేస్తున్న నిధులలో భారీ కోత విధించారు. నాలుగున్నర ట్రిలియన్ డాలర్ల మేర పన్నులు తగ్గించారు. బిల్లుకు ప్రతిపాదించిన సవరణలపై సెనెట్‌లో దాదాపు 48 గంటల పాటు చర్చ జరిగింది. బిల్లుకు అనుకూలంగా, వ్యతిరేకంగా సభ్యులు సమాన సంఖ్యలో ఓటేయడంతో తొలుత 'టై' అయింది. దాంతో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన ఓటుతో బిల్లును గట్టెక్కించారు. బిల్లును ప్రతిపక్ష డెమొక్రాట్లతో పాటు అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు కూడా వ్యతిరేకించారని అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. రిపబ్లికన్ పార్టీకి చెందిన సెనెటర్లు థామ్ తిల్లిస్ (ఉత్తర కరోలినా), సుసాన్ కొల్లిన్స్ (మెయిన్), రాండ్ పాల్ (కెంటుకీ) బిల్లును వ్యతిరేకించడం విశేషం. బిల్లు ఆమోదం పొందితే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తానని బిలియనీర్ ఎలాన్ మస్క్ ప్రకటించిన విషయం తెలిసిందే.

షేక్‌హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

ఢాకా : కోర్టు ధిక్కరణ కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరునెలల జైలు శిక్ష విధించారు. అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసిటి) ఈ ఆరునెలల శిక్ష విధించినట్లు స్థానిక మీడియా బుధవారం వెల్లడించింది.

గతేడాది సోషల్‌మీడియాలో ప్రసారమైన షేక్‌హసీనా ఫోన్ సంభాషణను సమీక్షించిన తర్వాత, జస్టిస్ ఎం.డి.గోలంమోర్టుజా మొజుందర్ నేతృత్వంలోని ట్రిబ్యునల్ -1 (ఐసిటి) కి చెందిన ముగ్గురు సభ్యుల కమిటీ ఈ ఉత్తర్వులను మీడియా నివేదించింది.

నిషేధిత బంగ్లాదేశ్ ఛత్ర లీగ్ (బిసిఎల్) నేత షకీల్ అక్రాంత్ బుల్బుల్‌తో తనపై 227 కేసులు నమోద్యాయని, దీంతో తనకు 227 మందిని చంపడానికి లైసెన్స్ లభించిందని హసీనా ఆరోపించినట్లు లీకైన ఆడియో క్లిప్‌లో ఉంది. ఈ ప్రకటన కోర్టు ధిక్కరణ ప్రత్యక్ష ప్రయత్నంగా పరిగణించినట్లు ట్రిబ్యునల్ పేర్కొంది. షకీల్ అక్రాంత్ బుల్బుల్‌ను కూడా దోషిగా నిర్ధారించిన ఐసిటి రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు మీడియా పేర్కొంది. వారి అరెస్ట్ లేదా వారు లొంగిపోయిన నాటి నుండి శిక్షలు అమల్లోకి వస్తాయని ట్రిబ్యునల్ తెలిపింది.

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తం కావడంతో ప్రధాని పదవికి రాజీనామా చేసి, దేశాన్ని వీడిన ఆమె, ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ప్రధాని పదవికి రాజీనామా చేసిన అనంతరం ఆమెపై పలు కేసులు నమోదయ్యాయి. అయితే ఒక కేసులో శిక్షపడటం ఇదే మొదటిసారి.

పాక్‌లో మరో పోలియో కేసు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో మరో పోలియో కేసు వెలుగుచూసింది. దీంతో ఆ దేశంలో మొత్తం పోలియో కేసుల సంఖ్య 14కి చేరుకుంది. ఖైబర్ ఫఖ్తుంక్వా ప్రావిన్స్‌లోని ఉత్తర వజీరిస్తాన్ జిల్లాలో 19 నెలల బాలుడిలో పోలియోను గుర్తించినట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) కి చెందిన స్థానిక పోలియో నిర్మూలన లాబొరేటరీ తెలిపింది. తాజా కేసుతో ఈ ప్రావిన్స్‌లో మొత్తం కేసుల సంఖ్య 8కి పెరిగింది.

ఈ ఏడాది ప్రారంభంలో సింధ్‌లో నాలుగు, పంజాబ్ మరియు గిల్గిట్ -బాల్టిస్తాన్‌లలో ఒక్కొక్కటి చొప్పున వెలుగుచూశాయి. జూన్ 27న ట్యాంక్ జిల్లాలోని యూనియన్ కౌన్సిల్ అమఖేల్‌కు చెందిన 18 నెలల చిన్నారిలో ఏడవ కేసు నిర్ధారణ అయిన వారంరోజుల్లోనే ఖైబర్ ఫఖ్తుంక్వా ప్రావిన్స్‌లో రెండవ కేసు నమోదైంది.

పోలియో వైరస్‌ను నిర్మూలించడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, భద్రతా సమస్యలు, వ్యాక్సిన్ అందకపోవడం, తప్పుడు సమాచారం వంటి సవాళ్లు పురోగతిని అడ్డుకుంటున్నాయి. ఈ ఏడాది పాకిస్తాన్, ఇప్పటివరకు ఫిబ్రవరి, ఏప్రిల్, మేనెలల్లో దేశవ్యాప్త పోలియో ప్రచారాలను చేపట్టింది.

మెలానియాను దేశం నుంచి పంపించాలి

- ట్రంప్ కుటుంబానికి వ్యతిరేకంగా అమెరికాలో సంతకాల సేకరణ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో సారి అధికారం చేపట్టిన నాటినుంచి వలసదారుల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. అమెరికా పౌరులు అయినప్పటికీ కొందరిని బహిష్కరించాల్సిన అవసరం ఉందంటూ తాజాగా ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆన్‌లైన్ వేదికగా ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ సంతకాల సేకరణ జరుగుతోంది. ముందు మెలానియా (ట్రంప్ సతీమణి)ను బహిష్కరించాలంటూ ఉన్న పిటిషన్‌కు అనుకూలంగా వేలమంది సంతకాలు చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ మూవ్‌మెంట్‌ను పబ్లిక్ పాలసీ అడ్వకసీ గ్రూప్ మూవ్ ఆన్. ఒఆర్‌జి ప్రారంభించింది. "సహజంగా పౌరసత్వం పొంది అమెరికా పౌరులుగా మారిన వారిని ట్రంప్ బహిష్కరించాలని భావిస్తున్నందున.. మెలానియా, ఆమె తల్లిదండ్రులను మొదట

అమెరికా నుంచి బయటకు పంపేయడం సరైందని భావిస్తున్నాం. బారన్ (ట్రంప్ చిన్న కుమారుడు) కూడా వెళ్లిపోవాలి. ఎందుకంటే ఆయన అమ్మమ్మ కూడా వేరే దేశంలో జన్మించారు. ట్రంప్ చెప్తున్నదాని ప్రకారం.. మీ అమ్మమ్మ అమెరికాలో జన్మించి ఉండాలి. కానీ మెలానియా తల్లి వేరే దేశంలో జన్మించారని అందరికి తెలుసు. బయటకు పంపే విషయంలో మినహాయింపులు ఉండకూడదు. జాతీయ భద్రత, వలస అంశంలో ఉల్లంఘనల గురించి ట్రంప్ సీరియస్‌గా ఉన్నందున.. ట్రంప్ సొంత కుటుంబానికి మినహాయింపు ఇవ్వకూడదు. మెలానియా వెళ్లిపోవాలి" అని ఆ పిటిషన్ పేర్కొంది.

1970లో యుగోస్లేవియాలో మెలానియా జన్మించారు. ఆమె అసలు పేరు మెలానిజా క్నావ్స్. మోడలింగ్‌లో కెరీర్‌ను వెతుక్కొంటూ 1996లో అమెరికా వచ్చారు. 2001లో గ్రీన్‌కార్డ్ పొందిన ఆమె.. 2006లో యూఎస్ పౌరురాలిగా మారారు. అమెరికా వెలుపల జన్మించిన రెండో ప్రథమ మహిళ ఆమె. ట్రంప్ నిర్ణయాల నేపథ్యంలో అసలు మోడలింగ్ కోసం మెలానియా యూఎస్ వచ్చినప్పుడు చెల్లుబాటయ్యే వీసాను కలిగిఉన్నారా..? అని పలువురు ప్రశ్నించడం ప్రారంభించారు. ఇటీవల లాస్‌ఏంజెలెస్‌లో జరిగిన ర్యాలీలో యూఎస్ కాంగ్రెస్ సభ్యురాలు మాగ్జిన్ వాటర్స్ ఇదే అనుమానం వ్యక్తంచేశారు. ఇక్కడ జన్మించిన వారి, అలాగే వారి తల్లిదండ్రులను పత్రాలను ట్రంప్ పరిశీలించాలనుకుంటే.. తొలుత ఆయన మెలానియాకు సంబంధించిన కాగితాలను చూడాలని డిమాండ్ చేశారు.

దళితులకు శిరోముండనం ఘటన

- ఒడిశా ప్రభుత్వానికి, డిజిపికి ఎన్‌హెచ్ఆర్‌సి నోటీసులు

న్యూఢిల్లీ : ఒడిశాలో ఇద్దరు వ్యక్తులను తీవ్రంగా కొట్టి, శిరోముండనం చేయించి, బలవంతంగా డ్రైనేజీ నీరు తాగించిన ఘటనలో ఆ రాష్ట్ర ప్రభుత్వానికి, డిజిపికి జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి) నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా వివరణాత్మక నివేదికను సమర్పించాల్సిందిగా ఆదేశిస్తూ ఒడిశా ప్రధాన కార్యదర్శి, డిజిపిలకు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు పరిహారం అందించాల్సి వుందని పేర్కొంది.

గంజాం జిల్లాలో ఖరీగుమా గ్రామం అనే గ్రామం వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్నారన్న ఆరోపణలతో గోగూండాలు ఎస్‌టి వర్గానికి చెందిన బాబులా నాయక్ (54), బులు నాయక్ (42) అనే ఇద్దరు వ్యక్తులను తీవ్రంగా కొట్టి, శిరోముండనం చేసి, గడ్డితినిపించి, డ్రైనేజీ నీరుతాగించిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వారిని కట్టి ఖరీగుమా గ్రామం నుంచి జహదా వరకు రెండు కిలోమీటర్ల దూరాన్ని మోకాళ్లపై నడిపించారు. ఈ ఘటన మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించి తీవ్రమైన సమస్యలను లేవనెత్తుతున్నాయని ఎన్‌హెచ్ఆర్‌సి పేర్కొంది. కాగా, ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు మొత్తం 8 మందిని అరెస్ట్ చేశారు. అయితే ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

దౌత్యపరంగా భారత్‌కు ఎదురుదెబ్బ !

- భద్రతా మండలి అధ్యక్ష పదవిని పాక్ చేపట్టడంపై కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ : ఐక్యరాజ్య సమితిలో కీలక పదవి చేపట్టకుండా పాకిస్తాన్‌ను నివారించడంలో ప్రధాని మోడీ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ బుధవారం విమర్శించింది. "భారత్‌కు ఇది ప్రధానమైన దౌత్యపరమైన ఎదురు దెబ్బ" అని వ్యాఖ్యానించింది. జులై మాసానికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలను చేపడుతున్నట్లు పాకిస్తాన్ మంగళవారం వెల్లడించింది. ఐక్యరాజ్య సమితి తీవ్రవాద వ్యతిరేక కమిటీ ఉపాధ్యక్షురాలిగా కూడా పాక్ చేయనుంది.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జివాలా ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ, తీవ్రవాద దేశమైన పాక్ ఇప్పుడు అంతర్జాతీయ సెక్యూరిటీ బ్రోకర్‌గా మారిందని విమర్శించారు. 'దెయ్యం ఇప్పుడు కుర్చీలో కూర్చుంది.' అని ఆయన వ్యాఖ్యానించారు.

తీవ్రవాద దేశంగా రుజువైన, ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తున్న, వారిని పెంచి పోషిస్తున్న, భారత్‌కు తీవ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న పాకిస్తాన్ ఇప్పుడు అంతర్జాతీయ నాయకత్వ పదవులకు ఎగబాకింది. ఒకపక్క ఆ దేశం పాల్పడుతున్న ఉగ్రవాదాన్ని భారత్ అనుభవిస్తుండగానే ఇది చోటు చేసుకుందని సూర్జివాలా విమర్శించారు. పహల్గాం దాడి జరిగిన కొద్ది వారాలకే ఇలా జరగడం పట్ల మోడీ ప్రభుత్వం మౌనంగా, నిష్క్రియాపరత్వంగా వుండడాన్ని ప్రశ్నించారు. పైగా ఐక్యరాజ్య సమితి తీవ్రవాద నిరోధక కమిటీ ఉపాధ్యక్షురాలిగా గతనెల 4న పాక్ బాధ్యతలు చేపట్టడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. ఉగ్రవాదంపై అంతర్జాతీయ తీర్మానాలను పదే పదే ఉల్లంఘించినా ఈ పదవులు వరించడాన్ని ఆయన ప్రశ్నించారు.

రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు

- **14కి విచారణ వాయిదా**

న్యూఢిల్లీ : లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై దాఖలైన పరువునష్టం కేసు విచారణను సుల్తాన్‌పూర్‌లోని ఎంపి-ఎమ్మెల్యే కోర్టు జులై 14కి బుధవారం వాయిదా వేసింది.ఈ కేసుకు సంబంధించి బుధవారం విచారణలో ఒక సాక్షిని విచారించాల్సి వుందని, కానీ ఆయన హాజరుకాకపోవడంతో విచారణను వాయిదా వేయాల్సివచ్చిందని బిజెపి ఎమ్మెల్యే విజయ్ మిశ్రా తరపు న్యాయవాది సంతోష్ కుమార్ పాండే పేర్కొన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్‌షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ విజయ్ మిశ్రా రాహుల్‌గాంధీపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఎంపి-ఎమ్మెల్యే కోర్టు 2023 డిసెంబర్‌లో రాహుల్‌కి సమన్లు జారీ చేసింది. 2024 ఫిబ్రవరిలో రాహుల్‌గాంధీ కోర్టు ఎదుట లొంగిపోగా, రూ.25,000 చొప్పున రెండు పూచీకత్తులపై బెయిల్ మంజూరు చేసింది. అదే ఏడాది జులై 26న కోర్టులో రాహుల్ గాంధీ తన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తాను నిర్దోషినని, ఈ కేసు తనపై జరిగిన రాజకీయ కుట్రలో భాగమని రాహుల్‌గాంధీ తెలిపారు.

మళ్లీ పరీక్షలు మాకొద్దు..

- ఓఎంఆర్ షీట్లు బయటపెట్టండి
- 'బెంగాల్ టీచర్ల' ఆందోళన

కొల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న 25,753 మంది టీచర్లు, ఇతర సిబ్బంది నియామకం చెల్లదంటూ సుప్రీంకోర్టు ఏప్రిల్‌లో సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అందర్నీ కూడా డిసెంబరు 31 లోగా విధుల్లో నుంచి తొలగించాలని కూడా ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'అర్హులైన', ఎలాంటి ఆరోపణల్లేని ఉపాధ్యాయులంతా బుధవారం రోడ్డెక్కారు. తమకు న్యాయం చేయాలని, మళ్లీ నియామక పరీక్ష నుంచి మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. అవినీతిని కాపాడుకొనేందుకు తృణమూల్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. కొల్‌కతాలోని కరుణమోయి నుంచి సాల్ట్ లేక్‌లోని మాధ్యమిక విద్యాశాఖ ప్రధాన కార్యాలయం బికాస్ భవన్‌కు వరకు నిరసన ర్యాలీ కొనసాగించారు. చట్టబద్ధమైన ఎంపిక ప్రక్రియ ద్వారానే తాము ఉద్యోగాలు సాధించామని, దర్యాప్తులో ఉన్న అవినీతి కుంభకోణాల్లో తమకు ఎలాంటి ప్రమేయం లేదని తెలిపారు. పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా జరిపిన ఈ కుట్రకు తాము బాధితులుగా మారిపోయామని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ కూర్చొని పరీక్ష రాసేందుకు తాము భయపడబోమన్న టీచర్లు.. అయితే, ఎలాంటి కళంకం లేనప్పుడు ఎందుకు రాయాలని ప్రశ్నించారు. 2016 టీచర్ల నియామక పరీక్షలో పారదర్శకతను తెలిపేలా తమ ఓఎంఆర్ షీట్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీచర్ రిక్రూట్‌మెంట్‌లో గందరగోళాన్ని నివారించేందుకు వీలుగా రెండు వేర్వేరు జాబితాలను విడుదల చేయాలన్నారు. ఎస్ఎస్‌సీ, రాష్ట్ర ప్రభుత్వం కళంకంలేని 15,203 మంది ఉపాధ్యాయుల జాబితాను విడుదల చేయాలని, వారందరికీ మళ్లీ పరీక్ష లేకుండా ఉద్యోగాలను తిరిగి ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఆందోళన నేపథ్యంలో బికాస్ భవన్ వద్ద టిఎంసి ప్రభుత్వం భారీగా పోలీసులను మోహరించింది.

చిట్టి గుండెలో పెద్ద కలలు

ఒక ఊరిలో చిన్ని అనే చిన్న పిల్లవాడు ఉన్నాడు. చిన్ని చాలా సాధారణమైన కుటుంబంలో పుట్టాడు. తన తల్లిదండ్రులు రైతులు, రోజూ పొలంలో కష్టపడి పనిచేస్తారు. చిన్నికి ఒక పెద్ద కల ఉంది. ఎప్పటికైనా పక్షిలా ఆకాశంలో ఎగరాలని, ఒక విమానాన్ని నడపాలని ఆశ..

చిన్ని కోరిక విని, ఊరిలోని పిల్లలు నవ్వుతారు. 'చిన్నీ, నువ్వు ఒక రైతు కొడుకువి, విమానం ఎలా నడుపుతావు? అది పెద్దల కల, నీకు అంత డబ్బు ఎక్కడిది?' అని ఎగతాళి చేస్తారు. ఎవరేమన్నా చిన్ని మాత్రం తన కలని మరువలేదు. రాత్రుళ్లు ఆకాశంలోని నక్షత్రాల వంక చూస్తూ, 'ఏదో ఒక రోజు నేను కూడా అక్కడ ఎగురుతాను!' అని అనుకుంటాడు.

చిన్ని, రోజూ పాఠశాలకు వెళతాడు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వింటాడు. పాఠాల్లో విమానాల గురించి, చదివేటప్పుడు తన కళ్ళు మెరిసేవి. ఇంటికి వచ్చిన తర్వాత, పొలంలో తల్లిదండ్రులకు సాయం చేస్తూ, చదువుకుంటాడు. పాత పుస్తకాలు, రేడియోలో వచ్చే కథలు, ఊరిలోని లైబ్రరీలో దొరికే పత్రికలు ఇవన్నీ చిన్ని జ్ఞానాన్ని పెంచాయి.

ఒక రోజు, ఊరిలో ఒక పోటీ జరిగింది. దానిలో పిల్లలు కాగితంతో విమానాలు తయారు చేసి, ఎవరిది ఎక్కువ దూరం ఎగురుతుందో చూసే పోటీ. చిన్ని రాత్రంతా కష్టపడి, విమానం తయారు చేశాడు. పోటీ రోజు, అందరూ చిన్ని విమానం చూసి నవ్వారు. 'ఇదా విమానం? ఇది ఎగరదు!" అన్నారు. కానీ చిన్ని నమ్మకం మాత్రం తగ్గలేదు. చిన్ని తన విమానాన్ని గాలిలోకి ఎగరేశాడు. అందరికంటే ఆ విమానమే ఎక్కువ దూరం ఎగిరింది! ఊరంతా కేకలు వేసి, చప్పట్లు కొట్టింది. ఆ పోటీలో చిన్ని గెలిచాడు.

సంవత్సరాలు గడిచాయి. చిన్ని కష్టపడి చదువుకుని, ఒక పెద్ద విమాన శాస్త్రవేత్తగా మారాడు. ఒక రోజు, అతను తన ఊరి పైన ఒక పెద్ద విమానాన్ని నడిపాడు. ఊరి పిల్లలంతా ఆకాశంలోకి చూస్తూ, 'చూడండి! అది చిన్ని!' అని ఆనందంతో అరిచారు.

- విస్సా కోటి హరికృష్ణ,
కన్నాయగూడెం గ్రామం,
కొయ్యలగూడెం, మండలం,
ఏలూరు జిల్లా.

నేను గీసిన బొమ్మ

సహర్షినిజ
పదవ తరగతి
జిల్లా పరిషత్
ఉన్నత పాఠశాల
హవేళి ఘణపూర్
మెదక్ జిల్లా

చుక్కలు కలపండి

సరైన ఆకృతి రాయండి
పిల్లలూ, ఇక్కడ కొన్ని ఆకృతులను ఇచ్చాం. కింద ఇచ్చిన బొమ్మలకు సరిపోయే ఆకృతిని మీరు రాయండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

నిన్నటి గురించి బాధపడకుండా, రేపటి గురించి ఆలోచించ గలిగిన వ్యక్తికి విజయం అందినట్లే.

మీ కోసం

ములక్కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే వాటిని ఒకవైపు నీటిలో ముంచి వుంచాలి.

జనం మెచ్చిన మెజీషియన్

తూర్పు గోదావరి జిల్లాలో పుట్టిన పట్టాభిరామ్ పూర్తి పేరు భావరాజు వేంకట పట్టాభిరామ్. భావరాజు సత్యనారాయణ దంపతుల 15 మంది సంతానంలో ఒకరు. సత్యనారాయణ బ్రిటిష్ గవర్నమెంటులో ఇంజినీర్‌గా పనిచేశారు. 'రావు బహుదూర్' బిరుదుతో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనని గౌరవించింది కూడా! తండ్రి గురించి పట్టాభిరామ్ ఒక ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు. 'మా నాన్న చాలా ప్రజ్ఞావంతుడు. అంతకుమించి సానుకూల దృక్పథం గలవాడు. చదువులో నేను ఎప్పుడూ యావరేజ్ స్టూడెంట్‌ని. ఒకసారి మా నాన్న నా జాతకం చూయించాడు. నేను పదో తరగతితో చదువు ఆపేస్తానని, 17 ఏళ్లకే మరణిస్తానని చెప్పారు. అప్పుడు మానాన్న నా దగ్గరికి వచ్చి, 'ఇవన్నీ చెత్త. నాకు వాటిపై నమ్మకం లేదు. నువ్వు నీపై దృష్టి పెట్టు. నీ శక్తి సామర్థ్యాలను మెరుగుపరుచుకో. నిన్ను నువ్వు తీర్చిదిద్దుకుంటేనే సమాజంలో ఇలాంటి అపనమ్మకాలను చెరిపేయగలం' అని చెప్పాడు. ఆ మాటలు నాపై చాలా ప్రభావం చూపించాయి. కానీ ఇంటర్మీడియట్ చదువు పూర్తయ్యాక ఒక ప్రమాదంలో నా కాలు బాగా దెబ్బతింది. అప్పుడు జరిగిన సర్జరీ వల్ల ఒక కాలు ఎత్తుగా, ఇంకోటి పొట్టిగా మారింది. దీంతో బయటికి వెళ్లాలంటే చాలా సిగ్గుపడేవాడ్ని. అప్పుడు మా నాన్న ఒకటే మాట అన్నాడు. 'చూడు.. ఇప్పుడు నీ కాలుకి ముల్లు గుచ్చుకుందని బాధపడుతున్నావు. కానీ అదే ముల్లు నీ కంటికి గుచ్చుకోలేదని సంతోషపడు. ఆ ఆలోచనే నిన్ను బయటికి నడిపిస్తుంది. నలుగురిలో తిరిగితే అవమానిస్తారని బాధపడడం మానేయ్! పక్కవాళ్లని పట్టించుకోకపోతేనే నిన్ను నువ్వు అభివృద్ధి చేసుకోగలవు. నీకు ఆ తెలివితేటలు ఉన్నాయి. నీ సామర్థ్యంపై నాకు నమ్మకం ఉంది అన్నారు' అని తన తండ్రి గురించి పట్టాభిరామ్ చాలా గర్వంగా చెప్పారు.

జాతకాలు చెప్పిందే జీవితం కాదని నిరూపించారు..

చదువు రాదన్న జాతకాన్ని తిప్పి పాతర వేసిన పట్టాభిరామ్, రెండు పిహెచ్‌డిలు, నాలుగు పీజీలు చేశారు. ఇంటర్ తరువాత జరిగిన ప్రమాదం వల్ల డిగ్రీలో మంచి కోర్సులు గల సీట్లు అన్నీ పూర్తి అయిపోయాయి. దీంతో కాకినాడ పిఆర్ కాలేజీలో బిఎ సైకాలజీలో ప్రవేశించారు. వ్యక్తిత్వ వికాసంపై మొదటి నుండీ ఆసక్తి ఉన్న పట్టాభిరామ్‌కి స్కూలు వయసులోనే ఇంద్రజాల విద్యపై మక్కువ ఏర్పడింది. డిగ్రీ, ఆ తరువాత ఎంఎ సైకాలజీ చేసి ప్రాక్టీస్ పెడితే కౌన్సిలింగ్ కోసం జనాలు వచ్చేవారు కాదు. దీంతో తనలో దాగున్న ఇంద్రజాల విద్యను ఆయన బయటకి తీశారు. అయితే పట్టాభిరామ్ మెజీషియన్‌గా స్థిరపడడం ఆయన తండ్రికి అసలు ఇష్టం లేదు. నాన్న కోరిక నెరవేర్చడం కోసం ఇష్టం లేకుండానే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగానికి వెళ్లారు. కానీ అక్కడ ఎక్కువ కాలం పనిచేయలేకపోయారు. తనకెంతో ఇష్టమైన వ్యక్తిత్వ వికాస ఉపన్యాసకులిగా, మెజీషియన్‌గా రాణించాలని చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చేశారు.



బి.వి.పట్టాభిరామ్.. పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు. వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా, ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్ట్‌గా, రచయితగా, ఉపన్యాసకుడిగా, నటుడిగా, యూట్యూబ్ ఛానెల్ నిర్వాహకుడిగా బహుముఖ ప్రజ్ఞ ఆయన సొంతం. ఐదు దశాబ్దాల ఆయన జీవన ప్రస్థానంలో ప్రతి మజిలీ ఓ మైలురాయిలా నిలిచిపోయింది. పట్టాభిరామ్ ఒక వ్యక్తి కాదు. తన మాటల ద్వారా, చేతల ద్వారా, సమాజాన్ని జాగృతం చేసిన బృహత్తర శక్తి ఆయన సొంతం. మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యం చేసిన ఆయనలో గొప్ప సమాజ సేవకుడు కనిపిస్తాడు. ఒత్తిడితో తల్లడిల్లే ఎందరో యువతీ యువకులకి, అవగాహనా లేమితో సంసారాలు పాడు చేసుకుంటున్న భార్యాభర్తలకి, బిడ్డల పెంపకంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో ఆయన అందె వేసిన చేయి. పట్టాభిరామ్‌ని గుర్తు చేసుకున్న ప్రతిసారీ ఆయన వల్ల జీవితాలు బాగు చేసుకున్న లక్షలమంది వ్యక్తులు మన కళ్ల ముందు మెదులుతారు. సామాన్యులే కాదు, అధికారులు, సెలబ్రిటీలు కూడా ఆ జాబితాలో ఉంటారు.

అప్పటి నుండి పట్టాభిరామ్ వెనక్కి తిరిగి చూసుకోలేదు. అంచెలంచెలుగా తన ప్రస్థానం కొనసాగింది. యండమూరి వీరేంద్రనాథ్ కాలేజీలో తనకు సీనియర్. సినీ దర్శకుడు జంధ్యాల మెజీషియన్ కాంపిటీషన్లలో పరిచయమైన ప్రియ స్నేహితుడు. వీరిద్దరి సాంగత్యం పట్టాభిరామ్‌లో దాగున్న నటనని కూడా వెలికితీసింది. పలు నాటికలు, నాటకాలు, జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన పలు చిత్రాల్లో ఆయన నటించారు.

మంత్రగాళ్లకి సవాల్ విసిరారు..

1970ల నాటికి పట్టాభిరామ్ తను కోరుకున్న ప్రస్థానాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా దూరదర్శన్‌లో అనేక మ్యాజిక్ షోలు నిర్వహించారు. మూఢ నమ్మకాలపై సవాలు విసిరే ఆ కార్యక్రమాలకు ఎంతో జనాదరణ ఉండేది. అప్పుడు జరిగిన ఒక అనుభవాన్ని ఆయన ఇలా చెప్పారు. 'యండమూరి, నేను ఆ షోలు నిర్వహించేవాళ్లం. ఒకసారి మేము మంత్రగాళ్లకి 'ఎవరైనా మాపై చేతబడి, బాణామతి, చిల్లంగి వంటివి చేసుకోండి' అని ఒక సవాలు విసిరాం. అప్పుడు ఒక ఉత్తరం మాకు వచ్చింది. మీ వెంట్రుకలు, కాలి గోళ్లు ఒక పొట్లంలో కట్టి ఫలానా దగ్గర ఉంచండి. రెండు కార్యక్రమాల తరువాత మూడో కార్యక్రమం చెప్పడానికి మీరు లేకుండా పోతారు. అదే కార్యక్రమంలో మీ చావు వార్త టెలికాస్ట్ చేస్తారు' అని రాసి వుంది. మేము మా జుత్తు, గోళ్ల అలాగే పెట్టి వచ్చాం. కానీ ఇప్పటివరకు మాకు ఏమీ జరగలేదు. వ్యక్తుల బలహీనతే ఇలాంటి వారికి గొప్ప బలంగా మారుతుంది. అందుకే మనం ఎప్పుడూ శారీరకంగానే కాదు, మానసికంగా కూడా ధృడంగా ఉండాలి' అని ఆయన చెప్పారు.

దేశవిదేశాల్లో ప్రదర్శనలు..

మానసిక శాస్త్రం, ఫిలాసఫీ గైడెన్స్ కౌన్సెలింగ్, హిప్నోథెరపీలలో అమెరికా నుండి పోస్ట్‌గ్రాడ్యుయేట్ పట్టా పుచ్చుకున్న పట్టాభిరామ్, ఒత్తిడిని జయించడం, వ్యక్తుల మధ్య సంబంధాలు, సెల్ఫ్ హిప్నాటిజం మొదలైన అంశాలపై భారతదేశంలోని అనేక ప్రాంతాలలోనే కాక, అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్, సింగపూర్, అరబ్ దేశాలలో కూడా అనేక వర్క్‌షాపులు నిర్వహించారు. హిప్నోసిస్‌పై చేసిన కృషికి గాను 1983లో ఫ్లోరిడా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటును ప్రదానం చేసింది. పలు వారపత్రికలు, దిన పత్రికల్లో పట్టాభిరామ్ వ్యక్తిత్వ వికాస వ్యాసాలు ప్రచురితమయ్యాయి. తెలుగులో ఈయన రాసిన 90కి పైగా పుస్తకాలు తమిళం, కన్నడ, మరాఠీ భాషల్లో అనువాదమయ్యాయి కూడా!

పరీక్ష ఫెయిల్ అయ్యామని, ఉద్యోగం రాలేదని నేటి యువత తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పెద్దలు, పిన్నలు అన్న తేడా లేకుండా అనారోగ్యాలతో సతమతమవుతున్నారు. పట్టాభిరామ్ స్వయంగా క్రియేట్ చేసిన 'పట్టాభి రామబాణం' యూట్యూబ్ ఛానెల్‌లో ప్రసారం చేసిన వీడియోలు అలాంటి వారికి మార్గదర్శనం చేస్తాయి. ఆ వీడియోల్లో కొన్నింటిని ఆంధ్రవిశ్వవిద్యాలయం పుస్తక రూపంలో కూడా ప్రచురించినట్లు పట్టాభిరామ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. వ్యక్తి నైపుణ్యానికి కొలమానం అతని ఎత్తు, లావు, అందం, చందం కాదు.. ఆ వ్యక్తి ఎంచుకున్న మార్గం.. అతను నడిచిన విధానమని పట్టాభిరామ్ ఆచరించి చూపించారు.

ప్రభాస్‌తో 'కల్కి 2' తర్వాతే 'స్పిరిట్'?

ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్', 'ఫౌజీ' సినిమాల షఉటింగ్‌లో బిజీగా ఉన్నారు. 'ది రాజాసాబ్' దర్శకుడు మారుతి హారర్-కామెడీ జోనర్‌లో సినిమా రూపొందిస్తున్నారు. 'ఫౌజీ' సినిమాని హను రాఘవపూడి దేశభక్తి నేపథ్యంలో చారిత్రక యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఈ రెండు సినిమాల షఉటింగ్ పూర్తయిన తర్వాతే 'స్పిరిట్' సినిమా సెట్స్‌పైకి వెళ్తుందని అభిమానులు భావించారు. అయితే ఇప్పుడు 'కల్కి 2898 ఎడి' సీక్వెల్ 'కల్కి 2' షఉటింగ్ షెడ్యూల్ ఈ ప్లాన్‌ను మార్చేలా కనిపిస్తోంది. 'కల్కి 2898 ఎడి' సినిమా నిర్మాత అశ్వినీ దత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'కల్కి 2' షఉటింగ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి 'కల్కి 2' షఉటింగ్ ప్రారంభమవుతుందని, ఇప్పటికే కొంత భాగం షఉటింగ్ పూర్తయిందని, వచ్చే ఏడాది ద్వితీయార్థంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. 'కల్కి 2' షఉటింగ్ ఈ ఏడాది చివరిలో మొదలైతే.. 'స్పిరిట్' సినిమా షఉటింగ్ మొదలుకావడం ఈ ఏడాదిలో కష్టమేనని సమాచారం. గతంలో 'స్పిరిట్' షఉటింగ్ 2024 సెప్టెంబర్‌లో ప్రారంభమవుతుందని 2025లో విడుదల కావచ్చని సందీప్‌రెడ్డి వంగా తెలిపారు. అయితే ప్రభాస్ షెడ్యూల్‌లో 'కల్కి 2' కి ప్రాధాన్యత ఇవ్వడంతో 'స్పిరిట్' షఉటింగ్ వాయిదా పడే అవకాశం ఉంది.

రామ్‌చరణ్‌తో విబేధాల్లేవు : దిల్‌రాజు

'ఎప్పుడో జనవరిలో రిలీజైన గేమ్ ఛేంజర్ గురించి పదేపదే అడిగి చంపుకు తింటున్నారు. సినిమా రిలీజై ఆరు నెలలు అయిపోయింది. ప్రతిదాంట్లో గేమ్‌ఛేంజర్ టాపిక్ తప్ప మరొకటి లేనే లేదు. ఎందుకసలు? బాగా ఆడిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా గురించి మాట్లాడరు. ఇండస్ట్రీలో ఎన్నో ఫ్లాపులు వచ్చాయి. అలాంటప్పుడు గేమ్ ఛేంజర్‌ను మాత్రమే పట్టుకుని ఎందుకు వేలాడుతున్నారు? ఇండస్ట్రీలో ఎన్నో భారీ బడ్జెట్ సినిమాలు ఫ్లాప్ అయినవి ఉన్నాయి. ఏ సినిమాను ఇంతగా పట్టించుకోలేదు. నా సోదరుడు శిరీష్ తొలిసారి ఇంటర్వ్యూ ఇస్తే ఆయన్ని కూడా వివాదంలోకి లాగి ట్రోల్ చేస్తున్నారు. ఇదంతా అవసరం లేదు కదా!. మేము 'తమ్ముడు' సినిమా కోసం ప్రమోషన్స్ చేస్తున్నాం. దాన్ని వదిలేసి ఆరు నెలల కిందట రిలీజైన సినిమా గురించే మాట్లాడుతున్నారు. రామ్‌చరణ్‌కూ, మాకు మధ్య సత్సంబంధాలున్నాయి. చరణ్‌కు ఈ ఏడాది హిట్ ఇవ్వలేకపోయాం. మంచి స్క్రిప్టు సెలక్ట్ చేసుకుని చరణ్‌తో సూపర్ హిట్ మూవీ చేస్తామని ఇదివరకే ప్రకటించాను. 22 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంటూ అందరు స్టార్‌హీరోలతో మంచి రిలేషన్ మెయింటైన్ చేస్తూ అందరితోనూ సినిమాలు తీసిన సంస్థ ఇది' నిర్మాత దిల్‌రాజు అన్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ కథానాయకుడిగా, సప్తమిగౌడ కథానాయికగా నటించిన చిత్రం 'తమ్ముడు' ఈనెల 4న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శిరీష్ మీడియాలో మాట్లాడిన విషయాలు ట్రోలింగ్‌కు గురయ్యాయి. ఈ సందర్భంగా దిల్‌రాజు పై విధంగా స్పందించారు.

గోపీచంద్ కొత్త చిత్రం 'శూల'!

గోపీచంద్ తాజాగా కొత్త సినిమాను ప్రకటించారు. 'ఘాజీ', 'ఐబీ71' సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో గోపీచంద్ 33 సినిమా రానుంది. తాజాగా ఈ చిత్రానికి 'శూల' అనే టైటిల్‌ని ఫిక్స్ చేసినట్లు సమాచారం. త్వరలో చిత్రబృందం దీనిపై ప్రకటన చేయనుంది. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా ఇటీవలె ప్రారంభమైంది. ఈ చిత్రంలో గోపీచంద్ ఒక యోధుడిగా కనిపించనున్నారు. 7వ శతాబ్దంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోందని సమాచారం.

నిహారిక నిర్మాతగా మరో సినిమా

పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద ప్రొడక్షన్ నెం.2గా నిహారిక కొణిదెల మరో చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించనున్నారు. ఈ చిత్రానికి కథను మానస శర్మ అందించగా.. స్క్రీన్ ప్లే, డైలాగ్స్‌ను మానస శర్మ, మహేష్ ఉప్పాల అందించారు. ఈ మూవీకి మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. బుధవారం ఈ చిత్ర కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకకు ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్, కళ్యాణ్ శంకర్, మల్లిది వశిష్ట వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టగా.. వశిష్ట కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి సన్నివేశానికి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ జూలై 15 నుంచి హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో జరగనుంది.

గిల్ సెంచరీ, జైస్వాల్ అర్ధసెంచరీ

- భారత్ 310/5

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులోనూ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(114 నాటౌట్) శతకంతో మెరిసాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్(87) కూడా బ్యాటింగ్‌లో రాణించడంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి భారతజట్టు 5వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. క్రీజ్‌లో శుభ్‌మన్‌కి తోడు జడేజా(41) ఉన్నారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టుకు శుభారంభం దక్కలేదు. టీ విరామ సమయానికి 3వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసిన టీమిండియాను ఓపెనర్ యశస్వి జైస్వాల్(87) మరోసారి అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. టీమిండియా 15 పరుగుల వద్ద కేఎల్ రాహుల్‌ను కోల్పోయింది. తొలి టెస్టులో సెంచరీతో కదం తొక్కిన కెఎల్ రాహుల్ కేవలం రెండు పరుగులకే పెవిలియన్ చేరాడు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో వోక్స్ వేసిన బంతిని డిఫెండ్ చేసే ప్రయత్నంలో రాహుల్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. వోక్స్ వేసిన బంతి రాహుల్ బ్యాట్‌కు తగిలి వికెట్లను గిరాటేసింది. ఆ తర్వాత యశస్వి జైస్వాల్-కరణ్ నాయర్ కలిసి 2వ వికెట్‌కు 80 పరుగులు జోడించారు. ఈ క్రమంలో జైస్వాల్ అర్ధసెంచరీని పూర్తి చేసుకోగా.. కరణ్ నాయర్ 31పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద కర్సే బౌలింగ్‌లో బ్రూక్ క్యాచ్ అందుకోవడంతో పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత కెఎల్ రాహుల్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కలిసి ధాటిగా ఆడారు. ఈ క్రమంలో జైస్వాల్ సెంచరీకి చేరువవుతున్న దశలో స్టోక్స్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ స్మిత్ క్యాచ్ అందుకోవడంతో ఔటయ్యాడు. మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ ఎక్కువగా డిఫెన్స్‌కే ప్రాధాన్యతనిస్తూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. దీంతో టీమిండియా టీ విరామ సమయానికి 3వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఆ సమయానికి క్రీజ్‌లో గిల్(42), పంత్(14) ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లు వోక్స్, కర్సే, స్టోక్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

బుమ్రా, శార్దూల్, సాయి సుదర్శన్‌కు విశ్రాంతి..

ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌కు టీమిండియా రెండు మార్పులతో బరిలోకి దిగింది. పేసర్ జస్ప్రీత్ బుమ్రా, శార్దూల్ ఠాకూర్, సాయి సుదర్శన్‌లకు విశ్రాంతి నిచ్చింది. వీరి స్థానంలో ఆకాశ్‌దీప్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డిలకు చోటు కల్పించింది. రెండో టెస్ట్‌కు బుమ్రా అందుబాటులో ఉంటాడని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రకటించినా.. జట్టు మేనేజ్‌మెంట్ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అతడికి ఈ టెస్ట్‌కు దూరంగా ఉంచాలని నిర్ణయించడం గమనార్హం. అలాగే చైనామన్ స్పిన్నర్‌ను ఆడిస్తే భారత్‌కు ప్రయోజన కరంగా ఉంటుందని మాజీ కోచ్ గ్రెగ్ చాపెల్‌తో పాటు.. సునీల్ గవస్కర్ వంటి భారత దిగ్గజ క్రికెటర్లు టీమిండియా మేనేజ్‌మెంట్‌ను సూచించినా.. అతడికి రెండో టెస్ట్ తుది జట్టులో చోటు దక్కలేదు. ఈ మణికట్టు స్పిన్నర్‌కు బదులు స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు సెలక్టర్లు తుదిజట్టులో స్థానం ఇచ్చారు. కుల్దీప్‌ను రెండో టెస్ట్‌కు ఎంపిక చేయకపోవడంపై శుభ్‌మన్ స్పందిస్తూ.. 'ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో మేము మూడు మార్పులతో బరిలోకి దిగుతున్నాం. రెడ్డి, వాషీలతో పాటు ఆకాశ్ దీప్ జట్టులోకి వచ్చారు. బుమ్రాను ఈ మ్యాచ్‌లో ఆడించడం లేదు. అతడి వర్క్‌లోడ్‌ను తగ్గించాలని ఈ నిర్ణయం తీసుకున్నామన్నాడు.

స్కోర్‌బోర్డు..

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)స్మిత్ (బి)స్టోక్స్ 87, కెఎల్ రాహుల్ (బి)క్రిస్ వోక్స్ 2, కరణ్ నాయర్ (సి)బ్రూక్ (బి)కర్సే 31, శుభ్‌మన్ గిల్ (బ్యాటింగ్) 115, పంత్ (సి)క్రాలే (బి)షబ్బీర్ 25, నితీశ్‌కుమార్ రెడ్డి (బి)వోక్స్ 1, జడేజా (బ్యాటింగ్) 40, అదనం 9. (85ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 310పరుగులు. **వికెట్ల పతనం:** 1/15, 2/55, 3/161, 4/208, 5/211

బౌలింగ్: వోక్స్ 21-6-59-2, కర్సే 16-2-49-1, టంగ్ 13-0-66-0, స్టోక్స్ 15-0-58-1, బషీర్ 19-0-65-1, రూట్ 1-0-8-0.

అదరగొట్టిన అమన్‌జ్యోత్

రెండో టి20లో ఇంగ్లండ్ మహిళలపై గెలుపు

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత మహిళలజట్టు రెండో టి20లోనూ సత్తా చాటింది. ఇంగ్లండ్ మహిళలతో మంగళవారం రాత్రి జరిగిన రెండో టి20లో భారత్ 24 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 181పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేసింది. అనంతరం ఇంగ్లండ్ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 7వికెట్లు కోల్పోయి 157పరుగులే చేయగల్గింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హర్మన్‌ప్రీత్ సేనకు శుభారంభం దక్కలేదు. తొలి టి20లో సెంచరీతో రాణించిన స్మృతి మంధాన(13), షెఫాలీ వర్మ(3) నిరాశపరిచారు. ఆ తర్వాత రోడ్రిగ్స్(63), అమన్‌జ్యోత్ కౌర్(63నాటౌట్) కలిసి టీమిండియా ఇన్నింగ్స్‌ను కుదుటపరిచారు. ఇంగ్లండ్ బౌలర్లు లారెన్ బెల్‌కు రెండు, ఫిలెర్, అర్లాట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. నల్లపురెడ్డి చరాణి (2/28)మరోసారి బౌలింగ్‌లో చెలరేగింది. ఇంగ్లండ్ జట్టులో బ్యూమౌంట్ (54) అర్ధసెంచరీతో మెరిసింది. జోన్స్(32), సోఫీ ఎక్లెస్టోన్(35నాటౌట్) ధాటిగా ఆడినా మ్యాచ్‌ను ముగించలేకపోయారు. ఈ గెలుపుతో భారత మహిళలజట్టు ఐదు టి20ల సిరీస్‌లో 2-0 ఆధిక్యతలో నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అమన్‌జ్యోత్‌కు లభించగా.. మూడో టి20 శుక్రవారం జరగనుంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)లారెన్ బెల్ (బి)అర్లాట్ 13, షెఫాలీ వర్మ (సి)అమీ జోన్స్ (బి)ఫిలెర్ 3, రోడ్రిగ్స్ (సి)డోంక్లే (బి)లారెన్ బెల్ 63, హర్మన్‌ప్రీత్ (సి)ఫిలెర్ (బి)లారెన్ బెల్ 1, అమన్‌జ్యోత్ కౌర్ (నాటౌట్) 63, రీచా ఘోష్ (నాటౌట్) 32, అదనం 6. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 181పరుగులు. వికెట్ల పతనం: 1/14, 2/30, 3/31, 4/124 బౌలింగ్: కాప్సే 1-0-11-0, లారెన్ 4-0-42-1, లారెన్ బెల్ 4-0-17-2, అర్లాట్ 4-0-43-1, ఎక్లెస్టోన్ 4-0-30-0, స్మిత్ 3-0-37-0.

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: డంక్లే (రనౌట్) దీప్తి శర్మ 1, హోడ్జ్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)దీప్తి శర్మ 1, స్కీవర్ బ్రంట్ (సి)హర్మన్‌ప్రీత్ (బి)అమన్‌జ్యోత్ 13, బ్యూమౌంట్ (రనౌట్)స్నేహ్ రాణా 54, అమీ జోన్స్ (సి అండ్ బి)ఎన్.చరాణి 32, అలైసే కాప్సే (సి)అరుంధతి రెడ్డి (బి)ఎన్.చరాణి 5, అమీలే అర్లాట్ (నాటౌట్) 12, సోఫీ ఎక్లెస్టోన్ (రనౌట్)మంధాన 35, అదనం 4. (20ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 157పరుగులు. **వికెట్ల పతనం:** 1/2, 2/2, 3/17, 4/87, 5/109, 6/157 **బౌలింగ్:** అరుంధతి 3-0-16-0, దీప్తి 4-0-30-1, చరాణి 4-0-28-2, అమన్‌జ్యోత్ కౌర్ 3-0-28-1, రాధా 4-0-38-0, స్నేహ్ 2-0-17-0.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68